జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | ఆదివారం 20 సెప్టెంబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 177 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , శ్రావణ మాసము , తిథి: చతుర్దశి - 10:34:59 వరకు నక్షత్రంమాఘ - 14:05:10 వరకు కరణంశకుని - 10:34:59 వరకు, చతుష్పాద - 21:43:34 వరకు పక్షంకృష్ణ యోగంసిద్ధ - 19:17:38 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## కొన్ని దరఖాస్తుకు లక్ష డాలర్ల ఫీజు

హెచ్-1బీపై ట్రంప్ మరో నిర్ణయం

లేఆఫ్స్ చేసే సంస్థలపై కఠిన చర్యలు

హెచ్-1బీ వీసాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. కొన్ని హెచ్-1బీ దరఖాస్తులకు 1 లక్ష డాలర్ల ఫీజును కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. అదే సమయంలో హెచ్-1బీ వీసాను స్పాన్సర్ చేసే కంపెనీలు అమెరికా ఉద్యోగులను తొలగిస్తున్నాయా?

మిగతా 2లో..

## గ్రీన్‌లాండ్ భద్రతపై శాశ్వత ఒప్పందం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటన

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రీన్‌లాండ్‌కు సంబంధించి సంచలన ప్రకటన చేశారు. గ్రీన్‌లాండ్ భద్రత, ఇతర అవసరాలపై అమెరికాకు శాశ్వత నియంత్రణ కల్పించేలా డెన్మార్క్, గ్రీన్‌లాండ్

మిగతా 2లో..



# ఫిరాయింపుదారుల్లో అలజడి

## దానంపై వేటుతో ఉక్కిరిబిక్కిరి

రాష్ట్రంలో మరో అసెంబ్లీ నియోజకవర్గానికి ఉపఎన్నిక ఖాయమైంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను హైకోర్టు అనర్హుడిగా ప్రకటించడంతో ఆ స్థానం ఖాళీ అయింది. ఖైరతాబాద్ స్థానం ఖాళీ అయినట్టు హైకోర్టు కేంద్ర ఎన్నికల సంఘానికి, రాష్ట్ర శాసనసభ కార్యదర్శికి కూడా సమాచారం ఇచ్చిన నేపథ్యంలో ఉపఎన్నిక అనివార్యమైంది. ఈ విధంగా అనర్హత వేటు పడ్డ తొలి ఎమ్మెల్యేగా దానం నాగేందర్ నిలిచారు. అయితే ఈ వేటుతో పార్టీ మారిన మిగతా ఎమ్మెల్యేల్లో అయోమయం నెలకొంది. మాపై కూడా ఎప్పుడు ఎలాంటి నిర్ణయం వెలువడుతుందోనని భయాందోళనకు గురౌతున్నారు.

- మా పరిస్థితి ఎంటని అయోమయం
- ఫిరాయింపులకు ఇకనైనా బ్రేక్‌పడేనా?
- రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం
- ఒక్క వేటుతో రాష్ట్రంలో కల్లోలం
- ఉప ఎన్నికకు సిద్ధమైన దానం!?



తెలంగాణ శాసనసభలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై పదో షెడ్యూల్ పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచే అనర్హత వర్తించేలా తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద దుమారాన్నే రేపింది. దానం నాగేందర్ పార్టీ మారినట్లుగా ఆధారాలు లేవంటూ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు రద్దు చేయడంతో, గులాబీ శ్రేణులు పండగ చేసుకుంటున్నాయి. కాంగ్రెస్‌లోకి వెళ్లిన మిగిలిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కూడా త్వరలోనే ఇదే రీతిలో అనర్హత వేటు పడుతుందని, వారి పదవులు ఊడిపోవడం ఖాయమని బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియా, మీడియా వేదికగా తీవ్ర ప్రచారం చేస్తున్నారు. అయితే, రాజకీయాలు, చట్టపరమైన అంశాలను లోతుగా పరిశీలిస్తే.. దానం నాగేందర్ కేసు పూర్తిగా వేరు, మిగిలిన ఎమ్మెల్యేల పరిస్థితి పూర్తిగా వేరు అని స్పష్టమవుతోంది. మరోవైపు దానం నాగేందర్ పైన అనర్హత వేటుతో బీఆర్ఎస్ లో కొత్త జోష్ కనిపిస్తోంది. ఇదే సమయంలో కాంగ్రెస్ నాయకత్వం పైన ఒత్తిడి పెంచే వ్యూహంలో భాగంగా మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేల పైన ఇదే తరహా పోరాటానికి సిద్ధం అవుతోంది. దీనికి సంబంధించి కేటీఆర్ స్పష్టత ఇచ్చారు. బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి.. కాంగ్రెస్ గూటికి చెందిన ఫిరాయింపు ఎమ్మెల్యేలందరికీ.. దానం నాగేందర్‌కు పట్టిన గతే పడుతుందని బీఆర్ఎస్ కేటీఆర్ హెచ్చరించారు. 'సత్యమేవ జయతే' అని

మిగతా 2లో..

## సుప్రీంను ఆశ్రయించిన దానం

అనర్హత వేటుపై ఎమ్మెల్యే దానం సవాల్

ఫైట్ చేద్దామని సీఎం రేవంత్ చెప్పారు

ఎమ్మెల్యే దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు



తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. శనివారం మధ్యాహ్నం అత్యున్నత న్యాయస్థానంలో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేశారు. దీంతో ఇప్పుడు

మిగతా 2లో..



## 20వ ఆసియా క్రీడల పండుగ

జపాన్‌లో అట్టహాసంగా ప్రారంభం..

భారత అథ్లెట్లకు ప్రధాని మోదీ విషెస్

ఆసియా ఖండంలోనే అతిపెద్ద క్రీడా సంబరం మొదలైంది. జపాన్‌లోని ఐచీ-నగోయా నగరాలు వేదికగా 20వ ఆసియా క్రీడలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నగోయాలోని మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో జరిగిన అట్టహాస వేడుకలో జపాన్ చక్రవర్తి నరుహిటో ఈ క్రీడలను అధికారికంగా ప్రారంభించినట్లు ప్రకటించారు. రాబోయే రెండు వారాల పాటు వేలాది మంది క్రీడాకారులు పతకాల కోసం పోటీ పడనున్నారు. ఈ చారిత్రాత్మక ఈవెంట్ సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, దేశ క్రీడా బృందానికి తన శుభాకాంక్షలు తెలిపారు. "ఐచీ-నగోయాలో ఆసియా క్రీడలు ప్రారంభమవుతున్న వేళ, భారత బృందానికి నా శుభాకాంక్షలు. ప్రతి

మిగతా 2లో..



## వరంగల్ కొత్త ఎయిర్‌పోర్టుకు పేరు సూచించండి

రాష్ట్ర ప్రజలను కోరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వరంగల్ మామునూరులో రానున్న కొత్త ఎయిర్‌పోర్టు

చురుగ్గా జరగుతున్న ఎయిర్‌పోర్టు పనులు

వరంగల్ మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు చేపడుతున్న చర్యలు కీలక దశకు చేరుకున్నాయి. అనుమతుల దగ్గర నుంచి భూసేకరణ, సాంకేతిక పరమైన పరిశీలన దశలను దాటుకొని నిర్మాణ పనులను 3 ప్యాకేజీలుగా చేపట్టేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. ఇప్పటికే 2 ప్యాకేజీల పనులకు వేర్వేరుగా టెండర్లు పిలిచి ప్రక్రియను పూర్తి చేసిన విషయం తెలిసిందే. మామునూరులో రానున్న కొత్త ఎయిర్‌పోర్టుకు ఏం పేరు పెట్టాలో సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. వరంగల్‌లో ప్రపంచ స్థాయి విమానాశ్రయం కల సాకారం కాబోతోందని ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటు కోసం చురుగ్గా జరగుతున్న ప్రక్రియలపై పత్రికల్లో వచ్చిన కథనాలను ఎక్స్‌లో సీఎం పోస్ట్ చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్నప్పటికీ వరంగల్ విమానాశ్రయం కలను నిజం చేయలేకపోయిందన్న

మిగతా 12లో..

## 2047నాటికి అభివృద్ధి దిశగా భారత్ అడుగులు

- దేశ అభివృద్ధిలో యువత పాత్ర చాలా కీలకం
- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో అవకాశాలు
- రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోదీ ప్రకటన
- 51 వేలకు పైగా నియామక పత్రాల పంపిణీ



2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే లక్ష్యం దిశగా భారత్ అడుగులు వేస్తోందని, ఇందులో యువత పాత్ర చాలా కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. భారత్ వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు) దేశ యువతకు కొత్త కెరీర్ అవకాశాలకు మార్గం సుగమం చేస్తున్నాయని

మిగతా 12లో..

## ముమ్మాటికీ కాంగ్రెస్ మార్క్ కరవు

- ఇది ప్రకృతి తెచ్చిన కరవు కాదు
- శ్రీశైలం జలాలపై పచ్చి అబద్ధం
- ప్రభుత్వం వాడుకోలేకపోయింది
- బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్



మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు రాష్ట్రంలోని కాంగ్రెస ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ప్రకృతి వైపరీ ం వల్ల వచ్చినవి కావని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ అసమర్థత వల్ల ఏర్పడిన కాంగ్రెస్ మార్క్ కరవు అని ఆయన ఆరోపించారు. కృష్ణా జలాలు వినియోగంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆయన ధ్వజమెత్తారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా

మిగతా 12లో..

## రాష్ట్రపతి ఏడీసీగా మేజర్ నవ్య షెకావత్

తొలి మహిళా ఆర్మీ అధికారిగా రికార్డు



రాజస్థాన్‌కు ప్రాంతానికి చెందిన మేజర్ నవ్య షెకావత్ అరుదైన మైలురాయిని చేరుకున్నారు. సికార్ జిల్లాలోని కెర్పురా గ్రామానికి చెందిన మేజర్ నవ్య రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఏడీసీగా నియామకమయ్యారు. దీంతో ఈ

మిగతా 2లో..

## శంషాబాద్ లో ఘోర రోడ్డు ప్రమాదం

కల్వర్టును ఢీకొట్టిన ఇన్నోవా వాహనం

ఒకే కుటుంబానికి చెంది నలుగురు మృతి

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో

మిగతా 2లో..





## జన్వాడ ఫాంహౌస్ పరిశీలించిన కాంగ్రెస్ నేతలు..

నాలాపై నిర్మించారన్న ఎంపీలు, హైడ్రాకు ఫిర్యాదు

ఫామ్‌హౌస్ కు బీఆర్ఎస్ శ్రేణులు రాకుండా భద్రత

ఎర్రవల్లి భూముల సర్వేలో కీలక మలుపులు

ఆ భూములు తమవే అంటున్న వెంకటాపూర్ గ్రామస్థులు

రంగారెడ్డి జిల్లా జన్వాడలోని ఫామ్‌హౌస్ మరోసారి రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల బృందం శనివారం జన్వాడ ఫామ్‌హౌస్ భూముల పరిశీలనకు వెళ్లింది.

మిగతా 12లో..



## వైఎస్, కేసీఆర్ ఫిరాయింపులను ప్రోత్సహించారు

హైకోర్టు తీర్పు కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు చెంపపెట్టు

కేంద్ర మంత్రికిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు

ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు చెంపపెట్టు అని కేంద్ర మంత్రికిషన్ రెడ్డి అన్నారు. ఈరోజు హైదరాబాదులో మీడియాతో మాట్లాడిన ఆయన... ఉమ్మడి ఏపీలో వైఎస్ రాజశేఖరరెడ్డి, తెలంగాణలో కేసీఆర్ ప్రజాస్వామ్య సూత్రాలను పక్కనబెట్టి ఫిరాయింపులను విపరీతంగా

మిగతా 2లో..

# సంపాదకీయం

## వడ్డన ఆరంభమేనా!?

నేటి యుగంలో అంతా డిజిటల్ లావాదేవీలపైనే ప్రపంచం ఆధారపడింది. ఏ చిన్న లావాదేవీ అయినా యూపీఐ పై ప్రజలు ఆధారపడుతున్నారు. ఎందుకంటే ఇది సులభతరమైన ప్రక్రియ కాబట్టి. గత పది ఏళ్ళుగా అటు వ్యాపర్రులు ఇటు ప్రజలు పూర్తిగా యూపీఐకై పట్టం కడుతున్నారు. ఇదే అదనుగా చేసుకొని కేంద్రం తాజాగా యూపీఐ లావాదేవీలపై చార్జీల గుదిబండను మోపింది. ఇది కేవలం వ్యాపారులకు మాత్రమే చెప్పి వడ్డన కార్యక్రమానికి తెర లేపింది. సాంకేతికత అభివృద్ధి చెందుతున్నకొద్దీ సౌకర్యాలు మెరుగుపడతాయనేది తెలిసిందే. అయితే ఆ సాంకేతికత వ్యాపార సూత్రంగా మారినప్పటి నుంచీ సమస్యలు మొదలవుతాయి. ఎందుకంటే వడ్డింపులు లేకుండా వ్యాపారం ఉండదు. వడ్డింపులు మొదట్లో నొప్పి తెలియకుండా ఉండీఉండనట్టుగానే ఉంటాయి. క్రమంగా డోసు పెరుగుతుంది. ప్రజలు క్రమంగా అలవాటు పడుతారులే అని వ్యాపార వర్గాలు భావిస్తుంటాయి. సాంకేతికత అభివృద్ధి చెందుతున్నకొద్దీ సౌకర్యాలు మెరుగుపడతాయనేది తెలిసిందే. అయితే ఆ సాంకేతికత వ్యాపార సూత్రంగా మారినప్పటి నుంచీ సమస్యలు మొదలవుతాయి. ఎందుకంటే వడ్డింపులు లేకుండా వ్యాపారం ఉండదు. వడ్డింపులు మొదట్లో నొప్పి తెలియకుండా ఉండీఉండనట్టుగానే ఉంటాయి. క్రమంగా డోసు పెరుగుతుంది. ప్రజలు క్రమంగా అలవాటు పడుతారులే అని వ్యాపార వర్గాలు భావిస్తుంటాయి. ఈ సూత్రం తాజాగా యూపీఐ అనే ఆన్‌లైన్ చెల్లింపుల వ్యవస్థకూ వర్తిస్తున్నదా? అనే సందేహాలు సామాన్యుల్లో మొదలయ్యాయి. 2016లో మొదలైన యూపీఐ విధానంలో సెల్‌ఫోన్లు లేదా ఇతర ఆన్‌లైన్ పద్ధతుల్లో క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా చెల్లింపులు చిటికెలో జరిపే సౌలభ్యం ఏర్పడింది. పాలు, కూరగాయలు మొదలుకొని పచారీ సామాను దాకా యూపీఐపై చెల్లింపులు జోరుగా సాగుతుండటం మనం చూస్తున్నాం.టీ తాగినా, బిస్కెట్ పొట్లం కొన్నా సెల్‌ఫోన్ తీయడం.. స్కాన్ చేసి చెల్లింపు జరుపడం సర్వసాధారణం అయిపోయింది. ఎలాంటి చార్జీలు ఉండవనే నమ్మకం కారణంగా ఈ చెల్లింపుల వ్యవస్థ అంచెలంచెలుగా ఎదిగింది. కేవలం గత నెలలోనే 2,451 కోట్ల లావాదేవీల కింద రూ. 29.82 లక్షల కోట్ల చెల్లింపులు జరిగాయి. నిరుడు అంటే 2025-26 లెక్కలు తీసుకుంటే రూ.24,162 కోట్ల లావాదేవీలకుగాను రూ.314 లక్షల కోట్ల చెల్లింపులు జరిగాయి. ఫోన్‌పే (45.9 శాతం), గూగుల్ పే (32.4 శాతం), పేటీఎం (8.1 శాతం) వాటాతో మొదటి మూడు స్థానాలను ఆక్రమించాయి. పదేండ్ల క్రితం చిన్న మొక్కగా మొదలైన యూపీఐ చెల్లింపుల వ్యవస్థ ఇప్పుడు వటవృక్షం స్థాయికి ఎదిగింది. అయితే కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన కొన్నిరకాల రుసుములతో యూపీఐ వేగానికి బ్రేకులు పడుతాయా? అనే అనుమానాలు మొదలయ్యాయి. అయితే ఎంతో కొంత చార్జీ చేయకుండా ఉచిత సేవ ఎన్నాళ్లు కొనసాగిస్తారనే వాదనలూ వినిపిస్తున్నాయి. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ) యూపీఐ చెల్లింపుల విధానంలో కీలక మార్పులు చేసింది. తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్ వినియోగదారుల్లో కలకలం సృష్టించింది. ఇకపై వ్యక్తుల నుంచి వ్యాపారికి (పీ2ఎం) రూ. 2,000కు పైబడి జరిపే యూపీఐ చెల్లింపులపై 0.4% మేర మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధిస్తారు. ఈ సుంకం చెల్లింపు మొత్తం పెరుగుతున్నకొద్దీ మారుతుంది. ఈ అదనపు చార్జీ వినియోగదారులు కాకుండా వ్యాపారులే బ్యాంకులు, చెల్లింపు సేవా సంస్థలకు చెల్లించాల్సి ఉంటుంది. అయితే రూ. 2,000 లోపు లావాదేవీలకు ఎలాంటి చార్జీలూ ఉండవు. యూపీఐ వ్యవస్థను దీర్ఘకాలికంగా నిలబెట్టేందుకు, బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలకు ఆదాయం కల్పించేందుకు తీసుకున్నట్టుగా చెప్తున్న ఈ నిర్ణయం యూపీఐ చెల్లింపులపై తీవ్ర ప్రభావం చూపుతుందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రుసుమును వ్యాపారులే భరించాలని, వినియోగదారులపై దీనిని రుద్దకుండా చూస్తామని అంటున్నప్పటికీ ఈ వివరణ అంతగా నమ్మకం కలిగించలేకపోతున్నది. ఇందుకు రెండు కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి; వ్యాపారులు ఈ అదనపు భారాన్ని వినియోగదారుల మీదకు నెడుతారనే అనుమానాలు వ్యక్తం కావడం. రెండు; మొత్తంగా ఈ చెల్లింపులను నిరాకరించే అవకాశాలు ఉండటం. అయితే కొన్ని మినహాయింపులూ ఇవ్వడం గమనార్హం. రూ. 2,000 వరకు చెల్లింపులపై ఎలాంటి రుసుమూ ఉండదు. ఆ పైచిలుకు చెల్లింపులను వ్యాపారులు నగదు రూపంలో చెల్లించాలని డిమాండ్ చేస్తే వినియోగదారుకు వేరే మార్గం ఉండదనేది తెలిసిందే. గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల్లో జరిపే చెల్లింపులపై ఈ ఎండీఆర్ రుసుము ఏమాత్రం వర్తించదు. వ్యక్తిగత స్థాయిలో జరిపే లావాదేవీలు పూర్తిగా ఉచితమే. యూపీఐ వ్యవస్థ నిర్వహణ, విస్తరణ వ్యయాన్ని ఇంతవరకు ప్రభుత్వం, బ్యాంకు లు, చెల్లింపు సంస్థలు భరిస్తున్నాయి. ఏది ఏమైనా ఈ బాదుడు ప్రక్రియ మాత్రం ఆరంభమే. కానీ ముమ్ముందు మరింత పెంతే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇకముందు వ్యాపరులకే కాకుండా వినియోగదారులపై కూడా ధరాభారం మోపే అవకాశాలు లేకపోలేదని అంటున్నారు.

## వైఎస్, కేసీఆర్ ఫిరాయింపులను ప్రోత్సహించారు

మొదటిపేజీ తరువాయి..

ప్రోత్సహించారని ఆరోపించారు. గతంలో సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లకు ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయకుండానే మంత్రి పదవులు కట్టబెట్టారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే దానం నాగేందర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారని, బీజేపీ శ్రేణులు జరిపిన నిరంతర న్యాయపోరాటం వల్లే ఆయనపై అనర్హత వేటు ముప్పు వచ్చిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రెండూ భూదందాలు, అవినీతిలోనే పోటీపడుతున్నాయని... 'దోచుకోవడం-దాచుకోవడం' తప్ప ప్రజాక్షేమం పట్టడం లేదని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ పాలనపై అనేక అవినీతి ఆరోపణలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పటివరకు వారిపై ఏలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా 'మ్యాచ్ ఫిక్సింగ్' రాజకీయాలు నడుపుతున్నారని విమర్శించారు. ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు నెరవేర్చలేక ప్రజల దృష్టిని మళ్లించడానికే ఇరు పార్టీలు పరస్పరం నాటకాలు ఆడుతున్నాయని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఏ ప్రాతిపదికన ఇచ్చారో రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాబోయే ఏ ఎన్నికలకైనా బీజేపీ సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని వెల్లడించారు.

## 20వ ఆసియా క్రీడల పండుగ

మొదటిపేజీ తరువాయి..

క్రీడాకారుడు అద్భుతమైన కృషి, అంకితభావం, దృఢ సంకల్పాన్ని ప్రదర్శించారు. వారిని చూసి భారతదేశం గర్విస్తోంది. వారు తమ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలి, బాగా ఆడాలి, ప్రకాశించాలి!" అని ప్రధాని 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. ప్రారంభోత్సవ వేడుక భారత్‌కు ఎంతో ప్రత్యేకంగా నిలిచింది. ఒలింపిక్ పతక విజేత, షూటర్ మను భాకర్, కబడ్డీ స్టార్ పవన్ సెహ్రావత్ భారత బృందానికి పతాకధారులుగా ముందుండి నడిపించారు. త్రివర్ణ పతాకాన్ని చేతబూని స్టేడియంలోకి అడుగుపెట్టిన వీరిపై దేశం భారీ అంచనాలు పెట్టుకుంది. 2023లో హాంగ్‌జౌలో జరిగిన గత ఆసియా క్రీడల్లో 28 స్వర్ణాలతో సహా మొత్తం 107 పతకాలు సాధించి భారత్ రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. ఈసారి ఆ రికార్డును అధిగమించాలనే లక్ష్యంతో భారత బృందం బరిలోకి దిగుతోంది. ఆసియా క్రీడలకు జపాన్ ఆతిథ్యం ఇవ్వడం ఇది మూడోసారి. గతంలో 1958లో టోక్యోలో, 1994లో హిరోషిమాలో ఈ పోటీలు జరిగాయి. ఈసారి 45 దేశాలకు చెందిన క్రీడాకారులు 43 క్రీడాంశాల్లో తలపడనున్నారు. ఈ పోటీల్లో భారత్ పలు క్రీడల్లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. పురుషుల, మహిళల క్రికెట్, కబడ్డీ జట్లతో పాటు, పురుషుల హాకీ జట్టు కూడా తమ టైటిళ్లను నిలబెట్టుకోవాలని చూస్తోంది. బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు, వెయిట్‌లిఫ్టింగ్‌లో మీరాబాయి చాను భారత ప్రచారానికి నాయకత్వం వహించనున్నారు. షూటింగ్‌లో మను భాకర్, రెజ్లింగ్‌లో అమన్ సెహ్రావత్, బాక్సింగ్‌లో లవ్లీనా బోర్గోహెన్ వంటి ప్రముఖులు పతకాలపై కన్నేశారు. అథ్లెటిక్స్‌లో 75 మందికి పైగా భారత క్రీడాకారులు బరిలో ఉన్నారు. గుల్వీర్ సింగ్, తేజస్విన్ శంకర్, జ్యోతి యర్రాజీ, పారుల్ చౌదరి వంటి అథ్లెట్లు తమ సత్తా చాటడానికి సిద్ధమయ్యారు. షాట్‌పుట్‌లో తజిందర్‌పాల్ సింగ్ తూర్ వరుసగా రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిచి, ఈసారి కూడా ఫేవరెట్‌గా పోటీ పడుతున్నాడు.

# ఫిరాయింపుదారుల్లో అలజడి

మొదటిపేజీ తరువాయి..

తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాయించిన మిగతా ఎమ్మెల్యేల స్థానాల్లోనూ ఉప ఎన్నికలు వస్తాయని చెప్పుకొచ్చారు. తెలంగాణ హైకోర్టు దానం నాగేందర్‌పై అనర్హతవేటు విధిస్తూ ఇచ్చినతీర్పు.. రాజ్యాంగం పట్ల అధికార కాంగ్రెస్ ద్వంద్వ నీతిని బట్టబయలు చేసిందని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు ఆరోపించారు. దానం నాగేందర్ పైన తీర్పు వచ్చిన వెంటనే న్యాయ నిపుణులతో బీఆర్ఎస్ నేతలు కీలక మంత్రాంగం చేసారు. మిగిలిన ఎమ్మెల్యేల పైనా పార్టీ మారారని నిరూపణకు వీలుగా అన్ని ఆధారాలు సిద్దం చేసుకోవాలని నిర్ణయించారు. వీరి పైనా న్యాయ పరంగా ముందుకు వెళ్లాలని డిసైడ్ అయ్యారు. ఈ పరిణామాల పైన స్పందించిన సీనియర్ నేత హరీష్ రావు.. హైకోర్టు తీర్పు నేపథ్యంలో స్పీకర్ కనీసం ఇప్పుడైనా స్పందించాలని.. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి ఫిరాయించిన ఇతర ఎమ్మెల్యేలందరిపై ఉన్న అనర్హత పిటిషన్ల మీద రాజ్యాంగం ప్రకారం, చట్ట ప్రకారం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. దేశమంతా తిరిగి తానేదో రాజ్యాంగాన్ని రక్షించే చాంపియన్‌ని అని చెప్పుకొనే రాహుల్ గాంధీ కపట నాటకాలు ఈ ఘటనతో బహిర్గతం అయ్యాయని వ్యాఖ్యానించారు. దానం లాగానే పార్టీ ఫిరాయించిన మిగిలిన 8 మంది పైనా అనర్హత వేటు పడే వరకూ పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

మరోవైపు దానం నాగేందర్ చట్టపరమైన ఉచ్చులో చిక్కుకోవడానికి ప్రధాన కారణం ఆయన కాంగ్రెస్ బి-ఫామ్‌పై సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి అధికారికంగా పోటీ చేయడమే. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ ప్రకారం.. ఒక పార్టీ నుంచి గెలిచిన ప్రజాప్రతినిధి వేరే పార్టీ తరఫున ప్రత్యక్షంగా ఎన్నికల్లో నామినేషన్ వేసి బి-ఫామ్ సమర్పిస్తే, ఆయన తన మాతృక పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా త్యజించినట్లే పరిగణిస్తారు. దానం నాగేందర్ స్వయంగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడమే ఆయన ఫిరాయింపునకు తిరుగులేని ఆధారంగా మారింది. ఈ సాంకేతిక విషయాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకుని అనర్హత విధించింది.కానీ, కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న మిగిలిన ఎమ్మెల్యేల వ్యవహారం దానం కేసు లాంటిది కాదు. వారెవరూ మరో పార్టీ బి-ఫామ్‌పై పోటీ చేయలేదు, అధికారికంగా ఎలాంటి నామినేషన్ దాఖలు చేయలేదు. కేవలం కాంగ్రెస్ నేతలను కలవడం, గులాబీ కండువాలు తీసి కాంగ్రెస్ కండువాలు కప్పుకోవడం లేదా ప్రభుత్వ వేదికలపై కనిపించడం వంటివి కోర్టుల్లో చట్టబద్ధమైన పార్టీ ఫిరాయింపు కిందకు రావని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన పలు తీర్పులు తేల్చిచెప్పాయి. ఫోటోలు, పేపర్ క్లిప్పింగ్‌లు కోర్టుల్లో నిలబడే ఆధారాలు కావని, అసెంబ్లీ రికార్డుల ప్రకారం వారంతా ఇప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలేననే సాంకేతిక వెసులుబాటు వారికి కొండంత అండగా ఉంది.

గతంలో 2014 శాసనసభ ఎన్నికల తర్వాత అసెంబ్లీలో తెలుగుదేశం, కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరారు. అయితే తెలుగుదేశం నుంచి గెలిచిన 15 మందిలో 12 మంది చేరే వరకు స్పీకర్ ఎలాంటి చర్య తీసుకోలేదు. 12 మంది చేరిన తర్వాత రెండింట మూడొంతుల మెజార్టీ రావడంతో తెలుగుదేశం శాసనసభా పక్షాన్నే విలీనం చేశారు. తెలుగుదేశం నుంచి గెలిచిన తలసాని శ్రీనివాస్ యాదవ్ 2015లో మంత్రిగా బాధ్యతలు చేపట్టగా, 2016 మార్చిలో తెలుగుదేశం శాసనసభా పక్షం విలీనమైంది. అప్పటి వరకు దశల వారీగా ఎమ్మెల్యేల చేరిక జరిగింది. 21 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో ఏడుగురే బీఆర్ఎస్ లో చేరారు. దాంతో విలీనానికి అవకాశం లేకుండా పోయింది. స్పీకర్‌కు ఫిర్యాదు చేసినా చర్య వాయిదా వేస్తూ వచ్చి చివరకు ఎలాంటి సమస్య లేకుండానే ఐదేళ్లు పూర్తి చేశారు.

గతంలో 2014 శాసనసభ ఎన్నికల తర్వాత అసెంబ్లీలో తెలుగుదేశం, కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరారు. అయితే తెలుగుదేశం నుంచి గెలిచిన 15 మందిలో 12 మంది చేరే వరకు స్పీకర్ ఎలాంటి చర్య తీసుకోలేదు. 12 మంది చేరిన తర్వాత రెండింట మూడొంతుల మెజార్టీ రావడంతో తెలుగుదేశం శాసనసభా పక్షాన్నే విలీనం చేశారు. తెలుగుదేశం నుంచి గెలిచిన తలసాని శ్రీనివాస్ యాదవ్ 2015లో మంత్రిగా బాధ్యతలు చేపట్టగా, 2016 మార్చిలో తెలుగుదేశం శాసనసభా పక్షం విలీనమైంది. అప్పటి వరకు దశల వారీగా ఎమ్మెల్యేల చేరిక జరిగింది. 21 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో ఏడుగురే బీఆర్ఎస్ లో చేరారు. దాంతో విలీనానికి అవకాశం లేకుండా పోయింది. స్పీకర్‌కు ఫిర్యాదు చేసినా చర్య వాయిదా వేస్తూ వచ్చి చివరకు ఎలాంటి సమస్య లేకుండానే ఐదేళ్లు పూర్తి చేశారు. 2019లో మాత్రం 18 మందికి గానూ 12 మంది చేరడంతో రెండింట మూడొంతుల మెజార్టీ వచ్చి విలీనానికి అవకాశం ఏర్పడింది. ఆ సమయంలో సబితా ఇంద్రారెడ్డి మంత్రిగా పని చేశారు. అప్పుడు కూడా 2019లో మార్చిలో ప్రారంభమై జూన్ వరకు దశల వారీగా చేరికలు జరిగాయి. కాంగ్రెస్ స్పీకర్‌కు ఫిర్యాదు చేయడం వరకే పరిమితమైంది. కానీ ఇప్పుడు బీఆర్ఎస్ అడుగడుగునా గట్టిగా పోరాడింది. స్పీకర్, హైకోర్టు, సుప్రీంకోర్టు, మళ్లీ హైకోర్టుకు ఇలా గట్టిగా చేసిన పోరాటం వల్ల ఒక ఎమ్మెల్యే పదవిని కోల్పోగా, మిగిలిన వారి విషయంలో ఏం జరుగుతుందో అన్న ఆసక్తి అన్ని రాజకీయ పార్టీల్లోనూ నెలకొంది. తాజాగా హైకోర్టు ఇచ్చిన తీర్పు వల్ల అయినా ఫిరాయింపులకు బ్రేక్ పడుతుందా? అన్నది చర్చనీయాంశంగా మారింది.

అంతేకాకుండా, స్పీకర్ ట్రిబ్యునల్ పరిధిలోని అధికారాల్లో కోర్టులు నేరుగా జోక్యం చేసుకోవు. దానం నాగేందర్ కేసులో స్పష్టమైన బి-ఫామ్ ఆధారం ఉంది కాబట్టి తీర్పు వేగంగా వచ్చింది. కానీ మిగిలిన ఎమ్మెల్యేల విషయంలో అలాంటి అధికారిక దస్తావేజులు లేకపోవడంతో, స్పీకర్ ముందు విచారణ ప్రక్రియ సుదీర్ఘంగా సాగే అవకాశం ఉంది. ప్రతి కేసునూ వేర్వేరుగా విచారించి ఆధారాలు బేరీజు వేయాల్సి ఉండటం కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఆ ఎమ్మెల్యేలకు కాలయాపన చేసే వీలును కల్పిస్తోంది. అందుకే బీఆర్ఎస్ నేతలు మీడియా వేదికగా ఎంత హడావుడి చేస్తున్నప్పటికీ, మిగిలిన ఎమ్మెల్యేలు , కాంగ్రెస్ నాయకత్వం ఈ పరిణామాలను పూర్తిగా లైట్ తీసుకుంటున్నాయి. చట్టంలోని లొసుగులు, కోర్టుల పరిమితులు తమకు అనుకూలంగా ఉన్నాయని భావిస్తుండటంతో.. దానం తీర్పు మిగిలిన 8 మంది ఎమ్మెల్యేల పదవులకు తక్షణమే ఎలాంటి ముప్పు తీసుకురాలేదని న్యాయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

## సుప్రీంను ఆశ్రయించిన దానం

మొదటిపేజీ తరువాయి..

దానం నాగేందర్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరిస్తుందా.. లేదా.. ఒకవేళ స్వీకరిస్తే తదుపరి న్యాయ ప్రక్రియ ఎలా సాగుతుంది అనే అంశాలపై ఆసక్తి నెలకొంది.దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ తెలంగాణ హైకోర్టు శుక్రవారం సంచలన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ తరఫున 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్ .. అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. అప్పటికి ఆయన ఎమ్మెల్యేగా కొనసాగుతుండటాన్ని ప్రస్తావిస్తూ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అనర్హత పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు.. స్పీకర్ గడ్డం ప్రసాద్ గతంలో ఇచ్చిన నిర్ణయాన్ని పక్కనపెట్టి దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించింది. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనల ప్రకారం ఈ అనర్హత వర్తిస్తుందని పేర్కొంది. హైకోర్టు తీర్పు ప్రకారం అనర్హత 2024 ఏప్రిల్ 23వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని పేర్కొంది. అలాగే ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉన్నట్లు పరిగణనలోకి తీసుకోవాలని.. తీర్పు ప్రతులను అసెంబ్లీ స్పీకర్ కార్యాలయంతో పాటు ఎన్నికల సంఘానికి పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది. హైకోర్టు తీర్పుపై తదుపరి న్యాయపోరాటంలో భాగంగానే దానం నాగేందర్ ఎస్ఎల్‌పీ దాఖలు చేశారు. అయితే కేవలం ఎస్ఎల్‌పీ దాఖలు చేయడంతో హైకోర్టు తీర్పుపై ఆటోమేటిక్‌గా స్టే వచ్చినట్లు కాదని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ముందుగా సుప్రీంకోర్టు పిటిషన్‌ను పరిశీలించి దానిని విచారణకు స్వీకరించాలా లేదా అనే అంశంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఎస్ఎల్‌పీని విచారణకు స్వీకరించి అప్పీల్‌కు అనుమతిస్తే.. హైకోర్టు తీర్పులోని న్యాయపరమైన అంశాలను సుప్రీంకోర్టు పరిశీలించే అవకాశం ఉంటుంది. అదే సమయంలో హైకోర్టు తీర్పు అమలుపై మధ్యంతర ఉపశమనం కోరితే.. దానిపై కూడా సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల దానం నాగేందర్ పిటిషన్ దాఖలు చేయడం ఒక దశ కాగా.. దానిని సుప్రీంకోర్టు ఎలా స్వీకరిస్తుంది, తదుపరి ఎలాంటి ఆదేశాలు ఇస్తుంది అనేది కీలకంగా మారింది. ఇదే కేసులో పిటిషనర్లు అయిన బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సుప్రీంకోర్టులో కేవియట్లు దాఖలు చేశారు. దానం నాగేందర్ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే తమ వాదనలు కూడా వినాలని వారు కేవియట్ ద్వారా కోరారు. కేవియట్ ఉండటం వల్ల పిటిషన్‌పై ఏకపక్షంగా ఆదేశాలు జారీ చేయకుండా సంబంధిత పక్షానికి నోటీసు లేదా వాదనలు వినే అవకాశం ఉంటుంది. దీంతో దానం నాగేందర్ ఎస్ఎల్‌పీపై జరిగే తదుపరి విచారణలో ఈ ఇద్దరు నేతల తరఫున న్యాయవాదుల వాదనలు కూడా ప్రాధాన్యం సంతరించుకునే అవకాశం ఉంది. హైకోర్టు తీర్పుతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా పరిగణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో ఇప్పుడు తదుపరి న్యాయపరిణామాలపై ఉత్కంఠ నెలకొంది. సుప్రీంకోర్టు ఎస్ఎల్‌పీని స్వీకరిస్తుందా.. మధ్యంతర ఉపశమనం ఇస్తుందా.. హైకోర్టు తీర్పుపై తదుపరి విచారణకు మార్గం సుగమం చేస్తుందా అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు దానం నాగేందర్ మాత్రం ప్రజాక్షేత్రంలో పోరాడతానని.. అవసరమైతే ఉప ఎన్నికకు సిద్ధంగా ఉన్నానని ఇప్పటికే కీలక వ్యాఖ్యలు చేశారు.

మరోవైపు తనను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై దానం నాగేందర్ తాజాగా స్పందించారు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ తాను సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచన లేదని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టుకు వెళ్లాలా? వద్దా? అనేది స్పీకర్ నిర్ణయించాలని వ్యాఖ్యానించారు. ఇవాళ ఉదయం ఓ న్యూస్ చానల్‌తో మాట్లాడిన ఆయన.. తీర్పు కాపీని పూర్తిగా చదివానని తెలిపారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక జరిగితే తాను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఎన్నికలు తనకు కొత్త కాదని, ఎన్నికల్లో పోరాడేందుకు తాను ఇష్టపడతానని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని తన కార్యకర్తలకు కూడా చెబుతున్నానన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసినట్లు వెల్లడించిన దానం.. 'నువ్వు ఫైటర్‌వి.. ఫైట్ చేద్దాం' అని సీఎం చెప్పినట్లు తెలిపారు. తాను ఇదే చేస్తానని చెప్పారు. కాగా, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం 2024లో కాంగ్రెస్‌లో చేరారు. అయితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్ తరఫున 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఈ పరిణామాన్ని ఆధారంగా చేసుకుని ఆయనపై పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ స్పీకర్‌కు ఫిర్యాదు చేసింది. దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి 2024 మార్చి 18న అసెంబ్లీ స్పీకర్‌కు పిటిషన్ దాఖలు చేశారు. ఆ తర్వాత బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కూడా 2024 జూలై 1న స్పీకర్‌ను ఆశ్రయించారు. పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందంటూ పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు 2025 జూలై 31న స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

## రాష్ట్రపతి ఏడీసీగా మేజర్ నవ్య షెకావత్

మొదటిపేజీ తరువాయి..

ఘనత సాధించిన మొదటి ఆర్మీ మహిళా అధికారిగా రికార్డు సృష్టించారు. దేశంలో రాష్ట్రపతికి ఏడీసీగా నియమితులైన రెండో మహిళా అధికారిగా నిలిచారు. 2025లో ఇండియన్ నేవీకి చెందిన లెఫ్టినెంట్ కమాండర్ యశస్వి సోలంకి ఈ పదవిని చేపట్టిన తొలి మహిళగా రికార్డు సృష్టించారు. ఇప్పుడు ఆర్మీ నుంచి నవ్య షెకావత్ ఆ గౌరవాన్ని దక్కించుకున్నారు. జులై 2026లో ఈ నియామకం జరగ్గా, ప్రస్తుతం ఆమె రాష్ట్రపతి భవన్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మేజర్ నవ్య షెకావత్‌ది పూర్తిగా సైనిక కుటుంబం. సికార్ జిల్లాలోని కేర్పురా అనే చిన్న గ్రామానికి చెందిన నవ్య కుటుంబం మూడు తరాల వారు సైన్యంలో పనిచేశారు. ఆమె తాత భన్వర్ సింగ్ షెకావత్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో వింగ్ కమాండర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. ఆమె తండ్రి గ్రూప్ కెప్టెన్ కరణ్ సింగ్ షెకావత్ ప్రస్తుతం ఎయిర్‌ఫోర్స్‌లోనే ఉన్నత హోదాలో సేవలు అందిస్తున్నారు. మూడో తరమైన నవ్య ప్రస్తుతం ఆర్మీలో మేజర్‌గా పనిచేస్తున్నారు. నవ్య తన స్కూలు, కాలేజీ చదువులు పూర్తి చేసిన తర్వాత సైన్యంలో సేవలందించాలని అనుకున్నారు. అందుకోసం కేంద్ర ప్రభుత్వం నిర్వహించే కఠినమైన యూపీఎస్సీ 'సీడీఎస్' పరీక్షను రాశారు. తొలి ప్రయత్నంలోనే ఆ పరీక్షలో మంచి మార్కులు సాధించారు. ఆ తర్వాత చెన్నైలోని ప్రతిష్టాత్మక 'ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ'లో శిక్షణ తీసుకున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత 2021వ సంవత్సరంలో ఆమెకు భారతీయ సైన్యంలోని 'ఆర్మీ సర్వీస్ కార్ప్స్' విభాగంలో అధికారిగా అవకాశం లభించింది. ఈ విభాగం సైన్యానికి కావాల్సిన ఆహారం, వస్తువులు, రవాణా, ఇతర ముఖ్యమైన సహాయాలను అందిస్తుంది. ఈ శాఖలో అంకితభావంతో పనిచేస్తూ కేవలం ఐదేళ్లలోనే మేజర్ స్థాయికి ఎదిగారు. ఇప్పుడు నేరుగా రాష్ట్రపతి భవన్ వరకు వెళ్లి దేశం దృష్టిని ఆకర్షించారు. చాలామందికి ఏడీసీ అంటే ఏమిటో తెలియదు. రాష్ట్రపతి అధికారికంగా పాల్గొనే పర్యటనలు, సమావేశాలు, పరేడ్‌లు, ముఖ్యమైన కార్యక్రమాల్లో రాష్ట్రపతికి సహాయకులుగా ఉండే ప్రత్యేక సైనిక అధికారులనే 'ఏడీసీ' అంటారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగే ప్రతి కార్యక్రమం సజావుగా జరిగేలా చూసుకోవడం వీరి ప్రధాన బాధ్యత. విదేశీ అతిథులు వచ్చినప్పుడు వారికి మర్యాదలు చేయడం, ప్రోటోకాల్ అమలు చేస్తారు. సాధారణంగా రాష్ట్రపతికి సహాయకులుగా ఐదుగురు ఏడీసీలు ఉంటారు. వీరిలో ముగ్గురు ఆర్మీ నుంచి, ఒకరు నేవీ నుంచి, మరొకరు ఎయిర్‌ఫోర్స్ నుంచి ఎంపికవుతారు. ఇప్పుడు ఆర్మీ నుంచి ఎంపికైన వారిలో మేజర్ నవ్య ఒకరు. మేజర్ నవ్య శెఖావత్ ప్రయాణం ఒక పరీక్షలో విజయం సాధించడం మాత్రమే కెరీర్‌కు ముగింపు కాదని, ఆ తర్వాతి శిక్షణ, క్రమశిక్షణ, పనితీరు, బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించడం కూడా ఎంత ముఖ్యమో చూపిస్తోంది. రాష్ట్రపతి భవన్‌లో ఆమెకు లభించిన ఈ బాధ్యత భారత సైన్యంలో మహిళా అధికారుల పెరుగుతున్న ప్రాతినిధ్యానికి మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.



## గ్రీన్‌లాండ్ భద్రతపై శాశ్వత ఒప్పందం

మొదటిపేజీ తరువాయి..

ప్రభుత్వాలతో చారిత్రక ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించారు. గ్రీన్‌ల్యాండ్, అమెరికా భద్రతను కాపాడేందుకు.. డెన్మార్క్, గ్రీన్‌లాండ్ ప్రతినిధులతో కలిసి పనిచేశామన్నారు. ఈ శాశ్వత ఒప్పందానికి అమెరికా ఎలాంటి ఖర్చు చేయాల్సిన అవసరం లేదని తెలిపారు. తాజా ఒప్పందం ప్రకారం.. అమెరికా లిఖితపూర్వక అనుమతి లేకుండా గ్రీన్‌లాండ్‌లో మరో ఇతర దేశం సైనిక స్థావరాలు ఏర్పాటు చేయడం, పెట్టుబడులు పెట్టడం సాధ్యం కాదన్నారు. త్వరలో గ్రీన్‌లాండ్ ప్రజల సహకారంతో అనువైన ప్రాంతంలో



భారీ సైనిక స్థావరాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. 100 ఏళ్లుగా గ్రీన్‌లాండ్‌కు సంబంధించి అంశాల గురించి గతంలో పనిచేసిన అధ్యక్షులకు అన్ని విషయాలు తెలిసినా ఎవరూ ఏమీ చేయలేకపోయారని.. ఈ అత్యంత కీలకమైన అంశాన్ని శాశ్వతంగా పరిష్కరించిన అధ్యక్షుడిగా ఉండటం తనకు గర్వంగా ఉందన్నారు. ఈ ఒప్పందానికి అంతం లేదని.. తనకు ఎంతో గౌరవంగా, గర్వంగా ఉందన్నారు. ఈ ఒప్పందం ప్రకారం అంగీకరించిన ప్రతి విషయాన్ని అమెరికా ప్రజలు గుర్తు పెట్టుకుంటారన్నారు. గ్రీన్‌లాండ్‌లో ఎన్నో అనేక అనువైన ప్రాంతాలు ఉన్నాయని.. వాటిలో ఒక పెద్ద సైనిక కేంద్రాన్ని ఏర్పాటు చేసే ప్రక్రియను తాము వెంటనే ప్రారంభిస్తామన్నారు. గ్రీన్‌లాండ్ అభివృద్ధి, నిర్మాణంలో అక్కడి ప్రజలతో కలిసి పనిచేస్తామన్నారు. తాము చేసుకున్న ఈ ఒప్పందం ప్రకారం అమెరికా, డెన్మార్క్, గ్రీన్‌లాండ్ మిత్రదేశాలన్నింటికీ ఎంతో మేలు చేసేదన్నారు ట్రంప్. ఈ వ్యూహాత్మకమైన ఒప్పందంలో భాగంగా ఒక ఉజ్వల భవిష్యత్తు కోసం డెన్మార్క్, గ్రీన్‌లాండ్ ప్రజలతో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నాము అన్నారు. 'మేము దీనిని చాలా జాగ్రత్తగా కాపాడుకుంటాము.. ఇది అమెరికా ఒక కల నిజమైన క్షణం.. ఇది చాలా ముఖ్యం, ప్రత్యేకం.. అలాగే చారిత్రాత్మకమై నిర్ణయం' అంటూ ట్రంప్ స్పందించారు. అంతేకాదు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలన ప్రకటన చేశారు. సీఎన్ఎన్, ఎంఎస్‌నౌ, పొలిటికో మీడియా సంస్థల్ని వైట్‌హౌస్‌లోకి రాకుండా నిషేధం విధించారు. ఈ మీడియా సంస్థలు తనపై తప్పుడు వార్తలు ప్రచురిస్తున్నాయని.. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ఎవరైనా తనకపై తప్పుడు వార్తలు రాస్తే వేటు తప్పదని హెచ్చరించారు.

## కొన్ని దరఖాస్తుకు లక్ష డాలర్ల ఫీజు

మొదటిపేజీ తరువాయి..

అనే అంశం నిఘా పెంచాలని అధికారులను ఆదేశించారు. హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేసే సంస్థ ఇటీవల అమెరికా ఉద్యోగులను తొలగించిందా? భవిష్యత్తులోనూ ఉద్యోగాల్లో కోతలు పెట్టబోతోందా? ఇకపై అధికారులు పరిశీలిస్తారు. హెచ్-1బీ ఉద్యోగులతో సమానమైన పనులు చేసే అమెరికన్లను తొలగించినా దాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. అయితే ఉద్యోగులను తొలగించినంత మాత్రాన హెచ్-1బీ దరఖాస్తును తిరస్కరించాలని ఆదేశాల్లో చెప్పలేదు. దరఖాస్తు పరిశీలనలో ఈ అంశాన్నీ పరిగణనలోకి తీసుకోవాలని మాత్రమే స్పష్టం చేశారు. ఇప్పటికే దాఖలైన లేబర్ కండిషన్ అప్లికేషన్లను సమీక్షించాలని కార్మిక శాఖను ఆదేశించారు. 30 రోజుల్లో ఈ ప్రక్రియ ప్రారంభించాలి. నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై తదుపరి చర్యలు అవసరమా అన్నది పరిశీలించనున్నారు. అమెరికా విదేశాంగ, కార్మిక, హోంల్యాండ్ సెక్యూరిటీ శాఖలు ఇతర ప్రభుత్వ విభాగాలతో కలిసి పనిచేయాలి. వేతనాలు, ఉద్యోగాలు, విద్య, పరిశ్రమలకు సంబంధించిన సమాచారాన్ని పరిశీలనలో ఉపయోగించాలి. 2025 సెప్టెంబర్ 19న విధించిన 1 లక్ష డాలర్ల ఫీజును కొనసాగిస్తూ ప్రత్యేక ఉత్తర్వు జారీ చేశారు. ఈ ఫీజు కొన్ని హెచ్-1బీ దరఖాస్తులకు వర్తిస్తుంది. మినహాయింపులకు సంబంధించిన పూర్తి వివరాలను తాజా ప్రకటనలో వెల్లడించలేదు. వైట్‌హౌస్ ప్రకారం.. భారీ ఐటీ ఔట్‌సోర్సింగ్ సంస్థల హెచ్-1బీ రిజిస్ట్రేషన్లు 92 శాతం తగ్గాయి. కాన్సులర్ ప్రాసెసింగ్ అభ్యర్థనలు దాదాపు 97 శాతం పడిపోయాయి.

## శంషాబాద్ లో ఘోర రోడ్డు ప్రమాదం

మొదటిపేజీ తరువాయి..

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందారు. వేగంగా వెళ్తున్న ఇన్నోవా కారు ప్రమాదానికి గురవడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడగా, అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట్ మండలం మెట్టుగడ్డ తండాకు చెందిన ఒక కుటుంబం వినాయక నిమజ్జన వేడుకలు ముగించుకుని ఇన్నోవా కారులో శంషాబాద్ వైపు బయలుదేరింది. జాతీయ రహదారిపై పాలమాకుల గ్రామ సమీపంలోకి రాగానే వీరి వాహనం కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కేతావత్ లింబ్యా (54), ఆయన భార్య కేతావత్ జమున (45), కాట్రావత్ మాన్‌సింగ్ (48), కేతావత్ వశ్రామ్ (45) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో లింబ్యా, మాన్‌సింగ్, వశ్రామ్ వ్యాపారులు కాగా, జమున గృహిణి. కారు డ్రైవర్ సబావత్ అశోక్‌కు తీవ్ర గాయాలు కావడంతో అతడిని శంషాబాద్‌లోని ట్రైడెంట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమీక్ష

- పొన్కల్ ఉన్నత పాఠశాలలో
- తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశం



**మామడ సెప్టెంబర్ 20 (ప్రజా జ్యోతి) :** పొన్కల్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఈరోజు పేరెంట్స్--టీచర్స్ మీటింగ్( పిటిఎం) నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థుల విద్యా ప్రగతి, హాజరు, క్రమశిక్షణ, ప్రతిభ, పాఠ్యాంశాలపై అవగాహన తదితర అంశాలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పరస్పరం చర్చించారు. విద్యార్థులు చదువులో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు తల్లిదండ్రులు ఇంటి వద్ద కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులు సూచించారు. విద్యార్థుల బలాలు, బలహీనతలను గుర్తించి వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు. అదేవిధంగా విద్యార్థుల హాజరు శాతం పెంచడం, ప్రతిరోజూ పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడటం, ఇంటి వద్ద చదువుకు అనుకూలమైన వాతావరణం కల్పించడం వంటి అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

ఈ సమావేశం ద్వారా పాఠశాల--తల్లిదండ్రుల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావడంతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పిటీఎం ఎంతగానో దోహదపడుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మైస అరవింద్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి భవితకు కీలకంగా బొగ్గు గనుల వేలం

- కోయగూడెం బ్లాక్--3, శ్రావణపల్లి ఓసీపీపై ఆసక్తి



**మంచిర్యాల, 19, సెప్టెంబర్ (ప్రజా జ్యోతి):** కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా బొగ్గు గనుల వేలానికి తెరతీయడంతో తెలంగాణలోని రెండు కీలక బొగ్గు బ్లాకులపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది. కేంద్రం తాజాగా ప్రకటించిన 25 బొగ్గు గనుల జాబితాలో తెలంగాణకు చెందిన శ్రావణపల్లి ఓసీపీ, కోయగూడెం బ్లాక్--3 కూడా చోటు చేసుకున్నాయి. దీంతో ఈ రెండు బొగ్గు బ్లాకులను సింగరేణి దక్కించుకుంటుందా? లేక ఇతర సంస్థలు వేలంలో దక్కించుకుంటాయా? అనే చర్చ బొగ్గు పరిశ్రమ, కార్మిక వర్గాల్లో మొదలైంది.

దేశంలో బొగ్గు గనుల వేలం విధానంపై కార్మిక సంఘాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని సంఘాలు వేలం విధానాన్ని వ్యతిరేకిస్తుండగా, మరికొన్ని వేలంలో సింగరేణి చురుగ్గా పాల్గొని కొత్త బొగ్గు బ్లాకులను దక్కించుకోవాలని సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలో తాజాగా వేలానికి వచ్చిన రెండు బొగ్గు బ్లాకులు సింగరేణికి కీలకంగా మారాయి.

- 51 శాతం రాష్ట్ర వాటా.. కొత్త గనులపై ఆధారం

తెలంగాణలో దేశంలోనే పేరుగాంచిన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కొనసాగుతోంది. సంస్థలో తెలంగాణ ప్రభుత్వానికి 51 శాతం, కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉంది. సింగరేణి అధికారిక సమాచారం ప్రకారం సంస్థ ప్రస్తుతం తెలంగాణలోని ఆరు జిల్లాల్లో ఓపెన్‌కాస్ట్, అండర్‌గ్రౌండ్ గనులను నిర్వహిస్తోంది. సింగరేణి భవిష్యత్ బొగ్గు ఉత్పత్తి, ఉపాధి అవకాశాల దృష్ట్యా కొత్త గనులను దక్కించుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికే సంస్థ భవిష్యత్ కార్యకలాపాలకు కొత్త బొగ్గు బ్లాకుల అవసరం ఉందన్న చర్చ కొనసాగుతోంది. ఇటీవల కూడా కోయగూడెం ఓసీపీ--3, జేవీఆర్ ఓసీపీ--3 బ్లాకులను సింగరేణికి కేటాయించాలని కార్మిక సంఘాల ప్రతినిధులు కేంద్రాన్ని కోరిన విషయం వెలుగులోకి వచ్చింది. తెలంగాణలోని గోదావరి లోయ బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున కేంద్రాన్ని కోరినట్లు కూడా గతంలో వార్తలు వచ్చాయి. అయితే కేంద్రం బొగ్గు బ్లాకుల కేటాయింపులో పారదర్శక వేలం విధానాన్ని అనుసరిస్తున్నట్లు కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి గతంలో పార్లమెంట్‌లో వెల్లడించినట్లు నివేదికలు పేర్కొన్నాయి.

- వేలంలో పాల్గొంటుందా.. గనులను దక్కించుకుంటుందా?

ఈ నేపథ్యంలో శ్రావణపల్లి ఓసీపీ, కోయగూడెం బ్లాక్-3 విషయంలో సింగరేణి తీసుకునే నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో సింగరేణి వేలంలో పాల్గొని కొత్త బొగ్గు బ్లాకును దక్కించుకున్న ఉదాహరణ కూడా ఉంది. ఇటీవల జరిగిన ఒక వాణిజ్య బొగ్గు బ్లాక్ వేలంలో పీ.కే.ఓ.సీ. డిప్‌సైడ్ ఎక్స్‌టెన్షన్ బ్లాకును సింగరేణి దక్కించుకున్నట్లు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖకు సంబంధించిన సమాచారం పేర్కొంది. అయితే ప్రతి బ్లాక్‌కు సంబంధించిన బొగ్గు నిల్వలు, ఉత్పత్తి సామర్థ్యం, పెట్టుబడి అవసరాలు, వేలం ధర, భవిష్యత్ ఆర్థిక ప్రయోజనాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అందువల్ల ఈసారి తెలంగాణకు చెందిన రెండు బ్లాకుల విషయంలో సింగరేణి వ్యూహం ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారింది.

- "తెలంగాణ బొగ్గు సింగరేణికే దక్కాలి".. ఏఐటీయూసీ డిమాండ్

ఇదిలా ఉండగా, సింగరేణిలో గుర్తింపు పొందిన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఈ అంశంపై స్పందించింది. తెలంగాణకు చెందిన శ్రావణపల్లి ఓసీపీ, కోయగూడెం బ్లాక్--3 బొగ్గు బ్లాకులు సింగరేణికే దక్కేలా సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని డిమాండ్ చేసింది. వేలంపాటలో సింగరేణి చురుగ్గా పాల్గొనేలా యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని యూనియన్ కోరింది. తెలంగాణలోని బొగ్గు వనరులను సింగరేణి ఆధ్వర్యంలో అభివృద్ధి చేయడం ద్వారా సంస్థ విస్తరణతో పాటు కార్మికులకు ఉపాధి అవకాశాలు, రాష్ట్రానికి ఆర్థిక ప్రయోజనాలు పెరిగే అవకాశం ఉందని ఏఐటీయూసీ పేర్కొంది. వేలంపాట ప్రక్రియను కేవలం పరిశీలించకుండా సింగరేణి యాజమాన్యం తక్షణమే సమగ్ర కార్యాచరణ రూపొందించి, వేలంలో చురుగ్గా పాల్గొని తెలంగాణ బొగ్గు బ్లాకులను దక్కించుకునేలా చర్యలు చేపట్టాలని యూనియన్ డిమాండ్ చేసింది.

- భవిష్యత్ బ్లాకులపైనా సింగరేణి ముందుండాలి

శ్రావణపల్లి ఓసీపీ, కోయగూడెం బ్లాక్--3తో పాటు భవిష్యత్తులో తెలంగాణలో వేలానికి వచ్చే బొగ్గు బ్లాకులన్నింటి విషయంలోనూ సింగరేణి ముందుండేలా రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ కోరింది. సింగరేణి విస్తరణకు కొత్త బొగ్గు బ్లాకులు దోహదపడటంతో పాటు కార్మికుల ఉపాధి రక్షణకు కూడా అవి ఉపయోగపడతాయని యూనియన్ అభిప్రాయపడింది. "తెలంగాణ బొగ్గు--సింగరేణికే దక్కాలి, వేలంపాటలో సింగరేణి చురుగ్గా పాల్గొనాలి, సింగరేణి విస్తరణ ద్వారా కార్మికుల ఉపాధికి బాటలు వేయాలి" అని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు.

ఇప్పటికే తెలంగాణ బొగ్గు బ్లాకుల కేటాయింపు, సింగరేణి విస్తరణ అంశంపై ప్రభుత్వం, కేంద్రం, కార్మిక సంఘాల మధ్య భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో తాజా వేలం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. శ్రావణపల్లి ఓసీపీ, కోయగూడెం బ్లాక్--3 కోసం సింగరేణి వేలంలో ఎలా ముందుకు వెళుందో? పోటీలో పాల్గొని ఈ రెండు బ్లాకులను దక్కించుకుంటుందా? లేక కేంద్రం నిర్వహించే వేలంలో ఇతర సంస్థలకు అవకాశం దక్కుతుందా? అనేది ఇప్పుడు వేచి చూడాల్సిన అంశంగా కీలకంగా మారింది.

## పొన్కల్‌లో రెడ్డి కా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మహా అన్నదానం



**మామడ సెప్టెంబర్ 20 (ప్రజా జ్యోతి) :** పొన్కల్ గ్రామంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా పొన్కల్ గ్రామ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో గణపతి మండపం వద్ద శనివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కా సంఘం సభ్యులు, గణపతి ఉత్సవ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, యువతతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గణనాథుడిని దర్శించుకున్న అనంతరం భక్తులకు అన్నదాన ప్రసాదాన్ని అందించారు. గ్రామంలో భక్తి, ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేలా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## విబి జీ రామ్ జీ పై గ్రామసభ నిర్వహణ



**మామడ సెప్టెంబర్ 20 (ప్రజా జ్యోతి) :** బందల ఖానాపూర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో విబిజీ రామ్ జీ పై గ్రామసభను ఈరోజు నిర్వహించారు. గ్రామ అభివృద్ధి, పంచాయతీ పరిధిలో చేపట్టాల్సిన పనులు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులపై సమావేశంలో చర్చించారు. గ్రామ సర్పంచ్ కళ్యాణి సచిన్ కుమార్ జాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ గ్రామసభలో ఈసి సురేష్, టీఏ రవి, పంచాయతీ కార్యదర్శి అక్షిత, ఉపసర్పంచ్ పద్మ ముత్యం, వార్డు సభ్యులు శ్రీనివాస్, సుజాత, దేవ్రావుతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించి, అవసరమైన చర్యలపై చర్చించారు. గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, గ్రామసభల ద్వారా ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.


గ్రామసభలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలు, అభిప్రాయాలను తెలియజేశారు.

## అడ్వకేట్ పట్టా పొందిన శీతలకర్ అరవింద్‌కు సన్మానం



**నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి) :** అడ్వకేట్ పట్టా (లా.డీ) పూర్తి చేసిన విద్యార్థి సంఘ నాయకుడు శీతలకర్ అరవింద్‌ను నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భోజన్న మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ న్యాయ విద్యను పూర్తి చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో న్యాయ విద్యను సమాజ సేవకు వినియోగించాలని ఆకాంక్షించారు. అరవింద్ తనను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, విద్యార్థుల హక్కులు,విద్యా రంగ సమస్యలపై తన పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

## ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడికి సన్మానం




**జన్నారం, సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి) :** ఇటీవలే ఎన్ ఎస్ యు ఐ మంచిర్యాల జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమింపబడిన మండల కేంద్రానికి చెందిన సోహెల్ షాను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ ఫసి ఉల్లా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి విభాగంలో చేసిన సేవలను గుర్తించి అధిష్టానం సోహెల్ షాను ఎన్ ఎస్ యు ఐ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా నియమింపబడ్డాడని తెలిపారు.నిర్మల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు, ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సహకారంతో భవిష్యత్తులో మరిన్ని పదవులు పొంది పార్టీకి మరిన్ని సేవలందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎండి రియాజుద్దీన్, వార్డు సభ్యుడు మోసిన్ షా ఖాన్, రజాక్, నిర్మల్ జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం డి అజ్మత్ ఖాన్, గంగన్న యాదవ్, నర్సింగరావు, రాజేష్ ,శంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

# ఆపన్నులకు సీఎంఆర్ఎఫ్ అండ..

**40 మంది లబ్ధిదారులకు రూ.13.39 లక్షల చెక్కులు**





**కూచాడి శ్రీహరిరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ**

**మామడ సెప్టెంబర్ 20 (ప్రజా జ్యోతి) :** ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (జవీ=ఖీ) అండగా నిలుస్తోందని నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కూచాడి శ్రీహరిరావు అన్నారు. శనివారం నిర్మల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు అందజేశారు.

ఈ సందర్భంగా 40 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.13 లక్షల 39 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శ్రీహరిరావు స్వయంగా అందజేశారు. అనారోగ్యం, వైద్య చికిత్సల కోసం భారీగా ఖర్చు చేసి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా తన వంతు కృషి చేస్తానని, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తానని శ్రీహరిరావు అన్నారు.

**లబ్ధిదారుల్లో ఆనందం :** సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. వైద్య ఖర్చుల భారంతో ఇబ్బందులు పడుతున్న తమ కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఊరటనిచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీ జూపల్లి కృష్ణారావు, కూచాడి శ్రీహరిరావులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
**రెవిన్యూ శాఖ**

జిల్లా కలెక్టర్ కార్యాలయము, ఆదిలాబాద్
**(ఫారం-VI)**
**(ప్రాథమిక నోటిఫికేషన్)**
(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతు బద్ధకమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం-2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11(1) మరియు రాష్ట్ర రూల్ 19(1) అనుసరించి)

కలెక్టరు ఫైల్ నెం. జి1/467/2018 తేది: 05.03.2026
ఆర్.డి.ఓ ఆదిలాబాద్ ఫైల్ నెం. బి/742/2019 తేది: 12.03.2026

ఈ దిగువ నిర్దిష్టపరిచిన ఆదిలాబాద్ జిల్లా బేల మండలములోని 1.ఆవాల్‌పూర్, 2. భెదోడకప్పీ, 3. ఆవాల్‌పూర్, 4. నారాయణ్‌పూర్, భెదోడ, 6. కాంగార్‌పూర్, 7. గూడ, గ్రాములోని మొత్తము విస్తీర్ణము 34.17 గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం ఇంటర్ స్టేట్ లోహర్ పెన్ గంగా ప్రాజెక్టు కాలువలు (10 RM on D-19, 12LM, on D-19 మరియు 23 LM, on D-19) నిర్మాణము నిమిత్తం దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని భావించినందున సెక్షన్ (2)6 క్రింద 2013/(చట్టం 3)లో పేర్కొనిన ప్రకారం నీటి పారుదల శాఖ ప్రాజెక్టుకు సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక అవసరం లేనందున అనుబంధంలో పేర్కొనిన భూములకై నోటీసు జారీ చేయనైనది.

ఇట్టి ఇంటర్ స్టేట్ లోయర్ పెంగన్ గాంగ ప్రాజెక్టు ప్రభుత్వ ఉత్తర్వులు జి.ఓ.ఎంఎస్.నెం.58 ఐ.అండ్ సి ఎ డి (ఎల్.ఏ.ఆర్ & ఆర్/ఏ) ఇట్టి ప్రాజెక్టు ప్రభుత్వం ఉత్తర్వుల శాఖ తేది: 25.07.2017 ననుసరించి భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 చాప్టర్-II మరియు-III పరిధి నుండి మినహాయింపు ఇవ్వబడినది.

కావున ఆదిలాబాద్ జిల్లా బేల మండలములోని 1.ఆవాల్‌పూర్, 2.భెదోడకప్పీ, 3. ఆవాల్‌పూర్, 4. నారాయణ్‌పూర్, 5. భెదోడ, 6. కాంగార్‌పూర్, 7. గూడ, గ్రామములోని మొత్తము విస్తీర్ణము 34.17 గుంటలు భూమి యొక్క వివరములు ఈ క్రింద చూపిన వానిని భూసేకరణ పనులు ప్రారంభ నిమిత్తం, ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేనైనది.

**షెడ్యూలు**

గ్రామము : ఆవాల్‌పూర్ & 6 గ్రామములు మండలము : బేల జిల్లా : ఆదిలాబాద్

| క్రమ సంఖ్య | సర్వే నెం. | బీట్ నెం | సర్వే రిపోర్ట్ విస్తీర్ణం | పట్టా/ మెట్ట /తరి | ఎంజాయ్ మెంట్ విస్తీర్ణం | పట్టేదార్ పేరు/ తండ్రి పేరు | కాస్తు దారు/ తండ్రి పేరు | చెట్లు/ బోర్ వెల్/ ఇతర ములు |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| **1. ఆవాల్‌పూర్ గ్రామము (10RM, on D-19)** | | | | | | | | |
| 1 | 13/2 | 13/F | 0.18 | పట్టా/మెట్ట | 0.18 | కె.శివన్న తండ్రి రామ్‌రెడ్డి | స్వంతం | లేదు |
| 2 | 16/ 1/2 | 16/ A1/1 | 0.25 | పట్టా/మెట్ట | 0.25 | బి.ప్రకాష్ తండ్రి నాగోరావు | స్వంతం | " |
| 3 | 18/ 1/2 | 18 /1 | 1.03 | పట్టా/మెట్ట | 1.03 | ఎస్.వెంకట్ రెడ్డి తండ్రి లింగరెడ్డి | స్వంతం | " |
| 4 | 19 /2 | 19/ C2/1 | 1.13 | పట్టా/మెట్ట | 0.17 | టి.మహేందర్ తండ్రి గంగారెడ్డి శ్రీమతి తలక్కుల వైద్య భర్త మహేందర్ | స్వంతం | " |
| 5 | | 19/C1 | | పట్టా/మెట్ట | 0.04 | కే.సంజీవ్ తండ్రి శంకర్ | స్వంతం | " |
| 6 | | 19/B/2 | | పట్టా/మెట్ట | 0.14 | టి.సతీశ్ తండ్రి కిస్టాన్న | స్వంతం | " |
| 7 | | 19/B/1 | | పట్టా/మెట్ట | 0.14 | టి.పోచూబాయి భర్త మార్కండే | స్వంతం | " |
| 8 | | 19/A1 | | పట్టా/మెట్ట | 0.04 | జగదీష్ తండ్రి దిగంబర్ | స్వంతం | " |
| 9 | 25/2 | 25/అ1 | 1.17 | పట్టా/మెట్ట | 0.30 | జి.రాజేశ్వర్ తండ్రి భూమన్న | స్వంతం | " |
| 10 | | 25/B1 | | పట్టా/మెట్ట | 0.27 | జి.సుదర్శన్ తండ్రి భూమన్న | స్వంతం | " |
| 11 | 26/2 | 26/a1/2 | 2.23 | పట్టా/మెట్ట | 0.32 | బి.మంద భర్త సునిల్ | స్వంతం | " |
| 12 | | 26/B/3 | | పట్టా/మెట్ట | 0.12 | బి.విట్టా బాయి భర్త జిత్రాజి | స్వంతం | " |
| 13 | | 26/C | | పట్టా/మెట్ట | 0.02 | కామిని బాయి భర్త రాంబాబు | స్వంతం | " |
| 14 | | 26/E | | పట్టా/మెట్ట | 0.26 | బి.అఖిల్ తండ్రి జిత్రాజి | స్వంతం | " |
| 15 | | 26/E2 | | పట్టా/మెట్ట | 0.02 | బి. గులాబ్ తండ్రి గణపత్ | స్వంతం | " |
| 16 | | 26/E1 | | పట్టా/మెట్ట | 0.01 | బి. సంతోష్ తండ్రి గణపతి | స్వంతం | " |
| 17 | | 26/D | | పట్టా/మెట్ట | 0.28 | కె.పుష్పాల బాయి భర్త పోత్రన్న | స్వంతం | " |
| 18 | 27/2 | 27/10 | 0.31 | పట్టా/మెట్ట | 0.27 | జి.చిన్న ఉశన్న తండ్రి జి.ఆశన్న | స్వంతం | " |
| 19 | | 27/11 | | పట్టా/మెట్ట | 0.04 | కె.ఆశమ్మ భర్త దేవన్న | స్వంతం | " |
| | | మొత్తము | 8.10 | | 8.10 | | | |
| **2. భెదోడ కప్పీ గ్రామము (10RM, on D-19)** | | | | | | | | |
| 1 | 27 /2 | 27 | 0.29 | పట్టా/మెట్ట | 0.29 | ముకుంద్ రావ్ తండ్రి భీజారామ్ | స్వంతం | లేదు |
| **3.ఆవాల్‌పూర్ గ్రామము (12RM, on D-19)** | | | | | | | | |
| 1 | 6 /2 | 6/A1 /2 | 1.03 | పట్టా/మెట్ట | 0.34 | నల్ల ప్రజ్ఞా భర్త వెంకట్‌రెడ్డి | స్వంతం | లేదు |
| 2 | | 6/A1 /2 | | పట్టా/మెట్ట | | నల్ల అలివేణి రెడ్డి తండ్రి శ్రీనివాస్ రెడ్డి | స్వంతం | బోర్‌వెల్ మోటార్ |
| 3 | | 6/B1 | | పట్టా/మెట్ట | 0.09 | నల్ల శ్రీవాణి భర్త హనుమంత్ రెడ్డి | స్వంతం | " |
| 4 | 7 /2 | 7/A1 | 1.25 | పట్టా/మెట్ట | 0.21 | నల్ల సాయికిరణ్ తండ్రి వెంకట్ రెడ్డి | స్వంతం | " |
| 5 | | 7/B | | పట్టా/మెట్ట | 0.22 | గుమ్మడి కిష్టరెడ్డి తండ్రి నర్సింలు | స్వంతం | " |
| 6 | | 7/A | | పట్టా/మెట్ట | 0.22 | గడ్డం రీణ భర్త విజేందర్ | స్వంతం | " |
| | | మొత్తము | 2.28 | | 2.28 | | | |
| **4. నారాయణ్‌పూర్ గ్రామము 23 LM on D-19** | | | | | | | | |
| 1 | 8 /2 | 8/2 /2 | 0.04 | పట్టా మెట్ట | 0.04 | కె.సువర్ణ భర్త రవీందర్ | స్వంతం | లేదు |
| **5. భెదోడ గ్రామము 23 LM on D-19** | | | | | | | | |
| 1 | 8/2 | 8/2B | 1.23 | పట్టా/మెట్ట | 0.05 | కె.సురేఖ భర్త సుభాష్ | స్వంతం | లేదు |
| 2 | | 8/2D | | పట్టా/మెట్ట | 0.32 | పి.అనిత భర్త మోహన్ | స్వంతం | " |
| 3 | | 8/2C | | పట్టా/మెట్ట | 0.26 | కె.సునీత భర్త భూమన్న | స్వంతం | " |
| 4 | 9/2 | 9/B/2 | 1.18 | పట్టా/మెట్ట | 0.23 | భలేరావ్ అజయ్ తండ్రి కాంతరావ్ | స్వంతం | " |
| 5 | | 9/B/2 | | పట్టా/మెట్ట | 0.01 | బి.అవినాష్ తండ్రి మహదేవ్ | స్వంతం | " |
| 6 | | 9/B1 | | పట్టా/మెట్ట | 0.34 | బి.రాజు తండ్రి మహదేవ్ | స్వంతం | " |
| 7 | 11/2 | 11/1 | 1.17 | పట్టా/మెట్ట | 0.29 | బి.వికాస్ తండ్రి పోచిరామ్ | స్వంతం | " |
| 8 | | 11/1b | | పట్టా/మెట్ట | 0.28 | బి.వసంత్ తండ్రి శ్రవణ్ | స్వంతం | " |
| 9 | 12/2 | 12 | 0.37 | పట్టా/మెట్ట | 0.37 | చిన్నబాపు తండ్రి గోవిందా | స్వంతం | " |
| 10 | 16/2 | 16/1 | 0.03 | పట్టా/మెట్ట | 0.03 | టి.అశోక్ తండ్రి తనబా | స్వంతం | " |
| 11 | 17/2 | 17 | 0.39 | పట్టా/మెట్ట | 0.13 | బి.రామ్‌బాయి భర్త కి.శే.బి.విట్టల్ | స్వంతం | " |
| 12 | | 17/1 | | పట్టా/మెట్ట | 0.26 | బి.సందీప్ తండ్రి గంగారామ్ | స్వంతం | " |
| 13 | 18/2 | 18/1 | 0.39 | పట్టా/మెట్ట | 0.01 | డి.దాంబుతాయి భర్త బాబారావ్ | స్వంతం | " |
| 14 | | 18/2 | | పట్టా/మెట్ట | 0.38 | ఆర్.విట్టల్ తండ్రి లచ్చన్న | స్వంతం | " |
| 15 | 19/2 | 19 | 0.15 | పట్టా/మెట్ట | 0.15 | డి.వినాయక్ తండ్రి బాబారావ్ | స్వంతం | బావి |
| 16 | 20/2 | 20/1 | 1.07 | పట్టా/మెట్ట | 0.26 | వినోద్ తండ్రి దామోదర్ | స్వంతం | లేదు |
| 17 | | 20/2 | | పట్టా/మెట్ట | 0.21 | బి.దినేష్ తండ్రి శంబు | స్వంతం | " |
| 18 | 21/2 | 21/1 | 1.24 | పట్టా/మెట్ట | 1.00 | టి.మిరాజి తండ్రి నాందేవ్ | స్వంతం | " |
| 19 | | 21 | | పట్టా/మెట్ట | 0.24 | గంగారామ్ తండ్రి వీటోభా | స్వంతం | " |
| 20 | 37/2 | 37/2 | 0.34 | పట్టా/మెట్ట | 0.09 | గోహనే జగదీష్ తండ్రి బందు | స్వంతం | " |
| 21 | | 37/1 | | పట్టా/మెట్ట | 0.16 | బి.స్వప్నిల్ తండ్రి గులాబ్ | స్వంతం | " |
| 22 | 38/1 | 38/2 | 1.06 | పట్టా/మెట్ట | 0.22 | కె.శాలిక్ రండ్రి పోచిరామ్ | స్వంతం | " |
| 23 | /2 | 38 | | పట్టా/మెట్ట | 0.24 | కె.శ్రీనివాస్ తండ్రి పోచిరామ్ | స్వంతం | " |
| 24 | 39/2 | 39/చ /2 | 0.25 | పట్టా/మెట్ట | 0.23 | డి.పంచపూల తండ్రి తాంబ | స్వంతం | " |
| 25 | | 39/చ /1/1 | | పట్టా/మెట్ట | 0.06 | డి. సంతోష్ తండ్రి గంగరామ్ | స్వంతం | " |
| 26 | | 39/చ /1/2 | | పట్టా/మెట్ట | 0.05 | డి. హర్షల్ తండ్రి సుదర్శన్ | స్వంతం | " |
| | | మొత్తము | | | 13.09 | | | |
| **6. కంగార్‌పూర్ గ్రామము (23 LM on D-19)** | | | | | | | | |
| 1 | 4/2 | 4/A2 | 1.05 | పట్టా/మెట్ట | 1.05 | వి.దిలీప్ తండ్రి గులాబ్ | స్వంతం | లేదు |
| 2 | 5/2 | 5/B | 0.32 | పట్టా/మెట్ట | 0.12 | నాందేవ్ తండ్రి గుండజి | స్వంతం | " |
| 3 | | 5/D1 | | పట్టా/మెట్ట | 0.07 | సి.వినోద్ తండ్రి వీటోబా | స్వంతం | " |
| 4 | | 5/A | | పట్టా/మెట్ట | 0.13 | సి.వినోద్ తండ్రి వీటోబా | స్వంతం | " |
| 5 | 6/2 | 6/A/ | 0.12 | పట్టా/మెట్ట | 0.12 | వి.ప్రేమ్ తండ్రి గణేశ్ వి.రోహిత్ తండ్రి గణేశ్ | స్వంతం | " |
| 6 | 9/2 | 9/1A | 0.03 | పట్టా/మెట్ట | 0.03 | వి.లక్ష్మణ్ తండ్రి గోవిందా | స్వంతం | " |
| 7 | 10/2 | 10/1/1 | 1.13 | పట్టా/మెట్ట | 0.24 | జి.శ్రీధర్ తండ్రి ఉద్ధవ్ | స్వంతం | " |
| 8 | | 10/8 | | పట్టా/మెట్ట | 0.14 | జి.త్రివేణి భర్త నారాయణ్ | స్వంతం | " |
| 9 | | 10/9 | | పట్టా/మెట్ట | 0.15 | జి.పాండురంగ్ తండ్రి తుకారాం | స్వంతం | " |
| 10 | 49/2 | 49b/1 | 0.25 | పట్టా/మెట్ట | 0.25 | గణపతి తండ్రి సాకారం | స్వంతం | " |
| 11 | 50/2 | 50/2 | 0.34 | పట్టా/మెట్ట | 0.19 | జి.జ్ఞానేశ్వర్ భర్త ఉద్ధవ్ | స్వంతం | " |
| 12 | | 50 | | పట్టా/మెట్ట | 0.15 | బి.సునీత భర్త అశోక్ | స్వంతం | " |
| 13 | 51/2 | 51/a1 | 1.13 | పట్టా/మెట్ట | 0.12 | కె.భాగ రెడ్డి భర్త రాం కిషన్ రెడ్డి | స్వంతం | " |
| 14 | | 51/A1/2 | | పట్టా/మెట్ట | 0.14 | వి.రూప్‌రావ్ తండ్రి విట్టల్ | స్వంతం | " |
| 15 | | 51/A1/1 | | పట్టా/మెట్ట | 0.27 | వి.ప్రభాకర్ తండ్రి గణవంత్ | స్వంతం | " |
| 16 | 52/2 | 52/a1/1 | 1.36 | పట్టా/మెట్ట | 1.36 | కె.రామ్‌కిషన్ తండ్రి గంగారెడ్డి | స్వంతం | " |
| | | మొత్తము | 8.13 | | 8.13 | | | |
| **7. గూడ - గ్రామము 23 LM on D-19** | | | | | | | | |
| 1 | 4/2 | 4/A1 | 1.04 | పట్టా/మెట్ట | 0.16 | దిలీప్ తండ్రి మారుతి | స్వంతం | లేదు |
| 2 | | 4/B | | పట్టా/మెట్ట | 0.28 | వి.గజానన్ తండ్రి లక్ష్మణ్ | స్వంతం | " |
| | మొత్తం | | | | 1.04 | | | |
| సంపూర్ణ మొత్తం | | | | | 34.17 | | | |

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 సెక్షన్ 11(1) అనుసరించి సంబంధిత వ్యక్తులందరికి తెలియజేయు నిమిత్తం జారీ చేయనైనది.

ఇంటర్ స్టేట్ లోయర్ పెన్ గాంగ ప్రాజెక్టు నిర్మాణమునకు అధ్యాయము-II మరియు III సామాజిక ప్రభావము ఈ నిబంధనలు ప్రతిపాదనకు వర్తింపబడవు.

భూమి యొక్క ప్లాన్, ఏదైన పని దినము మరియు పని వేళలలో జిల్లా కలెక్టరు, రాజస్వమండల అధికారి గారి కార్యాలయములో తనిఖీ చేసుకోవచ్చును. తదుపరి తెలంగాణ ప్రభుత్వం/కలెక్టర్ మరియు సంబంధిత ప్రభుత్వం ఎంత భూమిని స్వాధీనము చేసుకోవాలో నిర్ణయించుకొనే క్రమములో సెక్షన్ 12 ప్రకారం అధికారులు, ఉద్యోగులు వారి వద్ద పని చేసే కార్మికులకు పైన చూపిన భూములలో గల ఏదైన ప్రదేశంలోని ప్రవేశించి, సర్వే జరిపి భూకమతాన్ని కొలిచే అధికారం, భూమిని త్రవ్వటానికి లేదా భూస్వరూపం తెలుపు బోర్ వెయ్యటానికి మరియు అవసరమైన ఇతర చర్యలు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం కలెక్టర్ అనుమతి లేకుండా ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నుండి ఆ నోటిఫికేషన్‌లో ఉదహరింపబడిన భూములకు సంబంధించిన ఎవరూ ఎటువంటి లావాదేవీలు/తకట్లు మొదలగు చర్యలు చేపట్టరాదు.

సెక్షన్ (15) ప్రకారం, ఇట్టి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ తరువాత పైన చూపిన భూములలో ఎలాంటి సంబంధమున్న వ్యక్తులైన భూసేకరణపై అభ్యతరములున్నచో అట్టి వ్యక్తులు, ఇట్టి నోటిఫికేషన్ జారీ చేసిన (60) దినములలోపు భూసేకరణ అధికారి ముందు వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.

సం/-. రాజస్వ మండలాధికారి & భూసేకరణ అధికారి ఆదిలాబాద్ | సం/- సంయుక్త పాలనాధికారి ఆదిలాబాద్ | సం/-. జిల్లా పాలనాధికారి ఆదిలాబాద్

DIPR RO.NO: 889/LA/PP/Advt/Pub/2025-26

# మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డికి పితృ వియోగం

- సింగిల్ విండో చైర్మన్ గా రైతులకు సేవలు చేసిన లక్ష్మారెడ్డి
- పార్థీక దేహానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి
- సింగోటం గ్రామంలో తండోపతండాలుగా తరలివచ్చిన జనం

నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గం మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి కి పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి బీరం లక్ష్మారెడ్డి (80) అనారోగ్యంతో శుక్రవారం ఉదయం కన్నుమూశారు. దీంతో కొల్లాపూర్ నియోజక వర్గంలో విషాదఛాయలు అమలుకున్నాయి. సింగల్ విండో చైర్మన్ గా పలుమార్లు రైతులకు సేవలందించారు.





మృతి చెందిన విషయం తెలుసుకున్న నియోజకవర్గ ప్రజలు సింగోటం గ్రామానికి తరలివచ్చి కార్తీకదీపం నివాళులర్పించారు. విషయం తెలుసుకున్న టిఆర్ఎస్ శ్రేణులు మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, తరలివచ్చి, ఆయన సోగ్రామం వద్ద సందర్శించి, పార్టిక దేహానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డికి సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్మారెడ్డి మృతి కుటుంబ సభ్యులకు బంధువులకు తీరని లోటు అని వ్యాఖ్యానించారు. తదనంతరం జరిగిన అంత్యక్రియల్లో మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు శ్రేయోభిలాషులు కుటుంబ సభ్యులు కొల్లాపూర్ నియోజక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

- అభివృద్ధికి మరో ముందడుగు – కట్టకింద తిమ్మప్ప స్వామి ఆలయానికి సీసీ రోడ్డు
- కట్టకింద తిమ్మప్ప స్వామివారిని దర్శించుకుని, ఆలయానికి సీసీ రోడ్డు నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అలంపూర్ సెప్టెంబర్ 19(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి) ఏఐసీసీ కార్యదర్శి, ఛత్తీస్‌గఢ్ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే డా. ఎస్.ఏ. సంపత్ కుమార్ రిక్వెస్ట్ మేరకు పార్లమెంట్ సభ్యులు మల్లు రవి సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు సాంక్షన్ చేయించడం అభినందనీయం అలాగే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షావల్లి ఆచారి ఈకార్యక్రమంలో పాల్గొని, ఆలయ అభివృద్ధి మరియు ప్రజల సౌకర్యం కోసం చేపడుతున్న ఈ



కార్యక్రమంలో భాగస్వాములయ్యారు అదేవిధంగా. సింగిల్ విండో చైర్మన్ పోతుల మధుసూదన్ రెడ్డి కూడా పాల్గొని భూమి పూజ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు కట్టకింద తిమ్మప్ప స్వామివారి ఆశీస్సులతో అయిజ మరింత అభివృద్ధి చెందాలని వారు అన్నారు అదేవిధంగాప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ అయిజ పట్టణ ప్రగతికి కాంగ్రెస్ నాయకత్వం కృషి చేస్తోంది నాయకులు అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ మహబూబ్ పాషా, కౌన్సిలర్లు చిన్నికృష్ణ, ఎస్. మద్దిలేటి, మైనర్ బాబు, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు డాన్ వీరన్న, మాజీ కౌన్సిలర్లు బోయ లక్ష్మన్న, కాజా, ఎస్సీ–ఎస్టీ మానిటరింగ్ కమిషన్ సభ్యులు మాల మల్లికార్జున్, 14వ వార్డు ఇంచార్జ్ మేస్త్రి శీను, 1వ వార్డు ఇంచార్జ్ తెలుగు తాయప్ప, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉప్పరి బస్వరాజ్, పణంపల్లి రాములు, పెద్ద కృష్ణ, రామంజి, నరసింహ, దేవబండ లక్ష్మన్న, తుప్పత్రాల పాండు, మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ షాలు, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు అడ్వకేట్ కురువ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రగతికి తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమన్వయం అవసరం

మల్దకల్ సెప్టెంబర్ 19(ప్రజా జ్యోతి ప్రతినిధి): పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్దకల్‌లో నేడు తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతి,హాజరు,అభ్యసన సామర్థ్యం,ప్రవర్తన,క్రమశిక్షణ తదితర అంశాలపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చించారు.విద్యార్థుల అభ్యసన స్థాయిని మెరుగుపరిచేందుకు పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక బోధనా కార్యక్రమాలు, అదనపు తరగతులు,హోంవర్క్,పరీక్షల సన్నద్ధత వంటి అంశాలను తల్లిదండ్రులకు వివరించారు.ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ,ఇంటి వద్ద కూడా విద్యార్థులు ప్రతిరోజూ నిర్దిష్ట సమయం చదువుకునేలా





తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు.విద్యార్థుల పురోగతిని తెలుసుకునేందుకు తల్లిదండ్రులు తరచూ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో సంప్రదింపులు జరపాలని,పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులు సూచించారు.విద్యార్థుల్లో మంచి అలవాట్లు,క్రమశిక్షణ,సమయపాలన పెంపొందించడంలో పాఠశాలతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా ఎంతో కీలకమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతిపై తల్లిదండ్రుల అభిప్రాయాలను తెలుసుకుని,వారి సూచనలను స్వీకరించారు.పాఠశాల–తల్లిదండ్రుల సమన్వయంతో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని పాఠశాల యాజమాన్యం తెలిపింది.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి జి.సురేష్,ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# దివ్యాంగ విద్యార్థులు హక్కులు,అవకాశాలపై అవగాహన కలిగి ఉండాలి

గద్వాల సెప్టెంబర్ 19(ప్రజా జ్యోతి ప్రతినిధి): దివ్యాంగ విద్యార్థులు విద్యతో పాటు భవిష్యత్తులో ఉపాధి,స్వయం ఉపాధి అవకాశాలను పొందేందుకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి నిష్క పాత్రుడు సూచించారు.శనివారం గద్వాల పట్టణంలోని అంధుల పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి,ఉపాధి అవకాశాలు,న్యాయ సేవలు,హక్కులు,సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమానికి న్యాయమూర్తి నిష్క పాత్రుడు హాజరై విద్యార్థులతో మాట్లాడారు.ఈ సందర్భంగా దివ్యాంగజన్ కౌశల్ వికాస్, దివ్యాంగజన్ రోజ్గర్ సేతు కార్యక్రమాల ద్వారా అందుబాటులో ఉన్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ,ఉపాధి అవకాశాలు,ఉద్యోగ సంబంధిత సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.జాతీయ న్యాయ సేవాధికార సంస్థ,జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ద్వారా అందిస్తున్న ఉచిత న్యాయ సహాయం,న్యాయ అవగాహన కార్యక్రమాలు, దివ్యాంగుల కోసం అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాల గురించి వివరించారు.ప్రతి దివ్యాంగుడు తన హక్కులను తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం,సంబంధిత సంస్థలు అందిస్తున్న విద్య,నైపుణ్యాభివృద్ధి,ఉపాధి,సంక్షేమం,న్యాయ సహాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి సూచించారు.అవసరమైన సందర్భాల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు.ఆర్థిక పరిస్థితులు న్యాయ సహాయం పొందేందుకు అడ్డంకిగా మారాల్సిన అవసరం లేదని,అర్హులైన వారికి అవసరమైన న్యాయ సహాయం అందిస్తామని పేర్కొన్నారు.అనంతరం న్యాయమూర్తి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్య, భవిష్యత్తు లక్ష్యాలు,ఆసక్తులు,వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ ఆత్మవిశ్వాసంతో తమ లక్ష్యాల సాధనకు ముందుకు సాగాలని ప్రోత్సహించారు.దివ్యాంగ విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా విద్య,ఉపాధి,స్వయం ఉపాధి రంగాల్లో మెరుగైన అవకాశాలను పొందవచ్చని తెలిపారు.దివ్యాంగుల హక్కుల పరిరక్షణ,సమాన అవకాశాల కల్పన,ప్రభుత్వ సేవలు,సంక్షేమ పథకాలను వారికి చేరువ చేయడంలో అవగాహన కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగన్న,ఉపాధ్యాయులు, సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.






# ఏపీకి నీళ్లు.. పాలమూరు రైతులకు కన్నీళ్లు!

- రైతులకు సాగునీరు, విద్యుత్ కష్టాలు.. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ధ్వజం
- ఏల్నినో పేరుతో సాగునీటి తరలింపు: కేటీఆర్ ఆరోపణ
- ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి

వనపర్తి ప్రతినిధి, సెప్టెంబరు 19 (ప్రజాజ్యోతి): “ప్రకృతి అనుకూలంగా ఉండి నీటి లభ్యత ఉన్నప్పటికీ పాలమూరు రైతులకు సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. ఏల్నినో ప్రభావం పేరుతో ఆంధ్రప్రదేశ్‌కు సాగునీరు తరలిస్తున్నారని ఆరోపించారు. ‘‘ఏపీకి నీళ్లు వెళ్తుంటే





తెలంగాణకు ఎందుకు రావు?’’ అని ప్రశ్నించారు. కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తండ్రి ఇటీవల మృతి చెందడంతో శనివారం ఆయన కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించారు. అనంతరం పెబ్బేరు మండలంలోని గుమ్మడం, చెలిమిల సబ్‌స్టేషన్లను సందర్శించి లాగ్ రిజిస్టర్లను పరిశీలించారు. వ్యవసాయ విద్యుత్ సరఫరా పరిస్థితులపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెబ్బేరు మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గంటలకే విద్యుత్ సరఫరా ఇటీవల రైతులతో కలిసి రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లను పరిశీలించామని కేటీఆర్ తెలిపారు. వ్యవసాయానికి ఆరు గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదని రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. లోఓల్టేజీ, తరచూ విద్యుత్ కోతలతో మోటార్లు కాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారని పేర్కొన్నారు.

కృష్ణా జలాలపై ప్రణాళిక ఏదీ?

కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగడం లేదని కేటీఆర్ ఆరోపించారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు తమ ప్రాజెక్టులపై ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నాయని అన్నారు. ఆలమట్టి ఎత్తు పెంచే అంశంపై కర్ణాటక ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, ఇది భవిష్యత్‌లో పాలమూరుకు నీటి లభ్యతపై ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు. కృష్ణా జలాల్లో పాలమూరు వాటా దక్కే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. ఫిరాయింపులపై చర్యలు తీసుకోవాలి పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ప్రజాతీర్పు కోరాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమాలు జరిగాయని చెబుతున్న అధికార పక్షం.. వాటికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని కేటీఆర్ తెలిపారు. వరదల సమయంలో నీటిని మళ్లించి చెక్‌డ్యామ్‌లు, చెరువులను నింపినట్లు చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో 7 వేల మెగావాట్లుగా ఉన్న విద్యుత్ స్థాపిత సామర్థ్యాన్ని 24 వేల మెగావాట్లకు పెంచామని పేర్కొన్నారు.

‘ఏపీకి నీళ్లు.. తెలంగాణకు ఎందుకు రావు?’

పోతిరెడ్డిపాడు, వెలిగొండ మార్గాల ద్వారా ఏపీకి నీరు వెళ్తోందని కేటీఆర్ ఆరోపించారు. జూరాలకు ఎగువ నుంచి నీరు రావడం లేదని, అందువల్ల కాలువలకు నీటి విడుదల నిలిపివేశామని అధికారులు చెబుతున్నారని తెలిపారు. అదే సమయంలో ఏపీకి నీరు వెళ్తుంటే తెలంగాణకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పంపులను తరచూ ఆన్, ఆఫ్ చేయడం వల్ల ప్రయోజనం ఉండదని, పంపులు ప్రారంభించిన తర్వాత నిరంతరాయంగా నడపాల్సి ఉంటుందని అన్నారు. సీఎం సొంత నియోజకవర్గం, జిల్లాలోనే రైతులు సాగునీరు, విద్యుత్ కోసం రోడ్డెక్కే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సమావేశంలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జీవన్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మర్రి జనార్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, వనపర్తి పట్టణ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, వనపర్తి జిల్లా నాయకులు, పార్టీ మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మధ్యవర్తిత్వంతో కేసులకు సత్వర పరిష్కారం

- డబ్బు, సమయం ఆదా.. కక్షిదారులకు సంతృప్తికర పరిష్కారం


వనపర్తి, సెప్టెంబరు 19 (ప్రజాజ్యోతి): కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉన్న కక్షిదారులు డబ్బు, సమయాన్ని వృథా చేసుకోకుండా మధ్యవర్తిత్వ వ్యవస్థను సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి బాకరాజు శ్రీనివాసరావు సూచించారు. కేంద్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు నిర్వహించనున్న మధ్యవర్తిత్వ ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కోర్టు హాలులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సివిల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 89 కింద ఉన్న ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాల్లో మధ్యవర్తిత్వం ఒకటని తెలిపారు. వివాదంలో ఉన్న పక్షాలు కోర్టులో సుదీర్ఘ విచారణకు వెళ్లకుండా, తటస్థ మూడో వ్యక్తి అయిన మధ్యవర్తి సహకారంతో పరస్పర అంగీకారంతో పరిష్కారం పొందే విధానమే మధ్యవర్తిత్వమని వివరించారు. ఇందులో నిర్ణయం తీసుకునే అధికారం పూర్తిగా కక్షిదారులకే ఉంటుందని, మధ్యవర్తి ఎలాంటి తీర్పు ఇవ్వడని స్పష్టం చేశారు.

15 మంది శిక్షణ పొందిన మధ్యవర్తులు

వనపర్తి జిల్లాలో 15 మంది శిక్షణ పొందిన మధ్యవర్తులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. వైవాహిక, కుటుంబ, ఆస్తి, భూ, డబ్బు, వినియోగదారుల తదితర వివాదాలకు సంబంధించి కోర్టుల్లో కేసులు ఉన్న వారు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి మధ్యవర్తిని కోరవచ్చన్నారు. ఇరుపక్షాలతో చర్చలు జరిపి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారానికి మధ్యవర్తి కృషి చేస్తారని చెప్పారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకుంటే కోర్టుల చుట్టూ తిరగడం, సమయం, న్యాయపరమైన ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. నామమాత్రపు రుసుముతో సత్వర పరిష్కారం లభిస్తుందని, రాజీ కుదిరిన సందర్భాల్లో కోర్టు ఫీజు వాపసు పొందే అవకాశం కూడా ఉంటుందని పేర్కొన్నారు.

గోప్యతకు ప్రాధాన్యం

రాజీకి అవకాశం ఉందని న్యాయమూర్తికి అనిపించినప్పుడు కేసును మధ్యవర్తిత్వానికి పంపవచ్చని తెలిపారు. అలాగే ఇరుపక్షాలు కోరుకున్నా విజ్ఞాపన పత్రం ద్వారా మధ్యవర్తిత్వానికి పంపాలని అభ్యర్థించవచ్చన్నారు. మధ్యవర్తిత్వ ప్రక్రియలో కక్షిదారులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా, అనధికారికంగా, గోప్యంగా వెల్లడించవచ్చని వివరించారు. ఒకవేళ రాజీ కుదరకపోయినా మధ్యవర్తిత్వంలో వెల్లడించిన విషయాలను తదుపరి విచారణలో ఒక పక్షానికి వ్యతిరేకంగా ఉపయోగించలేరని స్పష్టం చేశారు. మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలను పరిష్కరించుకోవడం వల్ల ఇరుపక్షాల మధ్య శత్రుత్వం తగ్గడంతో పాటు వ్యక్తిగత, వ్యాపార సంబంధాలను కొనసాగించుకునే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు, పోక్సో న్యాయమూర్తి కోట్ల లావణ్య బాల్‌రెడ్డి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.కళార్చన, అడిషనల్ సివిల్ జడ్జి కే.కవిత, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు కిరణ్, కార్యదర్శి వెంకటరమణ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీప కాసరగడ్డ, శిక్షణ పొందిన మధ్యవర్తులు పాల్గొన్నారు.



# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా కొత్తగా రూపకల్పన

- సెప్టెంబర్ 28 నుంచి దరఖాస్తుల స్వీకరణ.. నవంబర్ 6 వరకు గడువు
- నవంబర్ 25న ముసాయిదా జాబితా.. డిసెంబర్ 30న తుది జాబితా

గద్వాల సెప్టెంబర్ 19(ప్రజా జ్యోతి ప్రతినిధి): మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి ఓటర్ల జాబితాను కొత్తగా రూపొందించనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.2027 మార్చిలో ఈ ఎమ్మెల్సీ స్థానం ఖాళీ కానున్న నేపథ్యంలో,భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియను ప్రారంభించినట్లు పేర్కొన్నారు.సెప్టెంబర్ 28న ప్రజా ప్రకటన జారీ చేయనున్నట్లు తెలిపారు.అనంతరం అక్టోబర్ 15,25 తేదీల్లో వార్తాపత్రికల్లో ప్రజా ప్రకటనను పునఃప్రచురించనున్నట్లు వెల్లడించారు.అర్హత కలిగిన పట్టభద్రుల నుంచి సెప్టెంబర్ 28 నుంచి నవంబర్ 6,2026 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.నవంబర్ 25,2026న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించి,క్లెయిమ్‌లు,అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం డిసెంబర్ 30,2026న తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఈసారి ఓటర్ల జాబితాను డీనోవో పద్ధతిలో కొత్తగా రూపొందిస్తున్నందున,గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదైన వారు సైతం తప్పనిసరిగా కొత్తగా ఫారం–18 దరఖాస్తు సమర్పించి నమోదు చేసుకోవాలని సూచించారు.అర్హత కలిగిన పట్టభద్రులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.ఫారం–18లో ఆధార్ నంబర్ నమోదు చేయడం తప్పనిసరి కాదని,అది పూర్తిగా స్వచ్ఛందమని కలెక్టర్ స్పష్టం చేశారు.ఆధార్ నంబర్ ఇవ్వలేదనే కారణంతో దరఖాస్తును తిరస్కరించరాదని అధికారులను ఆదేశించారు.ఆధార్ వివరాల గోప్యతను కాపాడుతూ,నిబంధనల ప్రకారం వాటిని భద్రపరచాలని సూచించారు.ఓటర్ల జాబితా తయారీకి సంబంధించిన తేదీలు,విధానం,అర్హతలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.



# జూరాల నీళ్ల కోసం రోడ్డెక్కిన రైతులు కలెక్టర్ రావాల్సిందే!”

-జూరాల నీళ్ల కోసం రైతుల ఆందోళన

-ఫ్లైఓవర్ వద్ద ధర్నా కలెక్టర్ స్వయంగా వచ్చి సమస్య పరిష్కరించాలంటూ రైతుల డిమాండ్

గద్వాల ప్రజా జ్యోతి సెప్టెంబర్ 19: జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు సరైన సమయంలో విడుదల కాకపోవడంతో పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ 10 గ్రామాలకు చెందిన రైతులు శనివారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో 2 గంటలుగా ఆందోళనకు దిగారు.ముందుగా



కలెక్టరేట్‌ను ముట్టడించిన రైతులు అనంతరం ఫ్లైఓవర్ సమీపంలో బైఠాయించి ధర్నా నిర్వహించారు.

జూరాల నుంచి తమ ప్రాంతాలకు సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నీటి విడుదలపై అధికారులు వెంటనే స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన పరిష్కారం లభించలేదని రైతులు పేర్కొన్నారు.కలెక్టర్ స్వయంగా ధర్నా ప్రదేశానికి వచ్చి రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని రైతులు స్పష్టం చేశారు. సాగునీరు అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రైతులు ధర్నా చేయడంతో వాహనాలు ట్రాఫిక్‌తో రెండు గంటలుగా నిలిచిపోయింది.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా అన్నదానం

గద్వాల సెప్టెంబర్ 19(ప్రజా జ్యోతి ప్రతినిధి): వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద శనివారం అన్నదాన కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం పోలీసు అధికారులు, సిబ్బంది,మీడియా ప్రతినిధులు,ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,వినాయక చవితి పండుగను ప్రజలందరూ సామరస్యంతో,శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. సమాజంలో శ్రేయస్సు,సౌభ్రాతృత్వం వెల్లివిరిసేలా భక్తి కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలను కూడా కొనసాగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.శంకర్,గద్వాల డీఎస్పీ వై.మొగిలయ్య,డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ టాటా బాబు,గద్వాల సీఐ శ్రీను,అలంపూర్ సీఐ వి.ప్రదీప్,ఆర్ఐలు నరేష్,వెంకటేష్,హరీఫ్,ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు,మీడియా ప్రతినిధులు,పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘుపతి నాయుడు,పోలీసు సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు.





# విషజ్వరాల కలకలం!

- 18 ఏళ్ల విద్యార్థిని మృతి.. గోపనపల్లిలో విషాదం
- కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స..
- రక్తంలో ఇన్ఫెక్షన్‌తో పరిస్థితి విషమించి మృతి
- ప్రజారోగ్యంపై అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?



**పర్వతగిరి, సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి) :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని గోపనపల్లి గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. జ్వరంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 18 ఏళ్ల విద్యార్థిని బోయిని నందిని శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. చిన్న వయసులోనే విద్యార్థిని మృతి చెందడం కుటుంబ సభ్యులను, గ్రామస్తులను తీవ్రంగా కలచివేసింది.

**కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతున్న నందిని :** గోపనపల్లి గ్రామానికి చెందిన బోయిని నందిని కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తొలుత సాధారణ జ్వరంగా భావించినప్పటికీ పరిస్థితి క్రమంగా విషమించడంతో తల్లిదండ్రులు అనిల్, రేవతి ఆమెను ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల్లో రక్తంలో ఇన్ఫెక్షన్ ఉన్నట్లు వైద్యులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఆసుపత్రిలో నందినికి చికిత్స కొనసాగుతున్నప్పటికీ ఆరోగ్య పరిస్థితి విషమించిందని, చివరకు శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

**కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు :** కూతురు మృతితో తల్లిదండ్రులు అనిల్, రేవతి కన్నీరుమున్నీరుగా విలపించారు. విద్యార్థిని మృతి విషయం తెలిసిన వెంటనే గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. నందిని మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటగా, గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

**జ్వరాలపై అప్రమత్తత అవసరం :** ఒక యువ విద్యార్థిని జ్వరంతో చికిత్స పొందుతూ మృతి చెందడం నేపథ్యంలో మండలంలో ప్రజారోగ్యంపై మరోసారి చర్చ మొదలైంది. గ్రామాల్లో జ్వరాలతో బాధపడుతున్న వారి పరిస్థితిపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు, నిల్వ నీటి ప్రాంతాలు, దోమల నియంత్రణ చర్యలను అధికారులు పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. అవసరమైన చోట వైద్య శిబిరాలు నిర్వహించి జ్వర బాధితులకు పరీక్షలు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ప్రజల్లో పెరుగుతున్న ఆందోళన :** జ్వరం వచ్చినప్పుడు తొలిదశలోనే వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా జ్వరం ఎక్కువ రోజులు కొనసాగడం, తీవ్రమైన నీరసం, వాంతులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాల్సిన అవసరం ఉంది.

**అధికారులు స్పందించాల్సిన సమయం ఇదేనా? :** నందిని మృతికి సంబంధించిన పూర్తి వైద్య కారణాలను అధికారికంగా నిర్ధారించాల్సి ఉన్నప్పటికీ, ఈ ఘటన నేపథ్యంలో గోపనపల్లి సహా మండలంలోని అన్ని గ్రామాల్లో జ్వరాల పరిస్థితిపై వైద్య ఆరోగ్యశాఖ సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ఒక యువ ప్రాణం కోల్పోయిన ఈ ఘటనతోనైనా అధికారులు అప్రమత్తమై గ్రామాల్లో పారిశుద్ధ్యం, దోమల నియంత్రణ, వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారిస్తారా? లేక మరో ఘటన జరిగే వరకు వేచి చూస్తారా? అనే ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి.

# ఈనెల 27న చలో వరంగల్

## బిసి ఎస్సీ ఎస్టీ బహిరంగ సభ



విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలు ఆవిష్కరించిన నాయకులు

**ములుగు సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి) :** ములుగు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బిసి ఎస్సీ ఎస్టీ జేఏసీ ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 27న జరిగే చలో వరంగల్ బిసి ఎస్సీ ఎస్టీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలు ఆవిష్కరణ చేయడం జరిగింది.బిసి ఎస్సీ ఎస్టీ జేఏసీ ములుగు జిల్లా చైర్మన్ ముంజాల బిక్షపతి గౌడ్ అధ్యక్షతన ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి బిసి,ఎస్సీ, ఎస్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ రిటైర్డ్ ప్రొఫెసర్ చందా మల్లయ్య, బిసి ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి పొదిళ్ల సాయిబాబా,బిసి ఎస్సీ, ఎస్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్ మేకల సుమన్ ముఖ్యఅతిథులు గా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..హన్మకొండ హంటర్ రోడ్డులో ఉన్న డి కన్వెన్షన్ హాల్ లో ఈనెల 27న నిర్వహించే బిసి ఎస్సీ ఎస్టీ భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, ములుగు జిల్లా నుండి ఈ కార్యక్రమానికి బిసి,ఎస్సీ ఎస్టీలు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు.సామాజిక న్యాయం,రాజ్యాధికారంకై ఉద్యమించాలని బీసీఎస్సీ ఎస్టీలకు పిలుపునిచ్చారు. ఎవరి కులం ఎంతో వారి కంత వాటా సామాజిక న్యాయం కోసం బిసి ఎస్సీ ఎస్టీలు ఉద్యమించాలని అన్నారు.90 శాతం ఉన్న బిసి ఎస్సీ ఎస్టీలు రాజ్యాధికారంకోసం సిద్ధంకావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిసి,ఎస్సీ, ఎస్టీ జిల్లా కన్వీనర్ జేరు పోతుల కరుణాకర్,బిసి, ఎస్సీ,ఎస్టీ ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మల్యాల మనోహర్, ఎంబిసి,బీసీ,ఎస్సీ ఎస్టీ జేఏసీ వాజేడు మండల కన్వీనర్ చిరంజీవి, ఎమ్మార్పీఎస్ టిఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు ఎల్.అశోక్,ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి దేవా,టిడిపి ములుగు నియోజకవర్గ ఇంచార్జి గొంగళ్ళ కట్టయ్య, బొచ్చు సాంబయ్య బిఎస్పీ జిల్లా కార్యదర్శి బాణాల కొంరయ్య,బాణాల ప్రభాకర్ బిసి ఎస్సీ ఎస్టీ సామాజిక న్యాయవేదిక ములుగు జిల్లా అధ్యక్షుడు తెలంగాణ ఉద్యోగుల సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు గుల్లగట్టు సంజీవ,బైకాని మోహన్, దామోదర్,గౌడ జేఏసీ నాయకుడు మోడం మొగిలి గౌడ్,శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

# వాగు మాటు వద్ద మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి







- ప్రజల జీవనాధారాలను, ప్రకృతి వనరులను కాపాడాలి..
- బీజేపీ నాయకులు డా. పగడాల కాళీ ప్రసాద్ రావు..

**నడికూడ, సెప్టెంబర్ 19 ప్రజాజ్యోతి :**
నడికూడ మండలం కంటాత్మకూర్ వాగు మాటు వద్ద మైనింగ్‌కు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పరకాల నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డా. పగడాల కాళీ ప్రసాద్ రావు డిమాండ్ చేశారు. మైనింగ్ కార్యకలాపాలతో స్థానిక ప్రజల జీవనాధారాలు, వ్యవసాయం, నీటి వనరులు, తాటి వనం, ప్రకృతి సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉందని పేర్కొన్నారు.

నడికూడ మండల బీజేపీ అధ్యక్షులు ఎరుకల దివాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పర్యవేక్షణ కార్యక్రమంలో డా. కాళీ ప్రసాద్ రావు పాల్గొని మాట్లాడారు.. కంటాత్మకూర్ వాగు మాటు ప్రాంతాన్ని పరిశీలించడంతో పాటు, శిథిలావస్థలో ఉన్న పురాతన మాడెలయ్య గణపతి, శివ దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ఐదు గ్రామాల రైతులకు జీవనాధారం.. :** కంటాత్మకూర్ వాగు మాటు పరిసర ప్రాంతం సుమారు ఐదు గ్రామాల రైతుల జీవనాధారంతో ముడిపడి ఉందని డా. కాళీ ప్రసాద్ రావు తెలిపారు. వ్యవసాయానికి అవసరమైన నీటి వనరులు ఈ ప్రాంతంపై ఆధారపడి ఉన్నాయని చెప్పారు. మాటు వద్ద ఉన్న గుట్ట గ్రామానికి రక్షణగా ఉండటంతో పాటు స్థానిక పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలకంగా ఉందన్నారు. మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభమైతే గుట్టతో పాటు నీటి వనరులు, వ్యవసాయ భూములు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణంపై ప్రభావాన్ని, స్థానిక ప్రజల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోకుండా మైనింగ్‌కు అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు.

**తాటి వనం, మత్స్యకారుల ఉపాధికి ముప్పు.. :** మాటు చుట్టూ ఉన్న తాటి వనం గీత కార్మికులకు ముఖ్యమైన జీవనాధారంగా ఉందని డా. కాళీ ప్రసాద్ రావు పేర్కొన్నారు. అలాగే మాటు స్థానిక ముదిరాజ్ కుటుంబాలకు ఉపాధి కల్పించే వనరుగా ఉందన్నారు. మైనింగ్ కారణంగా ఈ వనరులు దెబ్బతింటే అనేక కుటుంబాల ఉపాధిపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు.

అందువల్ల కంటాత్మకూర్ వాగు మాటు వద్ద ఇచ్చిన మైనింగ్ అనుమతులను వెంటనే రద్దు చేసి గుట్ట, మాటు, తాటి వనం, నీటి వనరులు, వ్యవసాయం, స్థానిక ప్రజల జీవనాధారాలను రక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీజేవైఎం జిల్లా అధ్యక్షులు పున్నం వేణు, జేఏసీ చైర్మన్ రేకుల సతీష్, గునిపర్తి సర్పంచ్ కరుణాకర్, మదన్నపేట సర్పంచ్ రమేష్, శనిగరం సర్పంచ్ రాజ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శులు తిపరపు సుధీర్, దండు సురేష్, ఎస్సీ జిల్లా ఉపాధ్యక్షులు మేకల నరేష్, తాళ్లపెల్లి హరికృష్ణ, బీజేపీ మండల నాయకులు, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు గుడికందుల శివ, మాజీ సర్పంచ్ శివకుమార్, మండల ఉపాధ్యక్షులు బండ్ల వేణు, బూత్ అధ్యక్షులు కృష్ణమూర్తి గౌడ్, పోరెడ్డి ప్రదీప్‌రెడ్డి, కందుల రవి, వర్మ, బోసు, రాజేష్, గోల్కొండ నిఖిల్‌తో పాటు పెద్ద సంఖ్యలో రైతులు, గౌడ, ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ ఆర్థిక సాయం



**దేవరుప్పుల, సెప్టెంబరు 19 (ప్రజాజ్యోతి) :** పెద్దమడూరు గ్రామానికి చెందిన పానుగంటి సాయిలు మృతి చెందడంతో బీఆర్ఎస్ జిల్లా నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ సంతాపం వ్యక్తం చేసి, మృతుడి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. శనివారం సాయిలు భౌతికకాయాన్ని సందర్శించిన గ్రామ బీఆర్ఎస్ నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం శ్రీకాంత్ గౌడ్ తరపున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గిరిబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు బండారి రాములు, ఉప సర్పంచ్ సంపత్ గౌడ్, వార్డు సభ్యుడు శ్రీశైలం, కారుపోతుల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల సర్వతోముఖాభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం అవసరం

- ఉపాధ్యాయ-తల్లిదండ్రుల సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ కె.నవీన్ కుమార్



**పర్వతగిరి, సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి) :** ఎంపీఎస్ పర్వతగిరి పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ,తల్లిదండ్రుల సమావేశంతో పాటు బాలల సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ కె.నవీన్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య నిరంతర సమన్వయం, సత్సంబంధాలు ఉంటే విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారి వ్యక్తిత్వ వికాసానికి మరింతగా దోహదపడుతుందని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులతో చర్చిస్తూ అవసరమైన సహకారం అందించాలని సూచించారు. బాలల సభ ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యత పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడంతో పాటు వివిధ అంశాలపై అవగాహన పెంచుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే విధంగా వివిధ అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బ్యాగులు, ప్లేట్లు బహుమతులుగా అందజేశారు. బహుమతులు అందుకున్న విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎ. వెంకటరమణారెడ్డి, ఎపిసి చైర్పర్సన్ నీరటి జ్యోతి, స్కూల్ కాంప్లెక్స్ సీనియర్ ఉపాధ్యాయులు రమేష్ బాబు, ఉపాధ్యాయులు లలితాదేవి, సుభాషిని, నవీన్ కుమార్, కిషన్, ఆఫీస్ సబార్డినేట్ వంశీ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు అండగా ఉంటా...

మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి..



**పరకాల సెప్టెంబర్ 19 ప్రజాజ్యోతి :** పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శనివారం పరకాల మున్సిపాలిటీ పరిధిలోని విలీన గ్రామం సీతారాంపురంలో ఇటీవల మృతిచెందిన ఇండ్ల ఐలయ్య, రాగుల నీలమ్మ, గునిగంటి సుగుణ, దుంపేటి సారయ్య కుటుంబాలను ఆయన పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని చల్లా ధర్మారెడ్డి భరోసా కల్పించారు. అనంతరం పరకాల మండలం మల్లక్కపేట గ్రామంలో విద్యుత్‌ఘాతానికి గురై ఇటీవల మృతిచెందిన రాసమల్ల కుమారస్వామి కుటుంబాన్ని కూడా చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. కుమారస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## నిమజ్జనం వేళ.. జర పైలం!

- గణేశ్ శోభాయాత్రలో అప్రమత్తతే శ్రీరామరక్ష
- భద్రతా నియమాలు పాటించాలి.. నిర్లక్ష్యం వద్దు : ఎస్ఐ రాజు



**భీమదేవరపల్లి సెప్టెంబర్ 19 ప్రజా జ్యోతి :** గణేశ్ నిమజ్జన వేళ అప్రమత్తంగా ఉండాలని ముల్కనూర్ ఎస్ఐ రాజు సూచించారు. మండలవ్యాప్తంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతుండగా.. ఆరో రోజు నుంచి 11వ రోజు వరకు నిమజ్జనాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో శోభాయాత్ర నుంచి నిమజ్జనం వరకు భద్రతా నియమాలు పాటించాలని కోరారు. విగ్రహాలను తరలించే వాహనాల సామర్థ్యాన్ని ముందుగానే పరిశీలించుకోవాలని, అనుభవజ్ఞులైన డ్రైవర్లనే నియమించుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, శోభాయాత్రలో పాల్గొనడం చేయరాదన్నారు. పోలీసుల సూచనలు పాటిస్తూ నిర్దేశిత మార్గంలోనే ఊరేగింపు కొనసాగించాలని, విద్యుత్ తీగలు, చెట్ల కొమ్మల పట్ల జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు. చెరువులు, ఇతర నీటి వనరుల్లో నిమజ్జనం సమయంలో చిన్నారులను దూరంగా ఉంచాలని, ఈత రానివారు నీటిలోకి దిగరాదని హెచ్చరించారు. నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా ముగించేందుకు నిర్వాహకులు, భక్తులు బాధ్యతగా వ్యవహరించాలని, ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

## పేదలకు సీఎంఆర్ఎఫ్ భరోసా



**భీమదేవరపల్లి సెప్టెంబర్ 19 ప్రజా జ్యోతి :** ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోంది. అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందిన నిరుపేదలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ఈ నిధి ద్వారా అందే సాయం ఎంతో ఊరటనిస్తోంది. ఇందులో భాగంగా భీమదేవరపల్లి గ్రామానికి మంజూరైన నాలుగు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో పోలు తిరుపతికి రూ.6 లక్షలు, గుడికందుల సదానందానికి రూ.50 వేలు, మీడిదొడ్డి కావేరికి రూ.45 వేలు, మాచర్ల అరుణ్‌కు రూ.11,500 అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తాళ్లపల్లి సదానందం, పార్టీ నాయకులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## జోనల్ క్రీడల్లో పర్వతగిరి సోషల్ వెల్ఫేర్ విద్యార్థినుల సత్తా



**పర్వతగిరి, సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి) :** జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో పర్వతగిరి సోషల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి మండలాల పరిధిలో నిర్వహించిన జోనల్ స్థాయి కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ పోటీల్లో పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన అండర్-14 విభాగంలో 8వ తరగతి విద్యార్థిని సహస్ర, అండర్-17 వాలీబాల్ విభాగంలో సీహెచ్. నందిని, అండర్-17 విభాగంలో శ్రీ నిత్య జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థినులను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. జిల్లా స్థాయి పోటీల్లోనూ ఇదే స్ఫూర్తితో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## పోషకాహారంతో చిన్నారుల ఎదుగుదల



**భీమదేవరపల్లి సెప్టెంబర్ 19 ప్రజా జ్యోతి :** చిన్నారుల సంపూర్ణ ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని, గర్భిణులు, బాలింతలు సమతుల్య ఆహారం తీసుకోవాలని నిర్వాహకులు సూచించారు. మండలం లోని గొల్లపల్లి గ్రామంలో సర్పంచ్ నేతుల చంద్ర మోహన్ అధ్యక్షతన, సూపర్‌వైజర్ అనితాదేవి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు 80 మంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో పోషకాహారం, మాతా శిశు ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నేతుల అనూష, డీఆర్ మౌనిక, అంగన్‌వాడీ టీచర్లు అరుణ, విజయ, సరోజ, ఏఎన్ఎం సత్య, ఆశా కార్యకర్త రోజుకొండమ్మ, గర్భిణులు, బాలింతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## శక్తిస్థల్‌లో గణనాథునికి ప్రత్యేక పూజలు..

బీజేపీ రాష్ట్ర నాయకులు
డా. పెసరు విజయ చందర్ రెడ్డి..



**పరకాల సెప్టెంబర్ 19 ప్రజాజ్యోతి :** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పరకాల పట్టణంలోని శక్తిస్థల్ (మార్కెట్ రోడ్ సర్కిల్) వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో శనివారం ఉదయం గణనాథునికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంచార్జ్ డా. పెసరు విజయ చందర్ రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణనాథుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, పరకాల పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. పట్టణం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్, మున్సిపల్ కౌన్సిలర్లు కుక్కల విజయకుమార్, బెజ్జంకి పూర్ణచారి, వ్యవసాయ సహకార సంఘం వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్ రెడ్డి, జిల్లా కోశాధికారి ఎర్రం రామన్న, రాష్ట్ర నాయకులు కాచం గురుప్రసాద్, పరకాల రూరల్ మండల అధ్యక్షులు కాసాగాని రాజ్‌కుమార్, పట్టణ ఉపాధ్యక్షులు మిడిదొడ్డి నరేష్, ప్రధాన కార్యదర్శులు సంఘ పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, ఓబీసీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి ఉడుత చిరంజీవి, దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు దుబాసి కృష్ణ ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్మన్ మార్త రాజభద్రయ్య, నాయకులు పావుశెట్టి శ్రీనివాస్, కుంటమల్ల గణేష్, ముత్యాల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరాజుపల్లిలో ఘనంగా అన్నదానం

వినయ్ జ్ఞాపకార్థం అన్నప్రసాద వితరణ



**దేవరుప్పుల, సెప్టెంబరు 19 (ప్రజాజ్యోతి):** మండలంలోని సింగరాజుపల్లి గ్రామంలో అల్లూరి సీతారామరాజు యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శనివారం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కీర్తిశేషులు మందుగులోజు వినయ్ జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు మందుగులోజు ఉమా--పరమాత్మచారి దంపతులు, మారేడుపాక రాజ్‌కుమార్--రమ్య ప్రసన్న, సిరి, ఉమాశంకర్ కుటుంబాల సహకారంతో భక్తులకు అన్నప్రసాదం అందించారు.భక్తి, సేవా కార్యక్రమాలతో గ్రామంలో ఐక్యత పెంపొందుతుందని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ కొండ ఊర్మిళా--మల్లారెడ్డి, ఉప సర్పంచ్ జోగు అనిల్, కాంటెస్ట్ సర్పంచ్ కత్తుల సోమిరెడ్డి,మాజీ సర్పంచులు కొమ్ము రాములు,రచ్చ ఎల్లప్ప, గోపాల్ దాస్ మల్లేష్,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు,భక్తులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## స్నేహ యూత్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ అక్షంక్ష్ యాదవ్




**భువనగిరి,సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి) :** భువనగిరి పట్టణం లోని బంజారాహిల్స్ 31వ వార్డులో ఘనంగా అన్నప్రసాద,కార్యక్రమం బంజారాహిల్స్ 31వ వార్డులో,స్నేహ యూత్ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్య క్రమానికి యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై అన్న ప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ అన్నప్రసాదాన్ని కందుల నర్సిరెడ్డి మరియు కందుల లక్ష్మారెడ్డి సహకారం తో ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ యువత ఇలాంటి సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం అభినంద నీయమని,ప్రజలను ఒకచోట చేర్చి అందరూ కలిసి పాల్గొనడం ద్వారా ఐక్యత,సోదరభావం మరింత బలపడతాయని అన్నారు.యువత సమాజ సేవలో చురుకుగా పాల్గొని ప్రజలకు ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో 31వ వార్డు కౌన్సిలర్ సుమయ్య తబస్సుం షఫీక్ అహ్మద్ వార్డు సభ్యులు బానోత్ సంతోష్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయ వంతం చేయడంలో స్నేహ యూత్ సభ్యులు గుండూరు,రజనీకాంత్ గంగసాని నరేశ్,తోట విజయకుమార్,జోగు పురుషోత్తం,జటంగి సాయిగణేశ్,కాటం వినీత్ కుమార్,దడ్డి చరణ్,శ్రీరాం హరిబాబు,కందుల లక్ష్మారెడ్డి, సైదులు బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరి పట్టణంలోని గణేష్ మండపాలను సందర్శించిన జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఐపీఎస్




**భువనగిరి,సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి) :** భువనగిరి పట్టణంలోని వివిధ వినాయక మండపాలను సందర్శించి దిశా నిర్దేశం చేసినయాదాద్రి జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ అనంతరం గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఎస్పీ మాట్లాడుతు గణేష్ ఉత్సవాల సందర్భంగా మండపాల వద్ద భక్తుల రద్దీ, భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడి,ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో పాటు ప్రశాంతమైన వాతావ రణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖకు సహకరిం చాలని సూచించారు. అనంతరం గణేష్ మండపం వద్ద నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్య క్రమంలో



పాల్గొన్నారు. గణేష్ ఉత్సవాలు మరియు రాబోయే నిమజ్జన కార్యక్రమాలు ఎలాంటి అవాంఛనీయ సంఘట నలకు తావు లేకుండా ప్రశాంతంగా సురక్షితంగా జరిగేలా పోలీసు శాఖ అన్ని ముందస్తు,భద్రతా చర్యలు చేపడుతోందని ఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతు "భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను జరుపు కుందాంపరస్పర సహకారంతో శాంతి భద్రతలను కాపాడు కుందాం.గణనాథుని ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖ శాంతులు,సౌభాగ్యం వెల్లివిరియాలి.గణేష్ ఉత్సవ,కమిటీ నిర్వాహ కులు,భక్తులు పోలీసు శాఖ సూచనలు మరియు భద్రతా,నిబంధనలను పాటిస్తూ ఉత్సవాలను విజయ వంతంగా నిర్వహించాలని ఎస్పీ కోరారు.

## ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం



**ఆలేరు సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల ఉత్తమ ఉపాధ్యాయులు గా ఎంపికైన టంగుటూరు గ్రామానికి చెందిన వడ్డేపల్లి సిద్దేశ్వర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొలనుకొండ వారికి శ్రీ వీరాంజనేయ రాజక సంఘం ఆధ్వర్యంలో అభినందిచి శాలువ తో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వడ్డేపల్లి కిషన్, ఉపాధ్యక్షుడు ముదిగొండ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి గజరాజు మధు, జంగిరూ,విరమల్లు,సారయ్య, బాలరాజు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## మందనపల్లి మాజీ సర్పంచ్ డొంకెన నాగమణికి పరామర్శ



**ఆలేరు సెప్టెంబర్ 19( ప్రజా జ్యోతి) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం మందనపల్లి గ్రామ మాజీ సర్పంచ్ కామ్రేడ్ డొంకెన నాగమణి అనారోగ్యానికి గురవడంతో సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్ధన్,డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్, ఏఐకెఎం ఎస్ జిల్లా అధ్యక్షులు కల్లెపు అడివయ్య, ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్, పీఓ డబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఆర్.సీత, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు పద్మ సుదర్శన్, ఏఐకెఎంఎస్ జిల్లా నాయకులు తమ్మడి అంజయ్య, కర్రె స్వామి, కుర్రి మార్కండేయ, యెలగందుల సిద్దులు, కడకంచి బీరయ్య,ఆర్.ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వృద్దురాలి మృతదేహం లభ్యం

**మిర్యాలగూడ, సెప్టెంబర్ 19, (ప్రజాజ్యోతి) :** మిర్యాలగూడ పట్టణంలోని సాగర్ రోడ్ లో ఉన్న విగ్నేశ్వర ట్రేడర్స్ పక్కన ఉన్న రేకుల షెడ్డులో సుమారు 80-85 సంవత్సరాల వయసున్న గుర్తుతెలేని వృద్ధురాలి మృతదేహం లభ్యమైనట్లు టూ టౌన్ సిఐ జె.సోమనర్సయ్య తెలిపారు. రేకుల షెడ్డు నుండి ప్రియమైన దుర్వాసన రావడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పరిశీలించగా బూడిద రంగు టాప్ వేసుకున్న, సుమారు 5 అడుగుల ఎత్తు గలిగిన మృతదేహం టీ కంపోజ్ అయిన స్థితిలో లభించిందని, మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించి భద్రపరిచి నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసినవారు టూ టౌన్ పోలీసులకు 871266 7749, 8712670150 నెంబర్ల కు సమాచారం అందజేయాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



## చిన్నారులను ఆశీర్వదించిన డాక్టర్ వేణుధర్ రెడ్డి




**కొండమల్లేపల్లి, సెప్టెంబర్ 19, (ప్రజాజ్యోతి):** చిలకమర్రి గ్రామానికి చెందిన అదాసు మురళి-- శ్రీదేవి దంపతుల కుమారులు జీవన్, మైథిలీల జన్మదిన సందర్భంగా టీపీసీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ వేణుధర్ రెడ్డి వారిని కలిసి జన్మదిన శు భాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు.ఈ సందర్భంగా చిన్నారులకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నీలం శ్రీనివాస్, చిన్నర్సలపల్లి మాజీ సర్పంచ్ గడ్డం శ్రీరాములు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఎల్లయ్య, కోర్ర తండా ఉపసర్పంచ్ నాగరాజు నాయక్, చింతకుంట్ల ఉపసర్పంచ్ బాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాదర్,నగేష్, గిరి, రమేష్, అంబేద్కర్,సురేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న కుటుంబానికి ఆపన్నహస్తం అందించిన జోగయ్య

**మల్లేపల్లి, సెప్టెంబర్ 19, (ప్రజాజ్యోతి) :** గ్రామానికి చెందిన కుంచం గిరి సన్నాఫ్ వెంకటయ్య గత కొద్ది రోజుల క్రితం దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ నాయక్‌ను కలిసి తనకు బ్రెయిన్‌లో బ్లడ్ క్లాట్ అయి తీవ్ర అనారోగ్యానికి గురైనట్లు వివరించారు.వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు, ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు.దీంతో స్పందించిన మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ నాయక్ వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించాలని సూచించారు. ఈ మేరకు జోగయ్యకు ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. ఆర్థిక సాయం అందజేసిన జోగయ్యకు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ, చికిత్సకు అవసరమైన సహాయం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు కుంచం విప్పు, శ్రీరాములు, రాజు, నాగార్జున తదితరులు పాల్గొన్నారు



## సమావేశానికి ఎజెండా అవసరం ఉన్నట్టా లేనట్టా

గరం గరంగా మండల సర్వసభ సమావేశం



**ఆలేరు, సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి) :** సమావేశానికి ఎజెండా పంపడం అవసరం లేదా అని జేఏసీ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు జూకంటి అనిల్ అధికారులను ప్రశ్నించారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సత్య ఆంజనేయ ప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ సమావేశం వాడివేడిగా జరిగింది. సమావేశంలో పలు సమస్యలపై సర్పంచులు, అధికారులు మధ్య చర్చ జరిగింది.ఈ సందర్భంగా టంగుటూరు గ్రామ సర్పంచ్ జూకా అనిల్ కుమార్ మాట్లాడుతూ. ఎజెండా లేకుండానే మండల సర్వసభ సమావేశాన్ని ఎలా నిర్వహిస్తారని ఎంపీడీఓను ప్రశ్నించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశంలో చర్చించి పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం విద్యుత్ శాఖకు సంబంధించిన సమస్యలను సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకె ళ్లారు. ఆలేరు మండలంలో విద్యుత్‌లో వోల్టేజ్ సమ స్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇనుప స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని పలుమార్లు విద్యుత్ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ కు సంబంధించిన అధికారులు గ్రామాల్లో సరిగ్గా పనిచేయడం లేదని తెలిపారు. వైద్యం విషయంలో డాక్టరు ఇచ్చిన సర్టిఫికెట్ సరికాదని కంప్యూటర్ ఆపరేటర్ నీనే డాక్టరు అని వ్యవహరించడం ఎంతవరకు సత్యమని అన్నారు. గ్రామాలలో అధికారులు వైద్య మీద సరైన అవగాహన చూపడం లేదన్నారు. అధికారులు ప్రభుత్వ మీద కపట ప్రేమ చూపకూడదన్నారు. ఇలాంటివి మరొకసారి రిపీట్ కావద్దని ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేస్తానని చెప్పిన మాటలు కాకుండా పనిచేసి చూపించాలని అధికారులను కోరారు.అనంతరం వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన అంశాలు, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలను సమావేశంలో చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ ఆంజనేయులు, పిఏసిఎస్ చైర్మన్ జనగాం ఉపేందర్రెడ్డి, ఎంపీ ఓ అనురాధ దేవి, ఏపీవో అరుణకుమారి, ఏవో శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈ నవ్య, ఆర్డబ్ల్యూఈ సుప్రియ, ఆర్ అండ్ బి ఏ ఈ కరుణాకర్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఉమారాణి, ఆండాలు, వివిధ గ్రామాల సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యల పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

- ఈనెల 26న ఆలేరులో జరిగే ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలను జయప్రదం చేయండి
- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతి కుమార్



**ఆలేరు సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి) :** విద్యారంగ సమస్యల పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని, ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ల మంజూరీలో ప్రభుత్వం అలసత్వం వహిస్తుందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శాంతి కుమార్ విమర్శించారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపల్ కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ మండల మహాసభను ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు కందుల మధు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆయన విమర్శించారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థల్లో సమస్యలు విలయ తాండవం చేస్తుంటే ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుండా ప్రైవేట్ విద్యా రంగాన్ని ప్రోత్సహిస్తుందని ఆయన అన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో కనీస వసతులు లేక విద్యార్థుల తీవ్ర ఇబ్బందులు గురవుతున్న ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆయన దుయ్యబట్టారు. తక్షణమే సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపై రాజీ లేని పోరాటాలు నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తక్షణమే పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్లను మొత్తం ఒకేసారి విడుదల చేయాలని లేనిపక్షంలో మంత్రుల క్యాంప్ కార్యాలయాలను ముట్టడిస్తామని ఆయన తెలిపారు. ఈనెల 26న ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలను మరియు యాదాద్రి భువనగిరి జిల్లా నాలుగవ మహాసభ జయప్రదం చేయుట కొరకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.అనంతరం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది

మండల అధ్యక్షులుగా సాయినాథ్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉదయ్ చరణ్, ప్రధాన కార్యదర్శిగా చండీశ్వర్ ఉపాధ్యక్షులుగా సోమనాథ్, అభి సహాయ కార్య దర్శులుగా దినేష్, సాయికిరణ్ కోశాధికారిగా వెంకట్ సూర్య ఎన్నికయ్యారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి భారీ భద్రత

- తంగడపల్లిలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్
- డీఎస్పీ ఆదేశాలతో రంగంలోకి సాయుధ బలగాలు
- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు
- చౌటుప్పల్ సీఐ మన్మథ కుమార్




**చౌటుప్పల్, సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి) :** వినాయక నిమజ్జన ఉత్సవాల వేళ శాంతిభద్రతల పరిరక్షణ కోసం చౌటుప్పల్ పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఉత్సవాల మాటున ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తూ, ప్రజల్లో భద్రతా భావాన్ని నింపేందుకు పోలీసులు సాయుధ బలగాలతో భారీ కవాతు నిర్వహించారు.

చౌటుప్పల్ డీఎస్పీ పి.మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి.మన్మథ కుమార్ ఆధ్వర్యంలో తంగడపల్లి లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బందితో పాటు ప్రత్యేక సాయుధ బలగాలు (ఏఆర్ పోలీసులు) తుపాకులు ధరించి కవాతులో కదం తొక్కారు.

ఈ సందర్భంగా సీఐ మన్మథ కుమార్ మాట్లాడుతూ.. వినాయక నిమజ్జన వేడుకలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో జరుపుకోవాలని సూచించారు. పండుగ పూట చిల్లర తగాదాలు, ఆకతాయి చేష్టలు, ఘర్షణలకు దిగే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచామని, అసాంఘిక శక్తుల కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా వేడుకలు పూర్తి చేసుకునేం దుకు పోలీస్ యంత్రాంగం 24 గంటలూ అందు బాటులో ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు రౌండ్ ది క్లాక్ పెట్రోలింగ్, తనిఖీలు కొనసాగుతాయని వెల్లడించారు.

ఈ కవాతులో చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, సాయుధ బలగాలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బాలునాయక్ చొరవతో పందిరిగుండు తండాకు తాగునీరు




**నేరేడుగొమ్ము, సెప్టెంబర్ 19, (ప్రజా జ్యోతి) :** నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం పందిరిగుండు తండా గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యపై దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ వెంటనే స్పందించారు. విషయం ఎమ్మెల్యే దృష్టికి రాగానే ఇరిగేషన్ అధికారులు, మిషన్ భగీరథ అధికారులతో సమన్వయం చేసి తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు.

ఎమ్మెల్యే బాలు నాయక్ ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు పందిరిగుండు తండాకు చేరుకుని సమీపంలోని పెండ్లిపాకుల రిజర్వాయర్ నుంచి మొండి కట్టల చెరువులో ఏర్పాటు చేసిన బావిలోకి నీటిని తరలించారు. అనంతరం అక్కడి నుంచి బోర్ల సహాయంతో తండాలకు నీటిని సరఫరా చేశారు. దీంతో పందిరిగుండు తండా గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామస్తులకు తాగునీరు అందుబాటులోకి వచ్చింది.తాగునీటి సమస్యను తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే స్పందించి అధికారులను రంగంలోకి దించి సమస్యను పరిష్కరించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



**సమస్యను వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు: సర్పంచ్, గ్రామస్తులు**

పందిరిగుండు తండా సర్పంచ్, గ్రామస్తులు మీడియాతో మాట్లాడుతూ.. తమ తాగునీటి సమస్యను ఎమ్మెల్యే బాలు నాయక్ దృష్టికి రాగానే ఆయన వెంటనే స్పందించారని తెలిపారు. అధికారులను నేరుగా తమ తండాకు పంపించి తాగునీరు అందేలా చర్యలు తీసుకున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

తమ గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకు ఎమ్మెల్యే బాలు నాయక్ తక్షణమే చొరవ చూపడం అభినందనీయమని పేర్కొన్నారు. సమస్యను త్వరగా పరిష్కరించి తాగునీరు అందించిన ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**సమస్య పునరావృతం కాకుండా చర్యలు:**

**అధికారులు** సంబంధిత అధికారులు మాట్లాడుతూ.. పందిరిగుండు తండాలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఇరిగేషన్, మిషన్ భగీరథ శాఖల మధ్య సమన్వయంతో నీటి సరఫరాను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఇకపై తాగునీటి సమస్య పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. గ్రామంలో తాగునీటి సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని అధికారులు తెలిపారు.

## చెత్తను వాహనాలకు ఇవ్వండి.. కాలువల్లో వేయవద్దు

హాలియా మున్సిపల్ కమిషనర్ కే.రవీందర్ రెడ్డి

**హాలియా, సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి) :** ఇళ్లు వాణిజ్య సముదాయాల నుంచి వెలువడే చెత్తాచెదారాన్ని,వ్యర్థాలను మున్సిపల్ కాలువల్లో పడవేయకుండా మున్సిపాలిటీకి చెందిన పారిశుద్ధ్య వాహనాలకే అందించాలని హాలియా మున్సిపల్ కమిషనర్ కే.రవీందర్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.శనివారం పట్టణ పరిధిలోని పేరూరు ఎల్-1 మైనర్ కాలువ పూడికతీత పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి,పనుల పురోగతిని పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలువల్లో వ్యర్థాలు పడేయడం వల్ల నీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం కలగడమే కాకుండా పట్టణంలో పారిశుద్ధ్య లోపం ఏర్పడి ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు.ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ, మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బందికి పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన కోరారు. నిబంధనలను ఉల్లంఘించి కాలువల్లో వ్యర్థాలు చెత్త పడేసే వారిని గుర్తించి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు భారీగా జరిమానాలు విధిస్తామని కమిషనర్ హెచ్చరించారు.



### బోధన్ జిల్లా ఆసుపత్రిలో ఆర్డీవో ఎం
# విజయ కుమారి సమీక్షా సమావేశం





ప్రజాజ్యోతి బోధన్ సెప్టెంబర్ 18: బోధన్ జిల్లా ఆసుపత్రిలో శుక్రవారం ఆసుపత్రి వసతుల మెరుగుదలపై పక్షం రోజుల సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో విజయ కుమారి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వైద్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాలని ఆర్డీవో సూచించారు. ఈ సమావేశంలో బోధన్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విద్య, ఆసుపత్రుల జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్, బోధన్ తహసీల్దార్ పి.విఠల్, మున్సిపల్ అధికారులు, వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### అనారోగ్య బాధితులకు
# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) సెప్టెంబర్. 19 ఇందల్వాయి మండల కేంద్రంలోని జీకే తండా గ్రామపంచాయతీ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి ఆదేశాల మేరకు గురువారం జీకే తండాలో నిర్వహించిన కార్యక్రమంలో నలుగురు లబ్ధిదారులకు మొత్తం రూ.1.50 లక్షల విలువైన చెక్కులను గ్రామ సర్పంచ్ శిరీష మహిపాల్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు దేగావత్ సుమన్, సభావత్ ప్రవీణ్, భూక్య మోహన్, భూక్య హరిసింగ్‌కు చెక్కులు అందించారు. అనంతరం సర్పంచ్ శిరీష మహిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఇంటికి కుట్టు మిషన్, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు తదితర సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి కొందరు విమర్శలు చేయడం మానుకోవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, వీడీసీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## లింగంపేట్ మండలం నూతన ఎంపీడీవోగా ప్రవీణ్ కుమార్



లింగంపేట్ ప్రజా జ్యోతి సెప్టెంబర్ 19. లింగంపేట్ మండల నూతన ఎంపీడీవో గా డి ప్రవీణ్ కుమార్ బాధ్యతలు చేపట్టారు నాగిరెడ్డిపేట్ మండలం నుంచి బదిలీపై వచ్చినట్లు ఎంపీ ఓ మళహరి తెలిపారు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉగ్రవాయిలో ఆదర్శ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం



కామారెడ్డి టౌన్ సెప్టెంబర్ 19 ప్రజా జ్యోతి కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామంలో ఆదర్శ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు భక్తులు, గ్రామ ప్రజలకు అన్నప్రసాదాన్ని అందించారు. పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు, భక్తులు కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆదర్శ సంఘం సభ్యులు మాట్లాడుతూ.. సమాజంలో కుల, మత భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సమాన భావంతో మెలగాలనే ఉద్దేశంతో సంఘం ఆధ్వర్యంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోదరభావం, ఐకమత్యంతో గ్రామ ప్రజలంతా కలిసికట్టుగా ముందుకు సాగాలని, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలనే లక్ష్యంతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. అన్నదానం మహాదానమని, ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం ద్వారా సమాజంలో సేవాభావాన్ని పెంపొందించవచ్చని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులోనూ ఆదర్శ సంఘం ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామని వెల్లడించారు. కార్యక్రమానికి గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ అన్నదాన కార్యక్రమంలో సాయి గౌడ్, మల్ల గౌడ్, కృష్ణమూర్తి, భూమిరెడ్డి, నర్సింలు, మల్లేష్, రాజు, పందిరి అంజిరెడ్డి, దాబా శీను, యాద గౌడ్, సంజీవ్, నరేష్, తాడువా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బాలుర గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం

– చర్మవ్యాధులపై విద్యార్థులకు అవగాహన.. మందులు పంపిణీ



బీర్కూర్, సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాలలో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రాథమిక వైద్యాధికారి బాపిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల్లో కొంతమంది విద్యార్థులు చర్మ వ్యాధులతో బాధపడుతున్నట్లు గుర్తించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులు ఒకే ప్రాంగణంలో ఉండటంతో పాటు, తడి బట్టలు ధరించడం, ఒకే గదుల్లో ఎక్కువ మంది ఉండటం వంటి కారణాలతో చర్మవ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని పేర్కొన్నారు. చర్మవ్యాధులు ఉన్న విద్యార్థులకు అవసరమైన మందులు, మాత్రలను అందజేసినట్లు బాపిరెడ్డి తెలిపారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, తడి బట్టలు ధరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ గోపీచంద్, అధ్యాపకులు పాల్గొన్నారు.


### బోధన్ పట్టణంలోని 1.వార్డు అచన్పల్లిలో
## సర్ ప్రక్రియ ప్రోగ్రాంను పరిశీలించిన ఎమ్మార్వో విఠల్ కౌన్సిలర్ లక్ష్మీ రామ్మూర్తి



ప్రజాజ్యోతి బోధన్ సెప్టెంబర్ 18. బోధన్ పట్టణంలోని ఆచన్ పల్లి ఒకటో వార్డులో సర్ ప్రక్రియ ప్రోగ్రాంను పరిశీలించిన బోధన్ ఎమ్మార్వో విటల్ అలాగే వార్డు కౌన్సిలర్ లక్ష్మీ రామ్మూర్తి తమ వార్డులో ఏ ఒక్కరికి ఓటు హక్కు కోల్పోకూడదని లక్ష్మీ రామ్మూర్తి గత మూడు రోజుల నుంచి సర్ ప్రక్రియ ప్రోగ్రాం లో ఉంటూ దగ్గర ఉండి పరిశీలించడం జరుగుతుంది తమ వార్డులో మొత్తం 600 మందికి ఓటు హక్కు కల్పించాలని ఉద్దేశంతో ఆయన నిరంతరం అక్కడే ఉండి సర్ ప్రక్రియ ప్రోగ్రాంలో తమ వంతు బాధ్యత వహిస్తున్నారు కౌన్సిలర్ లక్ష్మీ రామ్మూర్తి

### పాము కాటు పై
# అవగాహనతోనే ప్రాణరక్షణ

లింగంపేట్ ,ప్రజా జ్యోతి. సెప్టెంబర్ 19 అంతర్జాతీయ పాముకాటు అవగాహన దినోత్సవం సందర్భంగా లింగంపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు వైద్యాధికారి డాక్టర్, బి.హిమబిందు మాట్లాడుతూ పాముకాటు అత్యవసర పరిస్థితి కావడంతో బాధితులను వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని సూచించారు నోటితో పీల్చడం, గాయాన్ని కోయడం, నాటు మందులు వినియోగించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.





## రెడ్డిపల్లి జెడ్పిహెచ్ఎస్ హైస్కూల్లో పోషణ మేల





నర్సాపూర్ 19 సెప్టెంబర్ (ప్రజాజ్యోతి) మండలంలోని జడ్పిహెచ్ఎస్ రెడ్డిపల్లి లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం సందర్భంగా శనివారం నాడు విద్యార్థులకు పోషణ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మ అశోక్ హాజరయ్యారు.విద్యార్థులు తయారు చేసిన వివిధ పోషకాహార వంటకాలతో ఏర్పాటు చేసిన పోషణ స్టాల్‌ను పరిశీలించి, వాటి తయారీ మరియు పోషక విలువల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గారు మరియు ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ మరియు సైన్స్ టీచర్ రాధిక మాట్లాడుతూ మన చుట్టుపక్కల, ఇంటి పరిసరాల్లో సులభంగా లభించే వివిధ రకాల ఆకుకూరలు,కూరగాయలను ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభించే ఆహార పదార్థాలను నిత్యజీవితంలో తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఆరోగ్యంగా ఉంటేనే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగగలరని సూచించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళ కుమారి మాట్లాడుతూ, పిల్లలు చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని తెలిపారు. బయట లభించే జంక్‌ఫుడ్‌కు అలవాటు పడకుండా, ఇంట్లో తాజాగా వండిన పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు.చిన్న వయస్సు నుంచే సరైన ఎదుగుదల మరియు ఆరోగ్యానికి సమతుల్య పోషకాహారం ఎంతో అవసరమని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో స్థానిక ప్రైమరీ మరియు జడ్పిహెచ్ఎస్ స్కూల్ లలో కూడా ఈ కార్యక్రమాన్ని చేయడం జరిగినదిఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.అనంతరం అందరితో పోషణ ప్రతిజ్ఞ చేయించడం జరిగినది

## దౌల్తాబాద్, బోరపట్ల గ్రామాలలో నిమర్జనా చెర్వులను సందర్శన

– భద్రత ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ ప్రత్యూష్ పంకాజ్

హత్నూర 19 సెప్టెంబర్ (ప్రజాజ్యోతి) మండల పరిధిలోని దౌల్తాబాద్ బోరుపట్ల మరియు జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జనాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు శోభాయాత్ర మార్గాల్లో రోడ్ల పరిస్థితి, మరమ్మతులు,నిమజ్జన ప్రాంతంలో బారికేడింగ్,లైటింగ్,పారిశుద్ధ్య ఏర్పాట్లపై సంభందిత అధికారులకు పలు సూచనలు తెలిపిన ఎస్పీ పారితోష్ పంకాజ్ ఐపిఎస్ సంగారెడ్డి జిల్లా సురక్ష ప్రతినిధి సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వినాయక శోభా యాత్ర, నిమజ్జనాలు శాంతియుత వాతావరణంలో జరిగేలా పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ తెలిపారు.ఈ సందర్భంగా భద్రత ఏర్పాట్ల పై అధికారులతో సమీక్షించారు. నిమార్జనాలు ప్రశాంతంగా జరిగేలా అవసరమైన లైట్స్, క్రేన్లు, జగ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. గణేష్ శోభాయాత్రలు జరిగే మార్గాల్లో రోడ్ల పరిస్థితి, అవసరమైన మరమ్మతులు, చెర్వుల వద్ద బారికేడింగ్,భద్రతా లైటింగ్, పారిశుద్ధ్య ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా భక్తులు,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారి వెంబడి హత్నూర తాసిల్దార్ షేక్ పర్వీన్,జిన్నారం సర్కిల్ ఇన్స్పెక్టర్ రమణ రెడ్డి,వివిధ శాఖలకు చెందిన అధికారులు, సర్పంచులు మాజీ సర్పంచ్లు ఎంపీటీసీలు వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.



## కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు

– సీనియర్ సివిల్ జడ్జి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కవిత దేవి






జహీరాబాద్, సెప్టెంబర్ 19( ప్రజా జ్యోతి న్యూస్) మండల లీగల్ సర్వీసెస్ కమిటీ వారి ఆధ్వర్యంలో స్థానిక కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సును సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి.కవిత దేవి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి దాసరి బ్లెస్సి నిర్వహించి విద్యార్థులకు ముఖ్యమైన అంశాల పై అవగాహన కల్పించారు. సమావేశంలో మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో ఉండాలని, చదువుపై శ్రద్ధ వహించి చక్కగా చదువుకోవాలని, పెద్దలను తోటివారిని గౌరవించాలని, చదువుతో పాటు సాధారణ చట్టాలపై అవగాహన పెంపొందించుకో వాలని అన్నారు. బాలికల పట్ల, మహిళల పట్ల ఎవరైనా అసభ్యంగా, దురుసుగా ప్రవర్తించిన వారు కఠిన శిక్షలకు లోనవుతారని తెలియ జేశారు. విద్యార్థినులకు గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఉపాధ్యా యులు మనకు దిశా నిర్దేశకులని, వారిని గౌరవించడం మన విధి అని తెలియజేసారు. ప్రతి విద్యార్థి ఒక లక్షాన్ని నిర్దేశించుకుని, ఆ లక్ష సాధనకు ఉపాధ్యాయుల సహకారం తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించా లని సూచించారు. కార్యక్రమంలో మోటార్ వాహనాల చట్టం, బాల కార్మిక నిరోధక చట్టం విద్యార్థులకు తెలియ జేసారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఇస్మాయిలప్ప, దామోదర్ రెడ్డి, అనూష, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు లీగల్ సర్వీసెస్ సిబ్బంది, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

### నర్సాపూర్ ప్రభుత్వ పాఠశాలలో
# విద్యార్థులకు యూనిఫాం షూస్ పంపిణీ



నర్సాపూర్ 19 సెప్టెంబర్ (ప్రజా జ్యోతి) స్థానిక ౹ావీ ౹ా౧=× ౹ా౧ూ (బాయ్స్) పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత స్కూల్ యూనిఫాంలు,షూస్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.విద్యార్థుల సంక్షేమం,సౌకర్యార్థం ప్రభుత్వం అందిస్తున్న ఈ సదుపాయాలను ముఖ్య అతిథులుగా విచ్చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి లక్ష్మీ రాజు యాదవ్, మండల విద్యాధికారి (వీజూా) శ్రీ తారాసింగ్, మరియు 2వ వార్డు కౌన్సిలర్ శ్రీ సుధీర్ గౌడ్ ,ప్రధానోపాధ్యాయులు సామ్య చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీ రాజు యాదవ్ మాట్లాడుతూ,ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధి,సంక్షేమం కోసం అనేక విప్లవాత్మక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. విద్యార్థులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించాలని ఆమె పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు (హెడమాస్టర్) ఎం.సామ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మెరుగైన విద్యా వాతావరణంతో పాటు క్రీడలు, సహపాఠ్య కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సకాలంలో యూనిఫాం,షూస్ అందడం పట్ల విద్యార్థులు,ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ (గ్రాణ) బి.శ్రీకాంత్ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు,సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

### రాయికోడ్‌లో 22న మండల
# సాధారణ సమీక్షా సమావేశం

రాయికోడ్ సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి): మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన మండల సాధారణ సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో షరీఫ్ తెలిపారు. మంగళవారం ఉదయం 10:30 గంటలకు ఐకేపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ సమావేశానికి మండల ప్రత్యేక అధికారి,మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో),వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.మండలంలో వివిధ శాఖల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు సమాచారం. సమావేశానికి మండలంలోని మీడియా, పత్రికా ప్రతినిధులు హాజరై సమావేశ విశేషాలను ప్రజలకు తెలియజేయాలని ఎంపీడీవో కోరారు.

### యూత్ కాంగ్రెస్‌ను
## బలోపేతం కోసం కృషి చేయాలి

యూత్ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ అంజుం బేగం



జహీరాబాద్, సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి న్యూస్) యూత్ కాంగ్రెస్‌ను గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు మరింత బలోపేతం కోసం కృషి చేసి, యువతను పెద్ద ఎత్తున సంఘటితం చేయాలని యూత్ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ అంజుం బేగం పిలుపునిచ్చారు. శనివారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం పట్టణ కేంద్రం కు వచ్చిన సందర్భంగా నాయకులు ఘనంగా సన్మానం చేశారు. యూత్ కాంగ్రెస్ బలోపేతం పై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. యువతకు పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాడిగి సర్పంచ్ హర్షద్ జామా పటేల్, యూత్ కాంగ్రెస్ జహీరాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడు నాగిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ బబ్లు నరేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ రవీందర్ చౌహాన్, మాజీ జిల్లా జనరల్ సెక్రటరీ రాజు నాయకారూ, అసెంబ్లీ టౌన్ ప్రెసిడెంట్ ధర్మరాజ, అసెంబ్లీ సెక్రటరీ మోహన్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

## శక్తి పథకం (జీవో 97) రద్దుకు డిమాండ్







**మెదక్ (ప్రజా జ్యోతి)** మొన్న అసెంబ్లీ సెషన్లో ముఖ్యమంత్రి మరియు మంత్రి వివేక్ వెంకటస్వామి పాలిటెక్నిక్ విద్యాల గురించి మల్లొకసారి అసెంబ్లీలో మాట్లాడం చేత ఈ నిరసన కార్యక్రమాలు మల్ల ఉధృతంగా కొనసాగుతున్నాయి ఇందులో భాగంగా ఈరోజు మెదక్ కలెక్టరేట్ ఎదుట నిరసన రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తి పథకానికి సంబంధించిన జీవో 97 ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులకు మద్దతుగా మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొని విద్యార్థినుల పోరాటానికి తమ పూర్తి మద్దతు తెలిపారు. పాల్గొన్న వారిలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూజీవో 97 వల్ల విద్యార్థులకు, ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తిచూపుతూ, ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## లకుడారంలో 12 సీసీ కెమెరాలు ప్రారంభం

- 'సురక్షా నేత్ర' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు




**కొండపాక, సెప్టెంబర్ 19:( ప్రజా జ్యోతి):-**'సురక్షా నేత్ర' కార్యక్రమంలో భాగంగా కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని లకుడారం గ్రామంలో ఏర్పాటు చేసిన 12 సీసీ కెమెరాలను గజ్వేల్ ఏసీపీ గారు శనివారం ప్రారంభించారు. గ్రామంలో నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయడంతో పాటు, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడనున్నాయి. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేపట్టనున్నారు. ఈ సందర్భంగా పోలీసులు గ్రామస్థులకు సీసీ కెమెరాల ప్రాధాన్యతను వివరించారు. గ్రామ భద్రత కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు.

## వార్డు మెంబర్ల ఫోరం మండల అధ్యక్షుడిగా జూపల్లి కార్తీక్ రెడ్డి



**చేర్యాల, సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి):** చేర్యాలలో సిద్ధిపేట జిల్లా వార్డు మెంబర్ల సంఘం అధ్యక్షుడు ముక్క అనిల్ ఆధ్వర్యంలో చేర్యాల మండల వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షుల ఎన్నిక శనివారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఆకునూర్ గ్రామానికి చెందిన 5వ వార్డు సభ్యుడు జూపల్లి కార్తీక్ రెడ్డి మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వార్డు మెంబర్ల సంఘం ఉపాధ్యక్షులుగా అందె లక్ష్మీ, ప్రధాన కార్యదర్శిగా బండారి సతీష్, ఉపాధ్యక్షులుగా కొలిపాక మధు, కొమిరె భవాని తదితరులు ఎన్నికయ్యారు. మండల అధ్యక్షుడిగా ఎన్నికైన జూపల్లి కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల వార్డు సభ్యులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. వార్డు సభ్యులకు ఎలాంటి సమస్య వచ్చినా వారి కోసం పోరాడతానని, వారి హక్కుల సాధనకు కృషి చేస్తానని అన్నారు. ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

## లింగంపేట పాఠశాలలో సెల్ఫీ ఛాలెంజ్

**తొగుట, సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి):** తొగుట మండలం లింగంపేట ప్రభుత్వ పాఠశాలలో వినూత్న సెల్ఫీ పాయింట్ ను సర్పంచ్ గొడుగు జయమ్మ నర్సింలు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన ప్రతి విద్యార్థి ఐదవ తరగతి



పూర్తయ్యేసరికి తెలుగు, ఆంగ్లంలో చదవడం, రాయడం అలాగే గణితంలో చతుర్విధ ప్రక్రియలు సాధించడమే లక్ష్యంగా ఎఫ్ఎల్ఎన్ ఫౌండేషన్ అఫ్ లిటరసీ న్యూమరసి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సెల్ఫీ స్టాండు వద్ద సర్పంచ్ గొడుగు జయమ్మ నర్సింలు చిన్నారులతో కలిసి సరదాగా సెల్ఫీ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ బడిలో చదివే విద్యార్థులు ప్రైవేటు తరహా లో కూడా సాటి లేరు అనే విధంగా ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడానికి గ్రామంలో ఉన్న పలువురి యువతకి, అధికారులకు, గ్రామస్తులకు సెల్ఫీ ఛాలెంజ్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అమరేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# త్వరలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు





**మెదక్ (ప్రజాజ్యోతి)** మెదక్ జిల్లా ప్రజలకు మరియు విద్యార్థులకు కలెక్టర్ ప్రతిమా సింగ్ తీపి కబురు అందించారు. జిల్లాలో నూతనంగా కేంద్రీయ విద్యాలయాన్ని (కేవీ ) ఏర్పాటు చేసేందుకు జిల్లా యంత్రాంగం వేగంగా చర్యలు చేపడుతోంది. తాత్కాలిక భవనాల గుర్తింపు: పాఠశాలను ముందుగా తాత్కాలికంగా ప్రారంభించడానికి వీలుగా అనువైన భవన సముదాయాలను వెంటనే గుర్తించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. అధికారులతో సమీక్షా సమావేశం: శనివారం సమీకృత కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో ఈ ప్రాజెక్ట్‌పై కీలక సమావేశం జరిగింది. కేంద్రీయ విద్యాలయ డిప్యూటీ కమిషనర్ సంతోష్ కుమార్ అసిస్టెంట్ కమిషనర్ ఎ.ఎ. ఇజ్రాయెల్ అదనపు కలెక్టర్ నగేష్ జడ్పీ సీఈఓ ఎల్లయ్య తదితర ముఖ్య అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా చర్చించారు. కేంద్రీయ విద్యాలయం శాశ్వత భవన నిర్మాణం కోసం ఆరు ఎకరాల స్థలాన్ని గుర్తించేందుకు చర్యలు వేగవంతం చేశారు. ఈ విద్యాలయం అందుబాటులోకి వస్తే జిల్లాలోని విద్యార్థులకు నాణ్యమైన కేంద్ర ప్రభుత్వ ప్రామాణిక విద్య లభించనుంది. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత తాత్కాలికంగా నిర్వహిస్తున్న పాఠశాలను కొత్త భవనంలోనికి తరలించేలా తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. సమావేశానికి ముందు మెదక్ పట్టణంలో కేంద్రీయ విద్యాలయాన్ని తాత్కాలిక నిర్వహించేందుకు అనువయిన భవనాల అధికారులు పరిశీలించారు విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు ఇతర మౌలిక వసతులు అందుబాటులోకి ఉన్నాయా అనే అంశాలను పరిశీలించారు కేంద్ర విద్యాలయం ఏర్పాటుతో జిల్లాలోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అవకాశాలు మరింత అందుబాటులో వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు గణాంక అధికారి నవీన్ విద్యాశాఖ సిబ్బంది సమీకృత కలెక్టర్ బృందం పాల్గొన్నారుద.

# మైనార్టీ సంక్షేమ పథకాలపై సమీక్షా సమావేశం



**మెదక్ (ప్రజాజ్యోతి)** శనివారం మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ వీడియో సమావేశ హాల్లో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు, తాసిల్దారులు మరియు మైనార్టీ సంక్షేమ అధికారులతో సమావేశం నిర్వహించారు. మెదక్ జిల్లాలో మైనార్టీలకు అమలవుతున్న పథకాలు, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, షాదీ ఖానాల వంటి వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మైనార్టీ సంక్షేమ శాఖ డైరెక్టర్ అబ్దుల్ అమీద్ మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారుల దరఖాస్తులను వేగంగా పరిష్కరించి, ఎంక్వైరీ నిర్వహించి లబ్ధి చేకూర్చాలని అధికారులను ఆదేశించారు. మైనార్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల విషయంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ముందుకు సాగాలన్నారు. జిల్లా పరిధిలోని మైనార్టీ విద్యాసంస్థలు మరియు వక్ఫ్ భూముల రక్షణకు సంబంధించిన అన్ని విషయాల్లో పురోగతి కనబడాలని స్పష్టం చేశారు. మైనార్టీ సంక్షేమ శాఖకు కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని మరియు అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని కోరారు. నిరుద్యోగ మైనార్టీ యువత, మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు సబ్సిడీ రుణాలు మరియు ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. షాదీ ఖానాల నిర్మాణం విషయంలో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి మైనార్టీ సంక్షేమ అధికారి ఉపేందర్, ఆర్డీవోలు మెదక్ రమాదేవి, తూప్రాన్ బాలయ్య, నర్సాపూర్ రామకృష్ణ మరియు సంబంధిత తాసిల్దార్లు పాల్గొన్నారు.

# శివ్వంపేటలో ఘనంగా పోషణ మేళా

- పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన ఎదుగుదల






**శివ్వంపేట ప్రజాజ్యోతి సెప్టెంబర్ 19:** పోషణ మాసం సందర్భంగా శివ్వంపేట మండలంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మేళా కార్యక్రమాలను నిర్వహించారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పోషణ మేళాకు ఎంఈఓ బుచ్చా నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల పోషకాహార వంటకాలతో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎంఈఓ పరిశీలించారు. వంటకాల తయారీ విధానం, వాటిలో ఉన్న పోషక విలువలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ బుచ్చా నాయక్ మాట్లాడుతూ.. ఇంటి పరిసరాల్లో స్థానికంగా సులభంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, ఇతర పోషకాహార పదార్థాలను నిత్య ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. తక్కువ ఖర్చుతో లభించే పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగగలరని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోష మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచే పిల్లలు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండి, ఇంట్లో తాజాగా తయారు చేసిన సమతుల్య పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థులు ఇంట్లో తీసుకునే ఆహారంతో పాటు పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజనాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో అందించే భోజనం విద్యార్థుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రాథమిక, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో కూడా పోషణ మాసం సందర్భంగా పోషణ మేళా కార్యక్రమాలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, తల్లిదండ్రులతో పోషణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జడ్.పి.హెచ్.ఎస్ హెడ్మాస్టర్ బాలు, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సూపర్వైజర్ సంతోష, అంగన్వాడి టీచర్ వినీత, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కదంబ పత్రాలతో 16 గణపతి రూపాల విశేష అలంకరణ

- శ్రీ చాకరిమెట్ల ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులను ఆకట్టుకున్న ప్రత్యేక అలంకరణ





**శివ్వంపేట ప్రజాజ్యోతి సెప్టెంబర్ 19:** శివ్వంపేట మండలం చిన్న గొట్టిముక్కుల గ్రామ పరిధిలోని శ్రీ చాకరిమెట్ల ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీ వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్ ప్రభు శర్మ ఆధ్వర్యంలో వినాయకుడి 16 రూపాలను కదంబ పత్రాలపై ఉంచి, ఆంజనేయస్వామి చుట్టూ అందంగా అమర్చి అలంకరించారు. వివిధ రూపాల్లో ఉన్న గణపతి స్వరూపాలను కదంబ పత్రాలపై ఉంచి, వాటిని క్రమబద్ధంగా ఆంజనేయస్వామి చుట్టూ ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రకృతి సిద్ధమైన ఆకులతో చేసిన ఈ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీ వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహిస్తూ భక్తిశ్రద్ధలతో వేడుకలు కొనసాగుతున్నాయి. గణపతి స్వరూపాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులు ప్రత్యేక అలంకరణను దర్శించుకుని స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. కదంబ పత్రాలతో 16 గణపతి రూపాలను ఏర్పాటు చేయడం సంప్రదాయ భక్తి, ప్రకృతి పట్ల గౌరవానికి ప్రతీకగా నిలిచిందని భక్తులు పేర్కొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ హైమావతి



**కొండపాక, సెప్టెంబర్ 19:( ప్రజా జ్యోతి):-** కొండపాక మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అటెండెన్స్ రిజిస్టర్, ఓపీ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. మెడికల్ ఆఫీసర్ నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు విధులకు సమయపాలన పాటిస్తున్నారా అనే విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ కేసుల వివరాలను ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్ల ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్‌కు సూచించారు. అలాగే ఆసుపత్రిలో అవసరమైన మందులు, వైద్య సామగ్రిని తగినంతగా నిల్వ ఉంచుకోవాలని ఆదేశించారు. ప్రతి వారం నిర్వహించే శానిటేషన్ డ్రైవ్‌లో సిబ్బంది తప్పనిసరిగా పాల్గొని, ప్రజలకు సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు.

### హవేలీ ఘనపూర్, చిన్నశంకరంపేట్‌లో
## ఘనంగా టీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ









**మెదక్ (ప్రజాజ్యోతి)** మెదక్ నియోజకవర్గంలోని హవేలీ ఘనపూర్ మరియు చిన్నశంకరంపేట్ మండల కేంద్రాల్లో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించబడ్డాయి. మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బట్టి అజయ్ గారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలోని 'పాంచజన్యం' ప్రతిజ్ఞ పార్టీ ప్రకటించిన 'పాంచజన్యం' (ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతు సంక్షేమం, యువతకు ఉపాధి, సామాజిక న్యాయం) పథకాల ఐదు ప్రధాన లక్ష్యాలను గడపగడపకూ తీసుకెళ్లి ప్రజలకు వివరిస్తామని పార్టీ శ్రేణులు ప్రతిజ్ఞ చేశారు. పార్టీ బలోపేతం కల్వకుంట్ల కవిత నాయకత్వంలో పార్టీ సిద్ధాంతాలను, సంక్షేమ ఆలోచనలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు మరియు సంస్థాగత బలోపేతానికి నిరంతరం కృషి చేస్తామని కార్యకర్తలు తెలిపారు. చిన్నశంకరంపేట్ మండల కేంద్రంలో జెండా గద్దె నిర్మాణానికి సహకరించిన కేవల్ నందకిషోర్ గారికి పార్టీ నాయకులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ నాయకులు ఇప్పా రమేశ్, టిఆర్ఎస్వి నాయకులు ఎండీ జునైద్, భాను, ప్రేమ్, మధు కార్తీక్, పిట్ల రాజశేఖర్, రాజుపేట నవీన్, ఇమ్రోజ్, రేహాన్, వైష్ణవ్ రాజ్, దినేశ్, గణేష్, అల్తాఫ్, మోయినుద్దీన్, శరన్, నాగాపూర్ నరేందర్, ఆటో యూనియన్ ప్రతినిధులు మరియు పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## గురుకులాల్లో పరిశుభ్రత పాటించాలి

- మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి:
- కలెక్టర్ హైమావతి



**కొండపాక, సెప్టెంబర్ 19:( ప్రజా జ్యోతి):-**గురుకుల పాఠశాలల్లో వంటగది, డైనింగ్ హాల్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు కామన్ డైట్ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కొండపాక మండలంలోని మహాత్మా జ్యోతి బాపూలే తెలంగాణ బీసీ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అన్నం, బెండకాయ ఫ్రై, పప్పు, సాంబారు, పెరుగు, గుడ్లను పరిశీలించి, ఆహార పదార్థాల నాణ్యత, వంటశాల పరిశుభ్రత, భోజనం తయారీ విధానంపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. భోజనం నాణ్యత బాగుందని, ప్రతిరోజూ ఇదే విధంగా నాణ్యత పాటించాలని వంట సిబ్బందికి సూచించారు. అనంతరం స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ వంట సరుకుల నిల్వలను పరిశీలించారు. నాణ్యమైన సరుకులను మాత్రమే వినియోగించాలని, సరుకుల పంపిణీని విద్యార్థుల మేస్ కమిటీ సమక్షంలో వంట సిబ్బందికి అందించాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని, పాఠశాల పరిసరాలు, వంటశాల, విద్యార్థుల సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు సమర్థవంతంగా అందేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

## వినాయకుడికి ఘనంగా ప్రత్యేక పూజలు



**మోమిన్ పేట సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి) :** మోమిన్‌పేట మండల పరిధిలోని మొరంగపల్లి గ్రామంలో హనుమాన్ మందిర్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి మన చంద్ర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఏ. చంద్రప్రియ అనిల్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఆమెకు గ్రామస్తులు, భక్తులు ఆత్మీయంగా స్వాగతం పలికారు. అనంతరం వినాయకుడికి పుష్పాలు సమర్పించి, అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వినాయకుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామంలో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని ఆమె ఆకాంక్షించారు. వినాయక చవితి సందర్భంగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏ. చంద్రప్రియ అనిల్ మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, భక్తిభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. పండుగలను అందరూ కలిసిమెలిసి జరుపుకోవాలని, యువత, మహిళలు, గ్రామ పెద్దలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు, మన చంద్ర ఫౌండేషన్ సభ్యులు, యువత తదితరులు పాల్గొని వినాయకుడి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## ప్రీ ప్రైమరీతో బలమైన పునాది

- కొత్తూరు ఎంఈఓ శ్రీ వెంకటరామిరెడ్డి
- హాజరైన మాజీ కౌన్సిలర్స్ కోస్గి శ్రీనివాస్,చంద్రకళ రాజేందర్ గౌడ్





**కొత్తూరు సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి) :** ప్రీ ప్రైమరీ విద్యతో చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది పడుతుందని కొత్తూరు ఎంఈఓ శ్రీ వెంకట రామిరెడ్డి అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ లో ఎంపీ యూపీ ఎస్ పాఠశాలలో ఏర్పాటుచేసిన ప్రీ ప్రైమరీ తరగతిగది ప్రారంభోత్సవానికి కొత్తూరు ఎంఈఓ శ్రీ వెంకటరామిరెడ్డి, మాజీ కౌన్సిలర్స్ కోస్గి శ్రీనివాస్, చంద్రకళ రాజేందర్ గౌడ్, నరసింహులు గౌడ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ,ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను ప్రారంభించనున్నట్లు విద్యార్థులు బాల్యం నుంచే మంచి విద్యను అభ్యసించాలన్నారు. చిన్నారులకు మొబైల్‌ను దూరంగా ఉంచాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్‌కు దీటుగా మెరుగైన విద్య అందిస్తున్నట్లు వారు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం దామోదర్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, కమలేష్, గౌరయ్య, చంద్రకళ, కృష్ణవేణి,దివ్య,ఆయాలు రేఖా, మంజుల,తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- కుసుమ విత్తనాలతో రైతులకు భరోసా
- ఎమ్మెల్యే కాలే యాదయ్య
- 30 క్వింటాళ్ల కుసుమ విత్తనాలు పంపిణీ





**చేవెళ్ల, సెప్టెంబర్ 19(ప్రజా జ్యోతి):** రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు సకాలంలో అందించడంతో పాటు వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. జాతీయ తినదగిన నూనెలు--నూనెగింజల మిషన్‌లో భాగంగా చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాల రైతులకు 30 క్వింటాళ్ల కుసుమ విత్తనాలను శుక్రవారం చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు.

**సాగుకు ప్రోత్సాహం.. రైతుకు భరోసా :** ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సదుపాయాలు సకాలంలో అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులు ఎదుర్కొనే సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు.

**చేవెళ్ల, శంకర్‌పల్లికి చెరో 15 క్వింటాళ్లు :** ఐఎస్ఎఫ్ -764(లక్ష్మీ ప్రియ) రకం కుసుమ విత్తనాలను రైతులకు అందించారు. చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాలకు చెరో 15 క్వింటాళ్ల చొప్పున మొత్తం 30 క్వింటాళ్లు కేటాయించారు. నూనెగింజల సాగును ప్రోత్సహించడం, సాగు విస్తీర్ణాన్ని పెంచడం, తినదగిన నూనెల ఉత్పత్తిని పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు చింపుల సత్యనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ సమత వెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గోవిందమ్మ గోపాల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, అడా సురేష్‌బాబు, వ్యవసాయ అధికారులు శంకర్ లాల్, చైతన్య చంటి, కౌన్సిలర్లు శైలజ ఆగి రెడ్డి, మద్దెల శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు చాన్ పాషా, ఫరిన్ ఖదీర్ పాషా, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు గిరిధర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, మాజీ ఎంపీటీసీ గుండాల రాములు, వీరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జనార్ధన్, పాండు యాదవ్, తంగడపల్లి సర్పంచ్ పామేన రాములు, మాజీ సర్పంచ్ కేసారం శ్రీనివాస్ యాదవ్, జాంగిర్, ఎల్లయ్య, మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ అజీజ్, మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, శ్రీ పాల్, చేవెళ్ల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కార్తీక్ రెడ్డి, మైనార్టీ నాయకుడు అబ్దుల్ గని, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై అధికారుల ప్రశంసలు







- మిట్టకోడూరులో తల్లిదండ్రుల
- ఉపాధ్యాయుల సమావేశం; పిల్లల చదువుపై నిరంతర పర్యవేక్షణ అవసరం
- ఆర్‌జేడీ సోమిరెడ్డి, డీఈఓ అబ్దుల్ ఘని



**పరిగి, సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి) :** విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని, తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై నిరంతరం శ్రద్ధ చూపాలని పాఠశాల విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్‌జేడీ) సోమిరెడ్డి సూచించారు. శనివారం పరిగి మండలంలోని మిట్టకోడూరులో నిర్వహించిన తల్లిదండ్రుల--ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

అంతకుముందు చిగురాలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా విద్యాధికారి అబ్దుల్ ఘని విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం మిట్టకోడూరులో నిర్వహించిన సమావేశంలో ఆర్‌జేడీ సోమిరెడ్డి, డీఈఓ అబ్దుల్ ఘని విద్యార్థులను స్వయంగా తెలుగు, ఆంగ్ల సబ్జెక్టుల్లో చదివించి, లెక్కలు చేయించి వారి విద్యా స్థాయిని అంచనా వేశారు. విద్యార్థుల చదువుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులు పాఠశాల లోని సైన్స్ ల్యాబ్, గ్రంథాలయం, రికార్డులను పరిశీలిం చారు. ప్రతి ఇంటిలో పిల్లల చదువుకు అనుకూలంగా రీడింగ్ కార్నర్ లేదా ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలని, హోంవర్క్‌ను తల్లిదండ్రులు క్రమం తప్పకుండా పరిశీలించాలని డీఈఓ అబ్దుల్ ఘని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎం.అంజయ్య, సర్పంచ్ పి.మాణిక్యం, ప్రధానోపాధ్యా యులు ఎం.డి. ఉస్మాన్ అలీ, బుద్ధదేవ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ అనితారాణి, ఉపసర్పంచ్ మల్లేశం, ఉపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు
# అందుబాటులోకి తేవడం అభినందనీయం

- పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం ప్రశంసనీయం
- మాజీ మంత్రివర్యులు డాక్టర్ ఏ. చంద్రశేఖర్





**మోమిన్‌పేట్ సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి) :** గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని మాజీ మంత్రివర్యులు డాక్టర్ ఏ. చంద్రశేఖర్ అన్నారు. మోమిన్ పేట మండల పరిధిలోని మొరంగపల్లి గ్రామంలో మన చంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రో హెల్త్ హాస్పిటల్ మణికొండ వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అనేక మంది ఆర్థిక ఇబ్బందుల కారణంగా అనారోగ్య సమస్యలకు సకాలంలో వైద్యం చేయించుకో లేకపోతున్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి ప్రజలకు వైద్య పరీక్షలు, మందులు అందించడం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం సేవా కార్యక్రమాలను చేపడుతున్న మన చంద్ర ఫౌండేషన్‌ను ఆయన అభినందించారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కేవలం పట్టణ ప్రాంతాలకే వైద్య సేవలు పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా నాణ్యమైన వైద్యం అందేలా సేవా సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచే ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు.

మన చంద్ర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఏ. చంద్రప్రియ పుట్టినరోజు సందర్భంగా గ్రామంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 500 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. మహిళలు, వృద్ధులు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొత్తపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల గంగమ్మ ఒడిలోకి గణనాథుడు







గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజన్న

**చౌడాపూర్ మండల్ (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 19 :** వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామ చెరువులో ఐదు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథుని నిమజ్జన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. హిందూ సాంప్రదాయాల ప్రకారం గ్రామస్థులు, యువకులు ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాథునికి భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ. వినాయక చవితి సందర్భంగా గ్రామంలో భక్తి, ఆధ్యాత్మిక భావన పెంపొం దించాలనే ఉద్దేశంతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. గ్రామ ప్రజలకు సుఖసంతోషాలు, ఆరోగ్యం, శాంతి ప్రసాదిం చాలని గణనాథుని ప్రార్థించినట్లు చెప్పారు. వినాయక నిమజ్జనం సంద ర్భంగా గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గణనాథుని లడ్డూ కోసం భక్తుల మధ్య ఉత్సాహభరితమైన పోటీ నెలకొంది. యువకులు, మహిళలు, చిన్నారులు భక్తి గీతాలు,నృత్యాలతో సందడి చేశారు. అనంతరం గణనాథుని విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి కొత్తపల్లి గ్రామ చెరువులో నిమజ్జనం చేశారు. భక్తిశ్రద్ధలతో నిమజ్జనం ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ..గణనాథుని ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని,గ్రామంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాంతి నెలకొనాలని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తులు క్రమశిక్షణతో నిమజ్జన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామస్థులు,యువకులు,మహిళలు,చిన్నారులు కలిసి గణనాథుని విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా తీసుకెళ్లి కొత్తపల్లి గ్రామ చెరువులో నిమజ్జనం చేశారు. గంగమ్మ ఒడిలోకి గణనాథుడు చేరిన వేళ భక్తులు జై బోలో గణేశ్ మహారాజ్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమం మొత్తం విద్యార్థులు భక్తి,ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుల బృందం పాఠశాల సిబ్బంది విద్యార్థులతో పాటు కలిసి గణనాథుని నిమజ్జనం ఘనంగా నిర్వహించారు.

## శంషాబాద్ మండలం పాలమాకులలో
# ఘోర రోడ్డు ప్రమాదం


- డివైడర్ను ఢీకొన్న ఇన్నోవా కారు,నలుగురు మృతి ఒకరికి తీవ్ర గాయాలు
- గణేష్ నిమర్జనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఘటన
- మృతులు మహబూబ్ నగర్ జిల్లా మెట్టుగడ్డ తాండకు చెందిన వారిగా గుర్తింపు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న శంషాబాద్ పోలీసులు











**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి) :** గణేశ్ నిమజ్జనానికి వెళ్లి తిరిగి వస్తుండగా తీవ్ర విషాదం చోటు చేసుకుంది. కారు అదుపుతప్పి ప్రమాదానికి గురై నలుగురు అక్కడికక్కడే మృతిచెందగా డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డ ఈ ఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి లోని పాలమాకుల వద్ద జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబ్నగర్ జిల్లా నవాబ్ పేట మండలం మెట్టుగడ్డ తండాకు చెందిన కుటుంబ సభ్యులు రంగారెడ్డి జిల్లా శంషాబాద్ కు గత కొన్ని సంవత్సరాలు క్రితం బతుకుదెరువు కొరకు వచ్చి శంషాబాద్ లో స్థిరపడ్డారు. గణేశ్ నిమజ్జనం కొరకు శుక్రవారం సాయంత్రం తన ఇనోవా (టూ 07 + 9333) కారులో సొంత గ్రామమైన మెట్టుగడ్డ తండాకు వెళ్లి నిమజ్జనం అనంతరం తిరిగి శు క్రవారం రాత్రి కారులో శంషాబాద్ కు బయలుదేరగా పాలమాకుల వద్ద వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతులు కేతావత్ లింబ్యా (54), ఆయన భార్య జమున (45), కత్రావత్ మాన్సింగ్ (48), కేతావత్ వస్రాం(45)గా పోలీసులు గుర్తించారు. డ్రైవర్ సబావత్ అశోక్ తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం శంషాబాద్ లోని ట్రైడెంట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శంషాబాద్ సిఐ సురేందర్‌రెడ్డి తెలిపారు.

## నేడు ఈ రెండు సబ్ స్టేషన్‌లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ధారూర్, సెప్టెంబర్ 19(ప్రజా జ్యోతి):** ధారూర్, మున్నూరు సోమారం సబ్ స్టేషన్ లలో 33 కెవి లైన్ అత్యవసర పనుల నిమిత్తంలో భాగంగా ఆదివారం విద్యుత్ సరఫరా లో అంతరాయం ఏర్పడునుందని మండల ట్రాన్స్ కో ఏఈ వేణుగోపాల్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 నుంచి 2:30 వరకు ఈ నాలుగు గంటల పాటు విద్యుత్ నిలిపివేయనున్నాని అన్నారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల విద్యుత్ వియోగదారులు, రైతులు శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

## ఆరోగ్య సంరక్షణలో నర్సుల పాత్ర కీలకం

- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు
- ఎండిఎస్ నర్సింగ్ కాలేజీలో ఐదో బ్యాచ్ స్నాతకోత్సవం




**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి) :** గ్రామీణ, వెనుకబడిన వర్గాల ఆరోగ్య సంరక్షణలో నర్సుల పాత్ర కీలకమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) కె.కేశవరావు అన్నారు. శనివారం ఎండిఎస్, బన్సిలాల్ మలానీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఐదవ బ్యాచ్ బి.ఎస్సీ నర్సింగ్ స్నాతకోత్సవాన్ని నిర్వహించింది. ఈ బ్యాచ్‌లో 50 మంది విద్యార్థులు పట్టభద్రులయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన కేశవరావు మాట్లాడుతూ నర్సింగ్ అనేది కరుణ, ధైర్యం, సేవతో కూడిన వృత్తి అని పేర్కొన్నారు. మహిళా దక్షతా సమితి అధ్యక్షురాలు సరోజ్ బజాజ్ మాట్లాడుతూ నర్సింగ్ విద్యను మరింత బలోపేతం చేసేందుకు త్వరలో ఎం.ఎస్సీ నర్సింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. గౌరవ అతిథులుగా కిమ్స్ హాస్పిటల్స్ జీఐ, హెచ్‌పిబి సర్జరీ సీనియర్ కన్సల్టెంట్, అకడమిక్ డైరెక్టర్ ప్రొ.డా. ఆర్.ఎ.శాస్త్రి, యశోద హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ ఆంకాలజిస్ట్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ సచిన్ మర్దా పాల్గొన్నారు.


## ఛాతీలోకి విస్తరించిన భారీ థైరాయిడ్ కణితి తొలగింపు



**హైదరాబాద్, సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి) :** సూడాన్‌కు చెందిన 37 ఏళ్ల మహిళకు కేర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీ వైద్యులు క్లిష్టమైన థైరాయిడ్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు కేర్ హాస్పిటల్స్, హైటెక్ సిటీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ప్రమోద్ గుప్తా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 15ఐ10 సెం.మీ. పరిమాణంలో పెరిగిన థైరాయిడ్ ఛాతీలోని మీడియాస్టినమ్ వరకు విస్తరించడంతో పాటు, ఏడేళ్ల క్రితం అదే ప్రాంతంలో శస్త్రచికిత్స జరగడం సవాలుగా మారిందన్నారు. కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రాహుల్ రెడ్డి లేవాక నేతృత్వంలో డాక్టర్ అజయ్ చాణక్య, డాక్టర్ రాము దాములూరిల బృందం జనరల్ అనస్థీషియాలో టోటల్ థైరాయిడెక్టమీ నిర్వహించిందని తెలిపారు. ఛాతీలోకి విస్తరించిన భాగాన్ని వీడియో అసిస్టెడ్ థొరాకోస్కోపిక్ సర్జరీ(వీఏటీఎస్) విధానంలో తొలగించారు. రోగి కోలుకోవడంతో డిశ్చార్జ్ చేసినట్లు చెప్పారు.

## అత్తాపూర్ ఇస్కాన్ ఆలయంలో ఘనంగా రాధాష్టమి వేడుకలు

- ఇస్కాన్ ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హారతులు
- భక్తులతో కిటకిటలాడిన అత్తాపూర్ ఇస్కాన్ ఆలయం



**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి) :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని రాజేంద్రనగర్ జోన్ అత్తాపూర్‌లోని ఇస్కాన్ ఆలయంలో శనివారం రాధాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

రాధారాణి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు.

ఉదయం మంగళహారతితో ప్రారంభమైన వేడుకల్లో గురుపూజ, శృంగార దర్శన హారతి, రాధారాణి లీలలపై ప్రత్యేక ప్రవచనం నిర్వహించారు. అనంతరం ఉదయం 11 గంటలకు మహా అభిషేకం చేపట్టారు. మధ్యాహ్నం రాజ భోగ హారతి అనంతరం భక్తులకు మహాప్రసాదం పంపిణీ చేశారు. రాధాష్టమి వేడుకలకు సుమారు 10 వేల మంది భక్తులు, సందర్శకులు హాజరయ్యేలా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులకు మహాప్రసాదం అందించేలా ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



# నోటీసులు జారీ అయిన ఓటర్లు హియరింగ్‌కు హాజరుకావాలి

– 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో తీసుకురావాలి: – జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ముస్తాబాద్, సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి) :** ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా నోటీసులు జారీ అయిన ఓటర్లు హియరింగ్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. హియరింగ్‌కు హాజరయ్యే సమయంలో ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదానితో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను తీసుకురావాలని తెలిపారు.

ముస్తాబాద్ మండలం చీకోడులో మంగళవారం ఎస్ఐఆర్‌లో భాగంగా నిర్వహించిన హియరింగ్ సమావేశానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై, ఓటర్లకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో నో మ్యాపింగ్ ఓటర్లు, అనామలీస్ ఓటర్లు ఎంతమంది ఉన్నారు, కొత్త ఓటర్లుగా ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారనే వివరాలను ఆమె ఆరా తీశారు. మండల పరిధిలో మొత్తం 7,005 మంది నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదాన్ని తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో హియరింగ్ సమావేశాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) తమ పరిధిలో నోటీసులు అందుకున్న ఓటర్లకు సమాచారం అందించి, వారు హియరింగ్‌కు హాజరయ్యేలా చూడాలని సూచించారు. తహసీల్దార్లు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు అన్ని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఎస్ఐఆర్ ప్రక్రియను పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మన ఆంజనేయులు, ఆర్డీవో శ్రీధర్ బాబు, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీవో లచ్చాలు తదితరులు పాల్గొన్నారు.

## ముస్తాబాద్‌లో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం

– కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి: మల్లారపు సంతోష్ రెడ్డి



**ముస్తాబాద్, సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి) :** భారతీయ జనతా పార్టీ ముస్తాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కార్యాలయంలో మండల కార్యవర్గ సమావేశాన్ని మండల అధ్యక్షుడు సొల్లా క్రాంతికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామీణ స్థాయిలో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యకర్తలే పార్టీకి ప్రాణమని, రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామ స్థాయిలో పార్టీ కమిటీలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. 'వికసిత్ భారత్ సంకల్పం'లో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందించడంతో పాటు అవసరమైన సందర్భాల్లో ప్రజల పక్షాన పోరాటాలు చేపట్టాలని తీర్మానించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు శీలం రాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ మెరుగు అంజాగౌడ్, మాజీ అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఎదునూరి గోపికృష్ణ, మండల ఉపాధ్యక్షులు చికోటి మహేష్, చిట్టినేని శ్రీనివాస్ రావు, మెంగని మహేందర్, వరి వెంకటేష్, చిగురు వెంకన్న, మీస స్వామి, దీటి సత్తయ్య, ఒరగంటి సత్యం, మర్గల వేణు, మీస కర్ణాకర్, మల్లేశం, యాదగిరి, నర్సింలు, తిరుపతి, వినయ్‌తో పాటు బూత్ కమిటీ అధ్యక్షులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై గళమెత్తితే అరెస్టులా?

– ప్రతిపక్ష గొంతును నొక్కే కుట్రలు సాగవు
– కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ నేత సంపత్‌రావు ఫైర్




**కరీంనగర్ క్రైం, సెప్టెంబర్ 08 (ప్రజాజ్యోతి) :** ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూ ప్రజల తరపున గళమెత్తుతున్న బీఆర్ఎస్ నాయకులను అర్ధరాత్రి,తెల్లవారి జామున వేళ పోలీసులు అదుపులోకి తీసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత,నిరంకుశ వైఖరికి నిదర్శనమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సుంకిశాల సంపత్‌రావు తీవ్రంగా మండిపడ్డారు.కరీంనగర్ రూరల్ మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ ముఖ్య నాయకులు సంపత్‌రావు,పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి,ఇరుకుళ్ల సర్పంచ్ బుర్ర రమేష్‌గౌడ్,తహేర్ కొండాపూర్ సర్పంచ్ గిరి,దుర్శెడ్ సింగిల్‌విండో చైర్మన్ తోట తిరుపతి,గాదె శ్రీనివాస్,బాల్‌రాజు,తిరుపతి, కుమార్‌లను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకుని కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా సంపత్‌రావు మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం,వాటిని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కేందుకు పోలీసులను ఉపయోగించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు.ప్రజల సమస్యలను ప్రస్తావిస్తే కేసులు,అరెస్టులు,నిర్బంధాలతో భయపెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు.ప్రశ్నించే గొంతును అరెస్టు చేయగలరేమో కానీ ప్రజల ఆకాంక్షలను అరెస్టు చేయలేరని పేర్కొన్నారు.ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్న ప్రతిపక్ష నాయకులపై ఒత్తిళ్లు, బెదిరింపులు,పోలీసు చర్యలతో ప్రజా ఉద్యమాలను అణచివేయడం సాధ్యం కాదన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని,రాబోయే రోజుల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు.ప్రజా సమస్యలపై ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికీ, ప్రతిపక్ష నాయకుడికీ ఉందని పేర్కొన్నారు,అదుపులోకి తీసుకున్న బీఆర్ఎస్ నాయకులందరినీ ఎలాంటి షరతులు లేకుండా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత వైఖరికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని, ప్రభుత్వంపై మరింత తీవ్రస్థాయిలో పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

# స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై వ్యాఖ్యల ఖండన

మల్యాలలో నిరసన కార్యక్రమాలు నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు





**మల్యాల, సెప్టెంబర్ 8, ప్రజా జ్యోతి :** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్సీ తాత మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను మల్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు స్థానిక అంబేద్కర్ విగ్రహానికి విజ్ఞాపన పత్రం సమర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ తాత మధు దిష్టిబొమ్మ దహనం చేసి తనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... దళిత వర్గానికి చెందిన వ్యక్తి అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉండటం జీర్ణించుకోలేకనే ప్రత్యర్థులు అవమానకర వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. దళిత సీఎం, మూడెకరాల భూమి, దళిత బంధు హామీలను నెరవేర్చడంలో బీఆర్ఎస్ విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం భట్టి విక్రమార్కను డిప్యూటీ సీఎంగా, గడ్డం ప్రసాద్‌ను స్పీకర్‌గా చేసి దళితులకు సముచిత స్థానం కల్పించిందని, ఎస్సీ వర్గీకరణకు కూడా శ్రీకారం చుట్టిందని తెలిపారు. బీఆర్ఎస్‌లోని దళిత నాయకులు ఆత్మగౌరవం కోసం గళమెత్తాలని, దళితులపై అవమానాలను కాంగ్రెస్ సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రతి రైతు ఫారంపాండ్ నిర్మించుకోవాలి

– సర్పంచ్ బొమ్మెన ప్రశాంత్ – ఒడ్యాడ్ గ్రామంలో ఫారంపాండ్ నిర్మాణ పనులకు శ్రీకారం



**భీమారం, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి):** వర్షపు నీటిని ఒడిసిపట్టి వ్యవసాయానికి వినియోగించుకునేలా ప్రతి రైతు తమ పొలాల్లో ఫారంపాండ్ నిర్మించుకోవాలని ఒడ్యాడ్ గ్రామ సర్పంచ్ బొమ్మెన ప్రశాంత్ సూచించారు. నీటి సంరక్షణతో పాటు భూగర్భ జలాల పెంపునకు ఫారంపాండ్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. గ్రామానికి చెందిన పుట్ట రాజేందర్ తోటలో ఫారంపాండ్ నిర్మాణ పనులను సర్పంచ్ బొమ్మెన ప్రశాంత్ ప్రారంభించారు. వర్షాకాలంలో పొలాల్లోకి వచ్చే నీటిని ఫారం పాండ్‌లో నిల్వ చేసుకోవడం ద్వారా పంటలకు అవసరమైన సమయంలో నీటిని వినియోగించుకోవచ్చన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకుని ఫారంపాండ్లు నిర్మించుకోవాలని కోరారు. నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, నేటి నీటి నిల్వే రేపటి సాగుకు భరోసా అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమ్య, ఫీల్డ్ అసిస్టెంట్ శైలజ, కారోబర్ గంగానర్సయ్య, ఉపాధి హామీ కూలీలు, రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# డిజిటల్ క్రాప్ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలి

– జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి
– రైతులు సాగు చేసిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా నమోదు చేయాలి
– సేంద్రియ, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి
– వ్యవసాయ శాఖ పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, సెప్టెంబర్ 08 ప్రజా జ్యోతి :** డిజిటల్ క్రాప్ సర్వేను ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి పరిధిలో పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. వ్యవసాయ శాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. డిజిటల్ క్రాప్ సర్వే, యూరియా సరఫరా, సేంద్రియ వ్యవసాయం, పంటల సాగు విస్తీర్ణం, రైతులకు అందుతున్న వ్యవసాయ సేవలు తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి తమ పరిధిలో సేంద్రియ వ్యవసాయం పెరిగే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించి, ఆసక్తి ఉన్న రైతులను ప్రోత్సహించాలని అన్నారు. డిజిటల్ క్రాప్ సర్వేను పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి రైతు ఏ పంటను ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. డిజిటల్ క్రాప్ సర్వేలో ఎలాంటి తప్పులు, పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. పంటల సాగు పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తూ నీటి లభ్యత, నేల స్వభావం, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. ఒకే పంటపై ఆధారపడకుండా రైతులకు లాభదాయకమైన పంటలపై వ్యవసాయ అధికా రులు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తమ పరిధిలోని రైతులతో నిరంతరం అందుబాటులో ఉంటూ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, పంటల యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణ తదితర అంశాలపై సాంకేతిక సూచనలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, రైతులకు అందుతున్న సేవల అమలును మండలాల వారీగా నిరంతరం పర్యవేక్షించాలని, లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ రంగ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, సంబంధిత మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుతో

# రైతుకు రూ.3.45 లక్షల ఆదాయం



**ముస్తాబాద్, సెప్టెంబర్ 7 (ప్రజా జ్యోతి) :** నామాపూర్‌లో ఏడు ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు 15 టన్నుల దిగుబడి సాధించిన రైతు అరవెల్లి చంద్రశేఖర్ రావు ఆదర్శ రైతు క్షేత్రాన్ని పరిశీలించి అభినందించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామంలో ముస్తాబాద్‌కు చెందిన రైతు అరవెల్లి చంద్రశేఖర్ రావు ఆయిల్ పామ్ సాగులో మంచి దిగుబడి సాధించి ఆదర్శంగా నిలిచారు. సుమారు నాలుగేళ్ల క్రితం ఏడు ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటి, శాస్త్రీయ పద్ధతుల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో ప్రస్తుతం 15 టన్నుల దిగుబడి సాధించి రూ.3.45 లక్షల ఆదాయం పొందారు. ప్రస్తుతం మరో రెండు ఎకరాల్లో మామిడి, నిమ్మ తోటలను సాగు చేస్తున్నారు. ఈ సందర్భంగా రైతు అరవెల్లి చంద్రశేఖర్ రావు వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం సందర్శించి పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఆయిల్ పామ్ మొక్కల పెరుగుదల, దిగుబడి తదితర అంశాలను పరిశీలించిన కలెక్టర్.. తదుపరి పంట ఎప్పుడు చేతికి వస్తుందని రైతును అడిగి తెలుసుకున్నారు.

ఆయిల్ పామ్‌ను ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారు, మొక్కలను ఎక్కడి నుంచి తీసుకున్నారు, డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం, సస్యరక్షణ చర్యలు, పెట్టుబడి, దిగుబడి, ఆదాయం తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మంచి దిగుబడి సాధిస్తున్న రైతును అభినందించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రైతులు దీర్ఘకాలికంగా ఆదాయం సమకూర్చే ఆయిల్ పామ్ సాగు వైపు దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ఆయిల్ పామ్ మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటిన తొలి మూడు సంవత్సరాల్లో ఉద్యానవన శాఖ అధికారుల సూచనల మేరకు అంతర పంటలుగా కూరగాయలు, పూలు, పండ్ల మొక్కలు సాగు చేసుకుని అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఆయిల్ పామ్ సాగులో కోతుల బెడదతో పాటు చీడపీడల సమస్యలు తక్కువగా ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం టన్ను ఆయిల్ పామ్ ధర రూ.24,025గా ఉందని తెలిపారు. జిల్లాలో నామాపూర్, బోయినపల్లి, నేరెళ్ల, సిరిసిల్ల ప్రాంతాల్లో ఆయిల్ పామ్ కలెక్షన్ కేంద్రాలు ఉన్నాయని వెల్లడించారు. ఇక్కడ సేకరించిన ఆయిల్ పామ్ ఉత్పత్తులను సిద్దిపేట జిల్లాలోని నర్మెట్ట వద్ద ఉన్న ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి తరలిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మరింత మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేసేందుకు ముందుకు వస్తే అవసరాన్ని బట్టి మరిన్ని ఆయిల్ పామ్ కలెక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని కలెక్టర్ వివరించారు. అనేక ప్రయోజనాలు, దీర్ఘకాలిక ఆదాయం ఉన్న ఆయిల్ పామ్ సాగు వైపు రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నామాపూర్‌కు చెందిన రైతు ఆయిల్ పామ్‌తో పాటు ప్రస్తుతం మామిడి, నిమ్మ తోటలను సాగు చేస్తున్నారని, తద్వారా భవిష్యత్తులో మరింత ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, ఏడీఏ ప్రదీప్, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీఓ లచ్చాలు తదితరులు పాల్గొన్నారు.

## బీర్‌పూర్ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయ నూతన ఈఓగా డి.కిరణ్ బాధ్యతల స్వీకరణ




**బీర్‌పూర్, సెప్టెంబర్ 8 (ప్రజాజ్యోతి) :** బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయ నూతన పూర్తిస్థాయి కార్యనిర్వాహణాధికారిగా డి. కిరణ్ మంగళవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ దేవాదాయ శాఖ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఈ నియామకం జరిగింది. ఇప్పటివరకు జగిత్యాల జిల్లా నల్లగొండ దేవాలయం ఈఓగా విధులు నిర్వహిస్తున్న డి. కిరణ్‌ను, బీర్‌పూర్ ఆలయ పూర్తిస్థాయి ఈఓగా బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల మేరకు మంగళవారం ఉదయం ఆలయ కార్యాలయంలో ప్రస్తుత ఈఓ ఎస్. శ్రీనివాస్ నుంచి ఆయన అధికారికంగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని నూతన ఈఓ కిరణ్‌కు ఘనంగా స్వాగతం పలికారు.

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్



**మల్యాల, సెప్టెంబర్ 08, ప్రజా జ్యోతి :** కొండగట్టు ఆంజనేయ స్వామిని హైడ్రా కమిషనర్ ఐపీఎస్ రంగనాథ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. కొండగట్టు ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.... హైడ్రా యొక్క ముఖ్య ఉద్దేశాన్ని ప్రజలు అర్థం చేసుకుంటున్నారని, కబ్జాలకు గురి అయిన దాదాపుగా 1.50 లక్షల కోట్ల భూములను కాపాడి ప్రభుత్వానికి అప్పగించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ భూములు,చెరువులు, కుంటల కబ్జాలు తగ్గాయని,అక్రమ కట్టడాలను కూల్చివేయడంతో అక్రమ కట్టడాలు ఆగాయి అని అన్నారు. హైదరాబాదులోని మూడు నియోజకవర్గాల వరకు విస్తరించి ఉన్న హైడ్రా కార్యకలాపాలను ప్రభుత్వం ఆమోదిస్తే రాష్ట్రవ్యాప్తంగా విస్తరింప చేస్తామన్నారు.హైడ్రాపై వచ్చిన దుష్ప్రచారాలను ప్రజలు నమ్మకుండా స్వచ్ఛందంగా ర్యాలీలు నిర్వహించి హైడ్రాకు మద్దతు తెలుపుతున్నారని ఆయన తెలిపారు.

## రైతు గుర్తింపు కార్డు నమోదు చేసుకోండి




**ఎండపల్లి, సెప్టెంబర్ 8, ప్రజా జ్యోతి :** మండలంలో రైతు గుర్తింపు కార్డు (ఫార్మర్ ఐడీ) నమోదు కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి కమల్ల మహేష్ ఆదేశాల మేరకు గుల్లకోట ఏఈఓ లావణ్య, కొత్తపేట ఏఈఓ మౌనిక, గోడిసెల పేట ఏఈఓ సందీప్ వారి వారి క్లస్టర్ల పరిధిలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రైతులు తప్పనిసరిగా ఫార్మర్ ఐడీ నమోదు చేసుకోవాలని,అంతర్జాల సమూహ వేదికగా ఒక ప్రకటనలో పేర్కొంటూ,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే వివిధ రైతు సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఇది అవసరమని తెలిపారు. పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందడంతో పాటు ఎరువులను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేందుకు కూడా రైతు గుర్తింపు కార్డు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు నమోదు చేసుకోని రైతులు సమీపంలోని రైతువేదికకు వెళ్లి సంబంధిత ఏఈవోలను సంప్రదించాలని సూచించారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, సందీప్, లావణ్య, మౌనిక , రైతులు పాల్గొన్నారు,

# దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ ఎస్సీ సెల్



**ముస్తాబాద్, సెప్టెంబర్ 8 (ప్రజా జ్యోతి) :** ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాతా మధు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, ఆయనను ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు, దళితుల ఆత్మగౌరవానికి అవమానకరమని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య కార్యకర్తలకు ప్రజాస్వామ్య విలువలు, సభా సంప్రదాయాలపై శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. దళితుల సంక్షేమం విషయంలో గత ప్రభుత్వ హామీలపై కూడా నాయకులు ప్రశ్నలు సంధించారు. దళితులకు మూడు ఎకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళిత బంధు వంటి హామీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దళితుల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొంపెల్లి శ్రీనివాస్, యారటి కరుణాకర్, జగ్గు నరేష్, బిళ్లం సామి, దుబ్బాక రాజు, సదుమల బాలయ్య, గంతరాజు నాగరాజు, మండల మహిళా అధ్యక్షురాలు వనిత, నల్ల బుచ్చయ్య, తలారి నరసయ్య, మచ్చ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# సతీష్‌కు అధికార లాంఛనాలతో దహన సంస్కారాలు



కారేపల్లి, సెప్టెంబర్ 19, ప్రజా జ్యోతి: సింగరేణి మండల పరిధిలోని శాంతి నగరం గ్రామానికి చెందిన హనుమకొండ సతీష్ (40) ఏఆర్ ఆర్ ఐ గా నిజాంబాద్ లో విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం విధి నిర్వహణలో భాగంగా తన రైఫిల్ను శుభ్రపరిచే క్రమంలో మిస్ ఫైర్ అయి సతీష్ కి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం తన స్వగ్రామమైన సీతారాంపురం గ్రామపంచాయతీ పరిధిలోని శాంతి నగరం గ్రామంలో దహన సంస్కారాలు అధికార లాంచనాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏ ఆర్ ఏ సి పి బి. కృష్ణ, ఏ ఆర్ ఆర్ ఐ అడ్మిన్ డి. హరికుమార్ ఆర్ఐలు ఆర్ఎస్ఐలు తదితరులు దహన సంస్కారం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపి,ఆర్ ఐ ల చేతు మీదుగా మృతుని కుటుంబ సభ్యులకు 30 వేల రూపాయల చెక్కును ఖర్చుల నిమిత్తం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజేష్ విధి నిర్వహణలో నియమ నిబంధనలకు కట్టుబడి పని చేస్తాడు, అతని సేవలను మా డిపార్ట్మెంట్ ఎప్పటికీ మర్చిపోదు. ప్రభుత్వం తరపున రావాల్సిన లావాదేవిలను త్వరగా పూర్తి చేసి ఆయన కుటుంబ సభ్యులకు అందిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు హనుమకొండ వెంకటేశ్వర్లు, తాటిపాముల సురేష్, ఇతర పోలీస్ సిబ్బంది, పెద్ద బోయిన ఉమాశంకర్,అడపా పుల్లారావు, హనుమకొండ రమేష్, గుడిపూడి తిరుమలరావు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మృతునికి భార్య కళ్యాణి, కూతురు చర్విక (14), కుమారుడు ప్రహన్ చౌర్య (11) కలరు.

# జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్య చేపట్టాలి

★ వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్లు, ఇంటి స్థలాలు కల్పించాలి

★ హెల్త్‌కార్డులతో కుటుంబాలకు ఆరోగ్య భద్రత కల్పించాలి

★ జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి – త్వరలో ప్రెస్‌క్లబ్ వార్షికోత్సవం

★ సమావేశంలో అధ్యక్షుడు పాసలాది సత్యనారాయణ డిమాండ్



తిరుమలాయపాలెం, ప్రజా జ్యోతి సెప్టెంబర్ 19: జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని తిరుమలాయపాలెం మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పాసలాది సత్యనారాయణ డిమాండ్ చేశారు. తిరుమలాయపాలెం మండల ప్రెస్‌క్లబ్ వార్షికోత్సవం త్వరలో జరగనున్న నేపథ్యంలో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పసలాది సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ నిత్యం విధులు నిర్వహిస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్లు, ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు హెల్త్‌కార్డులు అందించాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు వృత్తిపరంగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. సమాజంలో జరుగుతున్న ప్రతి అంశాన్ని ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని పాసలాది సత్యనారాయణ పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఐక్యంగా కృషి చేస్తామని తెలిపారు. త్వరలో జరగనున్న ప్రెస్‌క్లబ్ వార్షికోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో,ప్రధాన కార్యదర్శి పప్పుల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు,కూరపాటి విజయ్, పోలేపొంగు నాగరాజు, గోవింద సురేష్, ట్రెజరర్ ఉబ్బని సుందర్‌రావు, ప్రచార కార్యదర్శి గుజ్జ రామకృష్ణ, గౌరవ సలహాదారులు మేకల నాగరాజు,పాకాలిశెట్టి వేణు, యడవల్లి నాగరాజు, సభ్యులు, గాదారి బాబు, గాదారి వెంకన్న, కామల్ల వీరయ్య, మెట్టు రుద్రరాజు, పుల్లూరి ప్రభాకర్, ఏలూరి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్ష

★ మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం

★ ఏక్ పేడ్ మా కే నామ్ 3.0 కార్యక్రమంలో మొక్కల నాటిన చైర్ పర్సన్

★ అమ్మ కోసం మొక్కలు నాటి... వాటిని కంటికి రెప్పలా కాపాడుకుందాం: విద్యార్థులకు పిలుపు



మధిర ప్రజా జ్యోతి: పచ్చదనం, పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమని మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఏక్ పేడ్ మా కే నామ్ (తల్లి పేరిట ఒక మొక్క) 3.0 కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మరియు ఇల్లందులపాడు ప్రాథమిక పాఠశాల ప్రాంగణాలలో ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుజాత రామనాథం మాట్లాడుతూ,అమ్మను ఏ విధంగా అయితే ప్రేమగా,కష్టపడి పెంచుకుంటామో...అదే రీతిలో మనం నాటే ప్రతి మొక్కనూ పిల్లలా భావించి సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితులను తట్టుకోవడానికి,భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అందించడానికి మొక్కల పెంపకమే ఏకైక మార్గమని ఆమె పిలుపునిచ్చారు.విద్యార్థి దశ నుంచే పర్యావరణంపై ప్రేమ,మొక్కల పట్ల శ్రద్ధ అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సూర్యదేవర కోటేశ్వరరావు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇనుపనూరి సంధ్యారాణి బొగ్గుల శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ నాయకులు కోట డేవిడ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తిప్పాపురంలో వైద్య శిబిరం






చర్ల, సెప్టెంబర్ 19 :(ప్రజా జ్యోతి): చర్ల మండలంలోని తిప్పాపురం గ్రామంలో డాక్టర్ సందీప్ ఆదేశాలతో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. 30 ఏళ్లు పైబడిన వారికి రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించారు.సాధారణ దగ్గు, జలుబుతో బాధపడుతున్న వారికి అవసరమైన మందులు అందజేశారు. జ్వరం ఉన్న వారికి ర్యాపిడ్ డయాగ్నస్టిక్ టెస్ట్ (ఆర్ డి టి ) నిర్వహించి, రక్త నమూనాలు సేకరించి మందులు అందించారు. శిబిరంలో ముగ్గురికి జ్వరం ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 68 మంది వైద్య సేవలు పొందారు.ఈ సందర్భగా కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వైద్య సిబ్బంది గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏం ఎల్ హెచ్ పీ ఐ. దీప్తిమౌనిక, హెల్త్ అసిస్టెంట్ పి. సుబ్బారావు, ఏ యెన్ ఏం ఐ. శ్రీలక్ష్మి, పంచాయతీ సర్పంచ్ నూపా సునీత గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ సంబరాలు

★ గర్భిణులకు చీరలు పంపిణీ





చర్ల, సెప్టెంబర్ 19 :(ప్రజా జ్యోతి): చర్ల మండలంలోని కేశవాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని గుంపెనగూడెం, రైస్‌పేట--1 (రాళ్లగూడెం), దుండుపేట కాలనీ, కేశవాపురం అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్‌లో భాగంగా శనివారం పోషణ సంబరాలు నిర్వహించారు.రైస్‌పేట--1 అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సర్పంచ్ కె. శారద చీరలు అందజేసి శ్రీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులు, పిల్లల ఆరోగ్యం, పోషకాహారం, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సర్పంచ్ కె. శారద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆదిలక్ష్మి అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పి. రాధాకుమారి, పి. వెంకటరమణ, టి. సుభద్ర, కె. శమంతకమణి, పి. అనసూయ, అంగన్‌వాడీ కార్యకర్తలు పి. పార్వతి, వై. నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుని పూజల్లో డాక్టర్ మట్టా



సత్తుపల్లి సెప్టెంబర్ 19(ప్రజా జ్యోతి) పట్టణంలోని హనుమాన్ నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద విజయ్ కుమార్ వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం జరిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవరాత్రులు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, గణనాథుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండి అభివృద్ధి చెందాలని, నిమజ్జనం రోజున ఎటువంటి అపశృతి జరగకుండా, భక్తిశ్రద్ధలతో నిమజ్జనం జరుపుకోవాలని, పలు సూచనలు, సలహాలు కమిటీ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, మహమ్మద్ కమల్ పాషా, వందనపు సత్యనారాయణ,పట్టణ కాంగ్రెస్ నాయకులు,వార్డు కౌన్సిలర్ హకీం, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి: డీఎస్పీ




ఇల్లందు, సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి) రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఇల్లందు డిఎస్పి యు వెంకన్న బాబు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు శనివారం ఇల్లందు పోలీస్ స్టేషన్ సబ్ డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, నేరాలకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలు, ప్రవర్తనపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎవరైనా బెదిరింపులు, దాడులు, అక్రమ కార్యకలాపాలు, ఇతర నేరాలకు పాల్పడితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. రౌడీషీటర్లు తమ గత నేర చరిత్రను పక్కనపెట్టి కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జీవిస్తూ, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా మెలగాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐలు తాటిపాముల సురేష్, బత్తుల సత్యనారాయణ, ఎస్ఐలు తిరుపతి, ఉమా, సారంగపాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# దోచుకున్నోడికి దోచుకున్నంతా..?

★ అశ్వారావుపేటలో గోల్డ్ లోన్ మాయాజాలంపై అనుమానాలు

★ ఒకరి పేరుతో స్లిప్.. మరోరి పేరుతో బంగారం? ప్రైవేట్ గోల్డ్ ఫైనాన్స్‌లకు ఎలా చేరింది?




అశ్వారావుపేట: ప్రజా జ్యోతి సెప్టెంబర్ 19 అశ్వారావుపేటలో వెలుగులోకి వచ్చిన సీఎస్‌బీ బ్యాంక్ గోల్డ్ లోన్ వ్యవహారం పలు అనుమానాలకు తావిస్తోంది. బ్యాంకులో పనిచేస్తున్న 'సుబ్బు' అనే వ్యక్తి పేరును ప్రస్తావిస్తూ, బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన బంగారం శ్రీరామ్ గోల్డ్ ఫైనాన్స్‌తో పాటు పట్టణంలోని పలువురు ప్రైవేట్ గోల్డ్ ఫైనాన్స్ వ్యాపారుల వద్ద తాకట్టు పెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిగితేనే అసలు విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**స్లిప్పులు ఒకరి పేరు.. బంగారం మరొకరి పేరు?**

ఈ వ్యవహారంలో అత్యంత కీలకమైన అంశంగా గోల్డ్ లోన్ స్లిప్పులపై ఉన్న పేర్లు, వాస్తవంగా తాకట్టు పెట్టిన బంగారం ఎవరిది అన్నది మారింది. ఒకరి పేరుతో ఉన్న స్లిప్పులను చూపిస్తూ అదే బంగారాన్ని మరో వ్యక్తి పేరుతో ఇతర గోల్డ్ ఫైనాన్స్ సంస్థల్లో తాకట్టు పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒకే బంగారం వివిధ సంస్థల్లో తాకట్టు పెట్టబడిందా?ఒకే కస్టమర్‌కు సంబంధించిన ఖీజ పత్రాలు ఇతర లావాదేవీలకు ఉపయోగించారా? బ్యాంకు రికార్డులు, గోల్డ్ ప్యాకెట్లు, స్లిప్పులు, ఖీజ వివరాలను సరిపోల్చితే ఏమి బయటపడుతుంది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**సామాన్యుల ఖీజ పత్రాల సంగతేంటి?**

ఈ వ్యవహారంలో మరో ఆందోళనకర అంశం సామాన్య ఖాతాదారుల ఖీజ పత్రాల వినియోగం. తమ పేరుతో ఉన్న పత్రాలు, గోల్డ్ లోన్ స్లిప్పులతో సంబంధం ఉన్నాయంటూ కొందరు వ్యక్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. తమ బంగారం, తమ పత్రాల విషయంలో స్పష్టత కోరుతున్న ఖాతాదారులకు కొన్ని పత్రాలు డూప్లికేట్ అని, మరికొన్ని ఒరిజినల్ అని చెబుతూ వెనక్కి పంపుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

**బ్యాంకు సిబ్బందికి తెలియకుండానే సాధ్యమా?**

గోల్డ్ లోన్‌లో బంగారం స్వీకరణ, పరిశీలన, ప్యాకింగ్, ఖీజ ధృవీకరణ, లోన్ నమోదు, విడుదల వంటి ప్రక్రియలకు రికార్డులు ఉంటాయి. అలాంటప్పుడు ఒకే బంగారం ఒకటి కంటే ఎక్కువ చోట్ల తాకట్టు పెట్టబడిందనే ఆరోపణలు నిజమైతే ఆ బంగారం ఇప్పుడు, ఎవరి ఆధీనంలో ఉంది? ఏ రికార్డులో ఎలా నమోదైంది? అన్నది దర్యాప్తులో తేలాల్సి ఉంటుంది.

# ఘనంగా 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమం



సత్తుపల్లి సెప్టెంబర్19 (ప్రజా జ్యోతి) పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల, అయ్యగారిపేటలో పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రేహానా బేగం, మున్సిపల్ కమిషనర్ శ్రీ నరసింహ, ఎం ఈ ఓ ఎన్. రాజేశ్వర్ రావు హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించినారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటి, వాటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని విద్యార్థులకు తెలియజేశారు. చెట్లు పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తాయని వారు పేర్కొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొని మొక్కలను నాటారు. మొక్కలను సంరక్షిస్తూ పాఠశాల పరిసరాలను పచ్చదనంతో నింపాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# జోనల్ స్థాయి క్రీడా పోటీలకు ఘనంగా శ్రీకారం

★ మార్చ్‌పాస్ట్, క్రీడా జ్యోతితో సందడిగా ప్రారంభం

★ పినపాక, కరకగూడెం మండలాల నుంచి విద్యార్థుల క్రీడా సందడి





పినపాక, సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి) పినపాక మండలంలోని ఏడూళ్ల బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 70వ పినపాక జోనల్ స్థాయి క్రీడా పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పినపాక, కరకగూడెం మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో విద్యార్థుల మార్చ్‌పాస్ట్, క్రీడా జ్యోతి కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం వివిధ క్రీడాంశాల్లో పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పినపాక ఎంఈఓ కొమరం నాగయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడమే జోనల్ స్థాయి క్రీడా పోటీల ప్రధాన ఉద్దేశమన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. పీడీ వీరన్న మాట్లాడుతూ కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, రన్నింగ్‌తో పాటు వివిధ అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వాగబోయిన చందర్‌రావు, ఉపసర్పంచ్ గంగిరెడ్డి సందీప్‌రెడ్డి, పినపాక హెచ్‌ఎం రామిరెడ్డి, పీడీలు వీరన్న, అనిల్, వరలక్ష్మి, రాములమ్మ, బాలరాజు, మహేష్, విజయలక్ష్మి, విజయ, మాజీ వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, గంగిరెడ్డి వెంకటరెడ్డి, పాఠశాల పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, పీఈటీలు, విద్యార్థులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# గణనాథుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి

★ మున్సిపల్ చైర్ పర్సన్ రెహనా కమల్

సత్తుపల్లి సెప్టెంబర్19(ప్రజా జ్యోతి) గణనాథుని నవరాత్రుల సందర్భంగా పట్టణంలోని కల్పతరు రోడ్లో అత్యంత వైభవంగా,ఆధ్యాత్మిక శోభతో గణనాథుని పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్పర్సన్ రెహనా కమల్ హాజరైనారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని ప్రత్యేకంగా ఆహ్వానించి,పూజలు ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన తీర్థప్రసాదాలను అప్పుడే చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణనాథుని ఆశీస్సులు అందరీ పై ఉండాలని,అభివృద్ధి చెందాలని, నిమజ్జనం భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. పండుగలను కులమతాలకు అతీతంగా, సోదరుభావంతో ,శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్లు దూదిపాళ్ల రాంబాబు, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, బొంతు వేణు,గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వరంగల్‌లో భారీగా రద్దయిన పాత నోట్లు పట్టివేత

కేంద్ర ప్రభుత్వం రద్దుచేసిన పాత నోట్లు బారీఎత్తున పట్టు బడ్డాయి. ఒకటికాదు రెండు కాదు ఏకంగా 1కోటి 38 లక్షల రూపాయల పాత కరెన్సీ లభ్యమైంది. ఆ కరెన్సీ మార్పిడికి ప్లాన్ చేస్తున్న ముఠా కటకటాల పాలయ్యారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కాజీపేట పీఎస్ పరిధిలో పోలీసుల చేతికి పాత రూ.500, రూ.1,000 నోట్లు బారీ ఎత్తున పట్టుబడ్డాయి. రద్దయిన ఈ కరెన్సీ 1కోటి 38 లక్షల రద్దు చేయబడ్డ కరెన్సీ పట్టుబడింది. ఇంత పెద్దమొత్తంలో ఎక్కడి నుంచి వచ్చాయి.? ఎక్కడికి వెళు తున్నాయి.? వీటిని ఎలా మార్పిడి చేస్తారు..! అనే కోణంలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది దేశంలో పెద్దనోట్ల రద్దు జరిగి దాదాపు దశాబ్దం కావస్తుంది. 2016 నవంబర్ 08వ తేదిన పెద్ద నోట్ల రద్దు జరిగింది. అప్పట్లో చలామణిలో ఉన్న పాత రూ.500, రూ.1,000 నోట్లు రద్దయ్యాయి. ఈ నోట్ల డిపాజిట్ కు =దీ× కొంత కాలపరిమితి విధించింది. రద్దయిన నోట్లు చెలామణి నేరం.. ఆ నోట్లు చెల్లని కరెన్సీగా గుర్తిస్తారు. తాజాగా హనుమకొండ జిల్లా కాజీపేటలో పోలీసులు రద్దయిన నోట్లను పట్టుకోవడంతో చర్చ మొదలైంది. ఒకప్పుడు చేతిలో ఉంటే విలువైన కరెన్సీ.. ఇప్పుడు చట్టబద్ధ చెల్లుబాటు లేని నోట్లు. మరి ఇంతకాలం తర్వాత ఇవి ఎవరి వద్దకు చేరాయి.? వీటిని ఎందుకు, ఎక్కడికి తరలిస్తున్నారు.? అనే ప్రశ్నలు ఆసక్తి రేపుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అప్పట్లో చలామణిలో ఉన్న రూ.500, రూ.1,000 నోట్ల చట్టబద్ధ చెల్లుబాటును రద్దు చేసింది. నిర్దేశించిన గడువులో వాటిని బ్యాంకుల్లో జమ చేసుకునే అవకాశం కల్పించారు. ఆ గడువు ముగిసిన తర్వాత సాధారణ లావాదేవీల్లో ఆ నోట్లను ఉపయోగించేందుకు వీలు లేదు. రద్దయిన నోట్లు పెద్ద మొత్తంలో ఎవరి వద్దైనా కనిపిస్తే.. వాటి వెనుక ఉన్న వ్యవహారంపై పోలీసులు ఆరా తీయడం సహజం. నోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి.? ఎవరి దగ్గర నుంచి తీసుకున్నారు? ఎక్కడికి తరలిస్తున్నారు? వాటి వెనుక ఏదైనా అక్రమ లావాదేవీ ఉందా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు అయితే కర్ణాటక నుండి ఈ కరెన్సీ తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కారులో వీటిని తరలిస్తున్నారు. పట్టుబడిన వారిలో కర్ణాటక కు చెందిన అబ్బాస్ అలీ, మంచిర్యాల కు చెందిన మల్లేష్, కరీంనగర్ జిల్లా జమ్మికుంట కు చెందిన కృష్ణమోహన్, సిద్దిపేట కు చెందిన సంపత్, హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలానికి చెందిన పల్లపురాజు, వరంగల్ జిల్లా నెక్కొండ మండలానికి చెందిన గణేష్, కరీంనగర్ కు చెందిన శ్యామ్ సుందర్ ఉన్నారు. చెన్నైకి చెందిన రియాజ్ అనే మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. వీరి నుండి కారు, రద్దు చేయబడ్డ కరెన్సీ స్వాధీనం చేసుకున్న పోలీసులు కారు సీజ్ చేశారు. 6 వేల రూపాయలు నగదు, 10 సెల్ ఫోన్లు సీజ్ చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

## డెంగ్యూకి తొలి వ్యాక్సిన్..

### 2027లో అందుబాటులోకి వ్యాక్సిన్

ప్రాణాంతక డెంగ్యూ జ్వరానికి చెక్ పెట్టేందుకు భారతదేశంలో తొలి వ్యాక్సిన్ త్వరలో అందుబాటులోకి రాబోతోంది. జపాన్‌కు చెందిన ప్రముఖ డ్రగ్ మేకర్ టకేడా ఫార్మాస్యూటికల్ తయారు చేసిన 'క్యూడెంగా' వ్యాక్సిన్ పంపిణీకి హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ చారిత్రక ఒప్పందం కుదుర్చుకుంది. దేశవ్యాప్తంగా ఈ వ్యాక్సిన్ ప్రమోషన్, పంపిణీ బాధ్యతలను డాక్టర్ రెడ్డీస్ సంస్థ తీసుకోనుంది. ఈ ఏడాది జూలైలో భారత ఔషధ నియంత్రణ సంస్థ క్యూడెంగా వ్యాక్సిన్‌కు అధికారిక ఆమోదం తెలిపింది. అన్ని అనుమతులు పూర్తి చేసుకుని వచ్చే ఏడాది (2027) ప్రథమార్థంలో ఈ వ్యాక్సిన్ భారత మార్కెట్లో సామాన్యులకు అందుబాటులోకి రానుందని రాయిటర్స్ వార్తా సంస్థ వెల్లడించింది. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి 100 మిలియన్ డోసుల ఉత్పత్తి సామర్థ్యాన్ని చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు టకేడా సంస్థ ప్రకటించింది. ఈ ఒప్పందంతో దేశంలో డెంగ్యూ కట్టడికి బలమైన అస్త్రం దొరికినట్లేనని వైద్య నిపుణులు భావిస్తున్నారు. ఈ క్యూడెంగా వ్యాక్సిన్ మొత్తం నాలుగు రకాల




డెంగ్యూ వైరస్ వేరియంట్లపై సమర్థవంతంగా పోరాడుతుంది. 4 నుంచి 60 ఏళ్ల వయసున్న పిల్లలు, పెద్దలు ఎవరైనా దీనిని తీసుకోవచ్చు. మూడు నెలల వ్యవధిలో రెండు డోసులుగా ఈ ఇంజెక్షన్ ఇస్తారు. గతంలో డెంగ్యూ వచ్చిందా లేదా అనే ముందస్తు పరీక్షలు చేయాల్సిన అవసరం లేకుండానే నేరుగా ఈ టీకా వేయించుకోవచ్చు. తాజాగా నిర్వహించిన క్లినికల్ ట్రయల్స్‌లో ఈ వ్యాక్సిన్ అద్భుతమైన ఫలితాలను నమోదు చేసింది. రెండో డోసు తీసుకున్న ఏడాది తర్వాత డెంగ్యూ కేసులను అడ్డుకోవడంలో 80.2 శాతం సమర్థతను కనబరిచింది. అలాగే ఆసుపత్రిలో చేరాల్సిన ముప్పును ఏకంగా 90.4 శాతం వరకు తగ్గించినట్లు అధ్యయనాలు స్పష్టం చేశాయి. వర్షాకాలంలో దోమల వృద్ధి పెరిగి డెంగ్యూ విజృంభించే భారత్ లాంటి దేశాలకు ఈ టీకా ఎంతో మేలు చేయనుంది. గత రెండు దశాబ్దాల్లో దేశంలో డెంగ్యూ కేసులు ఏకంగా 11 రెట్లు పెరిగినట్లు టకేడా సంస్థ నివేదికలు చెబుతున్నాయి. నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజెస్ కంట్రోల్ (చీజఎదీణజ) గణాంకాల ప్రకారం, ఒక్క 2025లోనే దేశవ్యాప్తంగా 1,13,450 డెంగ్యూ కేసులు నమోదు కాగా 95 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రాణాంతక పరిస్థితుల నేపథ్యంలో, క్యూడెంగా వ్యాక్సిన్ రాక దేశ ప్రజల ఆరోగ్య భద్రతకు పెద్ద భరోసా ఇవ్వనుంది.

## విద్యాసంస్థలపై విజిలెన్స్ తనిఖీలు

### ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులపై ఆరా బోగస్ అడ్మిషన్లతో నిధులు పక్కదారి!

హైదరాబాద్ నగరంలో పలు ప్రైవేటు విద్యాసంస్థల్లో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బోగస్ అడ్మిషన్లతో ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలతో అధికారులు సోదాలు చేస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు పక్కదారి పట్టిస్తున్నారని వివిధ కళాశాలలపై ఆరోపణలున్నాయి. దీంతో బయోమెట్రిక్, సిబ్బంది వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఇబ్రహీంపట్నంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలతో పాటు పలు ప్రైవేటు విద్యాసంస్థల్లో విజిలెన్స్ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని పలు విద్యాసంస్థల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల సోదాలు నిర్వహిస్తున్నారు. ఇబ్రహీంపట్నంలోని గురునానక్ యూనివర్సిటీలో ఈ రోజు ఉదయం నుంచి అధికారులు తనిఖీలు జరుపుతున్నారు. ఈ తనిఖీల్లో విద్యార్థుల వాస్తవ సంఖ్య, కళాశాల రికార్డులు, ప్రవేశాల వివరాలు, స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన డేటా తదితర అంశాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

# వరంగల్ కొత్త ఎయిర్‌పోర్టుకు పేరు సూచించండి




మొదటిపేజీ తరువాయి..

రేవంత్ రెడ్డి ఆ పార్టీ నాయకులు కేవలం తమ కుటుంబ ప్రయోజనాలు, విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లపైనే దృష్టి పెట్టారని వ్యాఖ్యానించారు. ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రజాపాలనలో ఇప్పుడు వరంగల్ ఎయిర్‌పోర్ట్ కల సాకారం అవుతోందని స్పష్టం చేశారు. మామునూరు విమానాశ్రయం భూసేకరణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.295 కోట్ల కేటాయించడంతో పాటు అవసరమైన భూమిని సేకరించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించడంతో క్షేత్రస్థాయిలో కల రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు. ఇది కేవలం విమానాశ్రయం మాత్రమే కాదని, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు పెట్టుబడులకు కొత్త గేట్‌వే అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. అభివృద్ధి చెందుతున్న, అనుసంధానించబడిన తెలంగాణ రాష్ట్రానికి కొత్త చిహ్నంగా నిలవనున్న వరంగల్ మామునూరు విమానాశ్రయం నుంచి ప్రయాణించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. రేవంత్ రెడ్డి ఇటీవల దిల్లీ వెళ్లిన సందర్భంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడితో భేటీ అయ్యారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటులో మిగిలిన పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన రామ్మోహన్‌నాయుడు, ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులతో సమీక్ష చేశారు. పర్యావరణ అనుమతుల అంశం కూడా చర్చకు వచ్చింది. ఇప్పటికే ఏఏఐ అధికారులు సంబంధిత పత్రాలతో దరఖాస్తు సమర్పించిన నేపథ్యంలో త్వరగా ఆ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు.

# ముమ్మాటికీ కాంగ్రెస్ మార్క్ కరవు



మొదటిపేజీ తరువాయి..

సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ, ఈ ఏడాది శ్రీశైలం నుంచి 84 టీఎంసీల నీటిని వినియోగించుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో పేర్కొనడం పచ్చి అబద్ధమని కొట్టిపారేశారు. వాస్తవానికి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా ఇప్పటివరకు కేవలం 8 టీఎంసీల నీటిని మాత్రమే మళ్లించారని ఆయన స్పష్టం చేశారు. కల్వకుర్తి పథకంలోని ఐదు మోటార్లలో కేవలం రెండే పని చేస్తుండటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. గత మూడేళ్లలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ 718 టీఎంసీల నీటిని వినియోగించుకోగా, తెలంగాణ కేవలం 216 టీఎంసీలకే పరిమితమైందని ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే అత్యంత తక్కువ స్థాయిలో కృష్ణా జలాలను వినియోగించుకోవడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. "నీళ్లు అందుబాటులో ఉన్నాయి, ఎత్తిపోసేందుకు మోటార్లు సిద్ధంగా ఉన్నాయి. అయినప్పటికీ నీటిని మళ్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది. అందుకే ఇది కాలం తెచ్చిన కరవు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరవు" అని ఆయన ఎద్దేవా చేశారు. ఏపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టుల ద్వారా అక్రమంగా నీటిని తరలించుకుపోతున్నా, తెలంగాణ ప్రభుత్వం మౌనంగా ఉండటం దారుణమని దుయ్యబట్టారు.

# జన్వాడ ఫాంహౌస్ పరిశీలించిన కాంగ్రెస్ నేతలు..

మొదటిపేజీ తరువాయి..

ఫామ్‌హౌస్ నిర్మాణం, భూముల యాజమాన్యం, నాలా ఆక్రమణలకు సంబంధించిన అంశాలపై కాంగ్రెస్ నేతలు.. సంచలన ఆరోపణలు గుప్పించారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులతో మాట్లాడి వాస్తవాలను వెలుగులోకి తీసుకువస్తామని వారు తెలిపారు. ప్రజాభవన్ నుంచి బస్సులో బయలుదేరిన కాంగ్రెస్ నేతల బృందం జన్వాడకు చేరుకుంది. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, అనిల్ యాదవ్‌లతోపాటు.. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సీనియర్ నేత కోదండరెడ్డి సహా పలువురు కీలక నేతలు ఈ పర్యటనలో పాల్గొన్నారు. నేతల పర్యటన నేపథ్యంలో జన్వాడ ఫామ్‌హౌస్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఫామ్‌హౌస్‌ను బుల్కాపూర్ నాలాపై నిర్మించారని.. భవన నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉందని ఎంపీ మల్లు రవి ఆరోపించారు. ఫామ్‌హౌస్ ఎవరి పేరుపై ఉందనే విషయంలోనూ స్పష్టత లేదని ఆయన పేర్కొన్నారు. భూములకు సంబంధించిన లెక్కలు, నిర్మాణ అనుమతులను పరిశీలించి ప్రజలకు వాస్తవాలను తెలియజేయడానికే తాము ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. జన్వాడ ప్రాంతంలోని భూముల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై సంబంధిత అధికారులను సంప్రదిస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పారు. ముఖ్యంగా బుల్కాపూర్ నాలా విషయంలో ఆక్రమణలు జరిగాయన్న ఆరోపణలు కూడా ఈ సందర్భంగా తెరపైకి వచ్చాయి. జన్వాడ ఫామ్‌హౌస్ భూములపై ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పలు ప్రశ్నలు సంధించారు. ఇన్ని ఎకరాల్లో ఫామ్‌హౌస్ నిర్మాణం ఎలా జరిగిందని ఆయన ప్రశ్నించారు. సర్వే నంబర్లు 311, 301, 313కు సంబంధించిన భూములపై అక్రమాలు ఉన్నాయా లేదా పరిశీలించాలని కోరారు. ఈ భూములకు గతంలో సత్యం రామలింగరాజుకు సంబంధించిన సంస్థలతో సంబంధం ఉందని చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతరం భూముల బదిలీలపై కూడా ఆయన పలు ఆరోపణలు చేశారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన పత్రాలు, అధికారిక రికార్డులపై పూర్తి స్థాయి పరిశీలన అవసరమని ఆయన అన్నారు. జన్వాడ ఫామ్‌హౌస్ విషయంలో కేటీఆర్ పేరు ప్రస్తావిస్తూ కూడా చామల కిరణ్‌కుమార్ రెడ్డి పలు ఆరోపణలు చేశారు. ఫామ్‌హౌస్ యాజమాన్యం, భూముల బదిలీలపై పూర్తి వివరాలను వెలికితీస్తామని చెప్పారు. కేటీఆర్‌కు సన్నిహితుడిగా పేర్కొంటున్న ప్రదీప్‌రెడ్డికి ఈ భూములు ఎలా వచ్చాయనే అంశంపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు. జన్వాడ ఫామ్‌హౌస్ భూముల పరిశీలన సందర్భంగా కాంగ్రెస్ నేతలు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను ఫోన్‌లో సంప్రదించారు. బుల్కాపూర్ నాలా ఆక్రమణకు గురైందన్న ఆరోపణలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నాలా ఆక్రమణలపై పరిశీలన చేసి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు ఉన్నట్లయితే చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ అధికారులతోనూ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. జన్వాడలోని ఫామ్‌హౌస్ భవన నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా అనే అంశంపై ఆయన ప్రశ్నించారు. గతంలో నిర్మాణ అనుమతుల గురించి అడిగినప్పుడు సర్పంచ్ అనుమతితో నిర్మించుకున్నట్లు యజమాని చెప్పినట్లు మున్సిపల్ కమిషనర్ వెల్లడించినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. కాంగ్రెస్ నేతల బృందం జన్వాడ ఫామ్‌హౌస్ వద్దకు చేరుకున్న సమయంలో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ నేతలను అడ్డుకునేందుకు అక్కడికి బీఆర్ఎస్ కార్యకర్తలు చేరుకున్నారు. దీంతో వారిని పోలీసులు చెదరగొట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జన్వాడ ఫామ్‌హౌస్ వద్ద భారీగా పోలీసు బందోబస్తు



ఏర్పాటు చేశారు. జన్వాడ భూములు, ఫామ్‌హౌస్ నిర్మాణం, నాలా ఆక్రమణలపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి అధికారికంగా భూముల రికార్డులు, నిర్మాణ అనుమతులు, నాలా హద్దులకు సంబంధించిన వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది. కాంగ్రెస్ నేతలు చేసిన ఆరోపణలపై సంబంధిత వ్యక్తులు, బీఆర్ఎస్ నేతల అధికారిక స్పందన కూడా ఈ వ్యవహారంలో కీలకం కానుంది.

మరోవైపు ఎర్రవల్లి భూముల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలోని భూములపై రెవెన్యూ అధికారులు చేపట్టిన సర్వే కొనసాగుతున్న వేళ.. తాజాగా శివారు వెంకటాపూర్ గ్రామస్థులు కొత్త డిమాండ్‌ను తెరపైకి తీసుకొచ్చారు. సర్వే నంబర్ 325లో ఉన్న మొత్తం 388 ఎకరాల్లో తమ గ్రామానికి చెందిన భూములు కూడా ఉన్నాయని వారు చెబుతున్నారు. ఇందులో సుమారు 180 ఎకరాలు వెంకటాపూర్‌కు చెందినవేనని గ్రామస్థులు వాదిస్తున్నారు. మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 325లో సుమారు 388 ఎకరాల భూముల హద్దులు, రికార్డులను రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ భూములు ఎర్రవల్లి, శివారు వెంకటాపూర్, వరదరాజుపూర్ ప్రాంతాలకు విస్తరించి ఉన్నట్లు అధికారులు గుర్తిస్తున్నారు. శుక్రవారం నాటికి 388 ఎకరాల భూముల బౌండరీని శాటిలైట్ సాయంతో నిర్ధారించినట్లు సమాచారం. శనివారం కూడా ప్రత్యేక బృందాలతో సర్వే కొనసాగింది. సర్వే నంబర్ 325లోని 388 ఎకరాల్లో ఎర్రవల్లి గ్రామానికి 250 ఎకరాలు మాత్రమే ఉన్నాయని వెంకటాపూర్ గ్రామస్థులు చెబుతున్నారు. మిగిలిన భూమిలో సుమారు 180 ఎకరాలు తమ గ్రామ పరిధికి చెందినవేనని వారు పేర్కొంటున్నారు. గతంలో అధికారుల రికార్డుల నిర్వహణలో జరిగిన తప్పిదాల కారణంగా తమ భూములు ఎర్రవల్లి సర్వే నంబర్‌లోకి వెళ్లాయని వారు ఆరోపిస్తున్నారు. పాత ఖాస్రా, సేత్వార్ రికార్డులను ఆధారంగా తీసుకుని భూముల హద్దులను నిర్ణయించాలని వెంకటాపూర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలో తమ గ్రామానికి చెందిన భూములకు అన్యాయం జరగకుండా చూడాలని అధికారులను కోరుతున్నారు. అయితే ఈ హక్కు వాదనపై తుది నిర్ణయం అధికారిక రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం వెలువడాల్సి ఉంది. ఇదిలా ఉంటే సర్వే నంబర్ 325లో వ్యవసాయం చేస్తున్న రైతులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. మొత్తం 215 మంది రైతులకు నోటీసులు ఇవ్వాలని అధికారులు నిర్ణయించగా.. తొలివిడతలో 50 మందికి నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. ఈ నెల 21వ తేదీ నుంచి నాలుగు విడతల్లో రైతుల సమక్షంలో తదుపరి ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలుస్తోంది. నోటీసుల్లో పేర్కొన్న తేదీన రైతులు తమ భూముల వద్దకు హాజరై సంబంధిత వివరాలను అధికారులకు తెలియజేయాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో ప్రస్తుతం ఎవరు భూమిని సాగు చేస్తున్నారు, ఎవరి ఆధీనంలో ఉంది అనే వివరాలను కూడా అధికారులు నమోదు చేయనున్నారు. దీనిని ఎంజాయ్‌మెంట్ సర్వేగా నిర్వహించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎర్రవల్లి భూముల వ్యవహారంలో కేవలం భూముల కొలతలకే పరిమితం కాకుండా పాత రెవెన్యూ రికార్డులను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన హద్దులను పాత రికార్డులతో సరిపోల్చి భూముల స్వభావం, హక్కులు, సాగు వివరాలను నిర్ధారించే ప్రక్రియ కొనసాగుతోంది.

# 2047నాటికి అభివృద్ధి దిశగా భారత్ అడుగులు

మొదటిపేజీ తరువాయి..

అన్నారు. కొత్త మార్కెట్లకు భారత వ్యాపారులు చేరుకోవడంతో పాటు, యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాల ఆధారంగా కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన 20వ రోజ్‌గార్ మేళాలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యువతను ఉద్దేశించి ప్రధాని ఈ మేరకు మాట్లాడారు. ఈ సందర్భంగా 51వేల మందికి నియామకపత్రాలు అందజేశారు. భారత్ ఇప్పటివరకు వివిధ దేశాలతో 40 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని ప్రధాని మోదీ తెలిపారు. వీటి ద్వారా భారత వ్యాపారులకు కొత్త భాగస్వామ్యాలు, కొత్త మార్కెట్లు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. అదే సమయంలో యువతకు కెరీర్‌లో కొత్త మార్గాలు తెరుచుకుంటున్నాయని పేర్కొన్నారు. భారత యువత నైపుణ్యాలు, ప్రతిభపై ప్రపంచ దేశాల్లో విశ్వాసం పెరుగుతోందని మోదీ అన్నారు. ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, యువత నుంచి ప్రపంచానికి భారీ అంచనాలు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ సేవల్లో చేరుతున్న యువత ప్రతి నిర్ణయంలోనూ దేశాన్ని అభివృద్ధి, స్వావలంబన దిశగా తీసుకెళ్లే ఆలోచనను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. యువతకు ఇతర యువత పట్ల ప్రత్యేక బాధ్యత ఉందని చెప్పారు. ఇటీవల ముగిసిన బ్రిక్స్ సదస్సును ప్రధాని మోదీ ప్రస్తావించారు. బ్రిక్స్ సహకారం కేవలం ప్రభుత్వాలకే పరిమితం కాకూడదని అన్నారు. భారత పారిశ్రామికవేత్తలు, రైతులు, మహిళలు, యువత కూడా ఈ భాగస్వామ్యంలో చురుకైన భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. అంతర్జాతీయ



వేదికలపై భారత్ పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో దేశ యువత తమ నైపుణ్యాలను మరింతగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ప్రతి రంగంలోనూ శరవేగంగా మార్పులు జరుగుతున్నాయని ప్రధాని మోదీ అన్నారు. 'నిరంతరం నేర్చుకుంటూనే మీరు ఈ స్థాయికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి మళ్లీ కొత్త విషయాలు నేర్చుకునే సరికొత్త ప్రయాణం ప్రారంభమవుతుంది. మీరు ఎల్లప్పుడూ మీ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. కొత్త సాంకేతికతను, కొత్త వ్యవస్థలను అర్థం చేసుకోవాలి. 'మిషన్ కర్మయోగి'ఈ లక్ష్యాన్ని చేరుకోవటంలో మీకు సాయపడుతుంది. ప్రభుత్వం అసలైన బలం పౌరులకు దానిపై ఉన్న నమ్మకమే. ఆ నమ్మకం ఎలా వస్తుందంటే.. పౌరులకు ప్రభుత్వంతో ఎలాంటి అనుభవం ఎదురైందనే దాన్ని వల్ల వస్తుంది. ప్రభుత్వ సేవలో మన తారకమంత్రం ఒక్కటే కావాలి. 'నాగరిక్ దేవో భవ'. పౌరులకు సేవ చేయడమంటే దేశానికి సేవ చేయడమే. మీ పనితీరు వల్ల ఏ పౌరుడి జీవితమైనా సులభతరమైతే, అప్పుడే మీ విజయం మరింత ఉన్నతస్థాయికి చేరుకుంటుంది' అని ప్రధాన మోదీ పేర్కొన్నారు. 20వ రోజ్‌గార్ మేళాలో భాగంగా 51 వేల మందికి పైగా కొత్తగా నియమితులైన యువతకు నియామక పత్రాలు అందించారు. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగా ఎంపికైన అభ్యర్థులు రెవెన్యూ విభాగం, రైల్వేలు, హోం వ్యవహారాలు, ఆరోగ్యం-కుటుంబ సంక్షేమం, ఆర్థిక సేవలు, రక్షణ తదితర కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో విధుల్లో చేరనున్నారు. ఈ 20వ రోజ్‌గార్ మేళాతో కలిపి ఇప్పటివరకు వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో సుమారు 12.75 లక్షల మంది యువతకు నియామక పత్రాలు అందినట్లు ప్రధాని కార్యాలయం వెల్లడించింది.

# గుండాల గోండు గూడ గ్రా మంలో 'పోలీసులు మీకోసం

ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 19,(ప్రజా జ్యోతి) ప్రజలకు మరింత చేరువై వా రి సమస్యలను నేరుగా తె లుసుకోవడం, గ్రామాల్లో పో లీసు-ప్రజల సత్సంబం ధాల ను బలోపేతం చేయడం, నే రాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొం దించడం లక్ష్యంగా ఆదిలా బాద్ జిల్లా పోలీసు శాఖ ఆ ధ్వర్యంలో నిర్వహిస్తున్న 'పో లీసులు మీకోసం' కార్యక్ర మంలో భాగంగా శనివారం నార్నూర్ మండలం గుండా ల గోండు గూడ గ్రామంలో ని ర్వహించిన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలో ఏ ర్పాటు చేసిన "పోలీసులు మీకోసం" కార్యక్రమానికి వి చ్చేసిన జిల్లా ఎస్పీతో పాటు పోలీసు అధికారులకు గ్రామ మహిళలు సంప్రదాయ పద్ధ తిలో ఘన స్వాగతం పలికా రు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గంజా యి, ఇతర మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామ ప్రజలు, యువతకు అవగా హన కల్పించారు. "గంజా యి పై యుద్ధం చేయాలి, మార్పు వల్లే గంజాయిని స మాజం నుంచి దూరం చేయ వచ్చు" అని జిల్లా ఎస్పీ పే ర్కొన్నారు. గ్రామాల్లో ఎవరై నా గంజాయి సాగు చేస్తు న్నా లేదా మాదకద్రవ్యాల వ్యాపారం



నిర్వహిస్తున్నా వెంటనే పోలీసులకు సమా చారం అందించాలని కోరా రు. మాదకద్రవ్యాల నిర్మూల నలో ప్రజల సహకారం అ త్యంత అవసరమని, గంజా యి రహిత సమాజ నిర్మాణ మే జిల్లా పోలీసుల లక్ష్యమ ని తెలిపారు. చదువు పట్ల ఉన్న ఆవశ్యకతను తెలియ జేశారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివేలా తల్లి దండ్రులు ప్రోత్సహించాలి అని తెలిపారు. చదువు వల్ల భవిష్యత్తు మారుతుం దని తెలిపారు. పాఠశాల వి ద్యార్థిని విద్యార్థులకు 50 పుస్తకాలు పెన్నులను అంద జేశారు. అదేవిధంగా నకిలీ బాబాలను, మంత్రాలను తంత్రాలను ఎలాంటి వైద్య అవసరం ఉన్న, ప్రభుత్వం గుర్తించిన ప్రభుత్వ ప్రైవేటు వైద్యులను సంప్రదించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్య త అని, చిన్న నిర్లక్ష్యం కూ డా ప్రాణనష్టానికి దారితీ స్తుందని పేర్కొన్నారు. ద్వి చక్ర వాహనదారులు తప్ప నిసరిగా హెల్మెట్ ధరించాల ని, అతివేగం, మద్యం సేవిం చి వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్ వంటి ప్ర మాదకర చర్యలకు దూరం గా ఉండాలని సూచించారు.
దేవిధంగా మంచి ఆహారపు అలవాట్లను అలవాటు చేసుకోవాలని, పూర్వకాలం లో మన పూర్వీకులు తిన్న టువంటి జొన్న ఆహారాన్ని తీసుకోవాల్సిందిగా సూచిం చారు. రక్తహీనతతో బాధ పడు తున్న వారు వైద్య ప రీక్షలను చేయించుకుని, సరైన చికిత్సను తీసుకోవా లని సూచించారు. ముఖ్యం గా ఫ్లోరైడ్ సమస్యతో బాధ పడుతున్న గ్రామానికి త్వర లోనే ఒక ఆర్ ఓ వాటర్ ప్లాంట్ ను అందజేయడం జరుగుతుందని దానిని గ్రా మ పంచాయతీ తరుపున సక్రమంగా నిర్వహించాలని సూచించారు.
గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును ప్రారంభించారు. దాదాపు ఆరు రంగాలలో నిష్ణాతులైన ఆదిలాబాద్ లోని ప్రైవేటు వైద్యుల బృందం చే గ్రామస్తులందరికీ ఉచితంగా మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయడం జరిగిందని ఈ క్యాంపులో 200 మంది గ్రామస్తులు పాల్గొని జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, గైనకాలజీ, ఆప్తమాలజీ, డెంటల్, పీడియాట్రిషన్ విభాగాలలో వైద్య పరీక్షలను ఉచితంగా మందులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో 200 మంది గ్రామస్తులు, మహిళలు, వృద్దులు చిన్నారులు పాల్గొని వైద్య పరీక్షలను చేయించుకున్నారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967

## జక్కుల చెరువు గిద్ద చెరువు వినాయక నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలన.....



**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి) :** ఎల్లారెడ్డిపేట మండలం లోని రాచర్ల బొప్పాపూర్ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గిద్ద చెరువు జక్కుల చెరువు సమీపంలో నవరాత్రి వినాయక నిమజన ఏర్పాట్లను పరిశీలించి గ్రామ సర్పంచి ఎలగందుల నరసింహులు అక్కడ ఉన్న పరిస్థితుల పైన ఆరా తీశారు .అదేవిధంగా రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని జక్కుల చెరువు ప్రాంతంలో వినాయక నిమజ్జల ఏర్పాట్లను పరిశీలించిన ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు పోలీసులు సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేష్ ఎస్సై రమేష్ గ్రామ సర్పంచ్ గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి ఉప సర్పంచ్ పాలకవర్గం ఏర్పాట్లను పరిశీలించారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ముస్తాబాద్, సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి) :** ముస్తాబాద్ మండల్ పోతుగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ అభివృద్ధి, నిర్మాణ పనులకు మంజూరైన రూ.28.50 లక్షల నిధులతో చేపట్టనున్న పనులకు శనివారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ అభివృద్ధి పనులకు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు, ఆత్మ కమిటీ సిరిసిల్ల డివిజన్ చైర్మన్, సెస్ డైరెక్టర్, ముస్తాబాద్ మండల ఎస్సై, మండల ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ కార్యాలయ అభివృద్ధి పనులతో రైతులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని నిర్వాహకులు తెలిపారు. వ్యవసాయ మార్కెట్‌కు వచ్చే రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు కార్యాలయ అభివృద్ధికి ఈ నిధులు వినియోగించనున్నట్లు పేర్కొన్నారు.

## కోనరావుపేటలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా కుంకుమ పూజలు



**కోనరావుపేట,సెప్టెంబర్.19 (ప్రజాజ్యోతి) :** కోనరావుపేట మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద మహిళలలు ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు.

వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా ఆర్యవైశ్య మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని భక్తి శ్రద్ధలతో పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. వినాయకునికి మహిళలు పూలు, పండ్లు, కొబ్బరికాయలు సమర్పించి తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో జాతీయ పోషణ మాసం



**చొప్పదండి, సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి):** చొప్పదండి మండలం ఆర్నకొండ గ్రామంలోని అంగన్వాడి కేంద్రం 1 లో 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తల్లులకు పోషణ ప్రాముఖ్యత గురించి వివరించారు. బిడ్డకు రెండు సంవత్సరాలు వచ్చే వరకు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. తల్లులు కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. అంగన్వాడి టీచర్లు లక్ష్మీ ,శైలజ, అమృత, మనీషా, సరోజ, ఐకెపి సీఏ తార, సీసీ చంద్ర నారాయణ పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేయాలి

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి..
- కలెక్టర్ చిత్రా మిశ్రా





**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. ముఖ్యంగా నిరుపేదలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలలో అర్హులైన ఒక్కరూ మిస్ కాకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులు, ఎంపీడీవోలతో కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా వివిధ కార్యక్రమాల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, ఈజీఎస్ పనులు, నీటి కుంటలు, ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్లు, చేయూత పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం అమలు, ప్రజాపాలన, ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై సమీక్షించారు.

**ఇందిరమ్మ ఇళ్ల పనులకు వేగం పెంచాలి :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణం ఇంకా ప్రారంభం కాని, వివిధ దశల్లో ఉన్న చోట్ల పనులను వేగవంతం చేయాలని సూచించారు. లబ్ధిదారులతో సమన్వయం చేసుకుంటూ నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పూరి గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, లబ్ధిదారులు నిర్మాణ పనులను ప్రారంభించి పూర్తి చేసేలా అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత పనులను సైతం సత్వరమే చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**అర్హులెవరూ చేయూతకు దూరం కాకూడదు :** చేయూత పింఛన్ల విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ఇతర అర్హత కలిగిన లబ్ధిదారులందరికీ పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అర్హత ఉన్న ఒక్కరూ పింఛన్‌కు దూరం కాకూడదని, క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించాలని స్పష్టం చేశారు.

**గ్రామీణ మౌలిక వసతులకు ప్రాధాన్యం :** గ్రామాల్లో సీసీ రోడ్లు, ఈజీఎస్ పనులు, నీటి కుంటలు, ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్ల నిర్మాణ పనులను నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి చేపడుతున్న పనుల్లో జాప్యం లేకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.

అదేవిధంగా గ్రామాల్లో వీఓ భవనాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

ప్రజా దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి ప్రజాపాలన, ప్రజావాణి ద్వారా అందిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని కలెక్టర్ అన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలు, అభ్యర్థనలను అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి పరిష్కారం చూపాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అమలులో క్షేత్రస్థాయి అధికారుల పనితీరు కీలకమని, ప్రతి కార్యక్రమంలో స్పష్టమైన పురోగతి కనిపించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఆర్డీవో గీత, ఎంపీడీవోలు, గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు







- శాంతియుత వాతావరణంలో శోభాయాత్రలు నిర్వహించాలి
- భక్తులు, నిర్వాహకులు అధికారులకు సహకరించాలి
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్

**కోరుట్ల, సెప్టెంబర్ 19 ప్రజాజ్యోతి :** కోరుట్ల పట్టణంలో ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించనున్న వినాయక నిమజ్జన వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. భక్తులు, వినాయక మండపాల నిర్వాహకులు అధికారులకు సహకరిస్తూ శోభాయాత్రలు, నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా నిర్వహించాలని కోరారు.

– నిమజ్జన ప్రాంతంలో ఏర్పాట్ల పరిశీలన

కోరుట్ల పట్టణంలోని వాగు వద్ద వినాయక నిమజ్జనానికి మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక తదితర శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి శనివారం పరిశీలించారు.

– భక్తిశ్రద్ధలతో నిమజ్జనం నిర్వహించాలి

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులు తమ విగ్రహాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా తరలించాలని సూచించారు. ప్రతి ఒక్క నిర్వాహకుడు అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శోభాయాత్ర, నిమజ్జన వేడుకలు నిర్వహించుకోవాలని కోరారు.

– శాఖల సమన్వయంతో పక్కా ప్రణాళిక

నిమజ్జన వేడుకల కోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పక్కా ప్రణాళిక రూపొందించి ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నిమజ్జన ప్రదేశంలో అవసరమైన వేదికలు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్య సేవలు, అగ్నిమాపక శాఖ, మత్స్యశాఖ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

– క్రేన్లు, గజ ఈతగాళ్లు అందుబాటులో ఉండాలి

నిమజ్జన ప్రదేశాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని, భారీ క్రేన్లు, చిన్న క్రేన్లు, గజ ఈతగాళ్లను అవసరమైన మేరకు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో అదనపు వనరులు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

**పిల్లల భద్రతపై ప్రత్యేక దృష్టి :** వినాయక నిమజ్జనం సందర్భంగా పట్టణవాసులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు, పిల్లలు తరలివచ్చే అవకాశం ఉన్నందున అధికారులు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. భక్తులందరూ భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిమజ్జన వేడుకలను నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జీవాకర్ రెడ్డి, మెట్ పల్లి డిఎస్పి రాములు, కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ శ్యామ్ రాజ్, మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ అరుణ్ ,కోరుట్ల ఎమ్మార్వో కృష్ణ చైతన్య, రెవిన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ యాదవ్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో గణనాథుడికి ఘన పూజలు

## సిబ్బందికి స్వయంగా భోజనం వడ్డించిన కలెక్టర్ చిత్రామిశ్రా





**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి) :** విఘ్నాలు తొలగించి జిల్లా ప్రజలకు సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షిస్తూ కరీంనగర్ కలెక్టరేట్‌లో కొలువుదీరిన గణనాథుడికి జిల్లా కలెక్టర్ చిత్రామిశ్రా శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో గణేశుడికి ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. పూజా కార్యక్రమాల అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ అధికారులు, సిబ్బందికి స్వయంగా భోజనం వడ్డించి వారితో ఆత్మీయంగా మెలిగారు. జిల్లా కలెక్టర్ స్వయంగా సిబ్బందికి భోజనం వడ్డించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విధి నిర్వహణలో అధికారులు, సిబ్బందితో కలిసి పనిచేస్తున్న కలెక్టర్.. గణేష్ ఉత్సవాల సందర్భంగా వారితో కలిసి అన్నదానంలో పాల్గొని ఆత్మీయతను చాటారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, డి. శ్రీనివాస్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్వో స్వామి, జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పండుగల సందర్భంగా నిర్వహించే సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యత ఆత్మీయతను పెంపొందిస్తాయి






### మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు.


**వేములవాడ, సెప్టెంబర్, 19 ప్రజాజ్యోతి :** శనివారం రోజున వేములవాడ పట్టణంలో పలు యూత్ ల ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమాలలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు చైర్మన్ మాట్లాడుతూ గణనాథుని భక్తితో పూజించడంతో పాటు ప్రతిరోజు అన్నదానాలు నిర్వహించడం చాలా సంతోషకరమని యువత ఉత్సాహంగా ముందుకు వచ్చి భక్తి కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం చాలా అభినందనీయమని వారన్నారు.పండుగలు కేవలం ఆధ్యాత్మికతకు మాత్రమే పరిమితం కాకుండా సమాజ సేవకు వేదికలుగా నిలవాలని యువత లో సేవా భావం మరింత పెంపొందితే సమాజానికి సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని వారన్నారు. ఈ కార్యక్రమాలలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రముఖులు,పలు యూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు మరింత ప్రత్యేక నిఘా

### తెలంగాణ చౌక్, మంచిర్యాల చౌరస్తాలో ఔట్‌పోస్ట్‌లు ప్రారంభం



**కరీంనగర్ క్రైం, సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి) :** నగరంలో ట్రాఫిక్‌ను మరింత క్రమబద్ధీకరించడంతో పాటు ప్రయాణికులు, వాహనదారుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ తెలంగాణ చౌక్,మంచిర్యాల చౌరస్తాలో ఏర్పాటు చేసిన నూతన ట్రాఫిక్ ఔట్‌పోస్ట్ బూత్‌లను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ, నిరంతర పర్యవేక్షణకు ఇవి కీలకంగా పనిచేస్తాయని తెలిపారు.





నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే పరిష్కరించేలా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సీపీ సూచించారు. ప్రయాణి కులు, వాహనదారులకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా ట్రాఫిక్ ప్రవాహాన్ని పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రద్దీ సమయాల్లో ప్రత్యేక దృష్టి సారించి ట్రాఫిక్ నియంత్రణను సమర్థవం తంగా చేపట్టాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు సంజీవ్, అంజయ్య, సబ్ఇన్‌స్పెక్టర్లు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## మీ ప్రియమైన శత్రువు

భస్మాసుర హస్తాన్ని
నేనెందరికో నేస్తాన్ని
లేదు ఆహ్వానించని దేశం
చేస్తున్న మారణ హోమం

నేనంటే ఎంత ఇష్టమో
నిత్యవసరాలు కాదని
నన్ను కొనుక్కుంటారు
నేను వాళ్ళ చలనాన్ని కొరుక్కుంటున్నాను

ఎంతెంత అభిమానం నేనంటే
విశ్వవిద్యాలయాలు, కళాశాలలు దాటి
పాఠశాలలకు పాకింది
ప్రాథమిక దశలోనే నన్ను పొదువుకుంటున్నారు
ఆపాదమస్తకం నేను పాదుకుంటున్నాను
పాడే వైపు దారి చూపిస్తున్నాను

నా కోసం ఎంతైనా ఖర్చు చేస్తారు
నేను దొరక్కుంటే పిచ్చెక్కిపోతారు
నన్ను పొందుటకు
చేస్తున్నారు మోసం
ఇంట్లో బయిట,
ఆఖరికి ఒళ్ళు కూడ అమ్ముకుంటున్నారు

మత్తు కోసం నన్ను వరిస్తున్నారు
మెల్లగా ప్రాణాలను హరిస్తున్నాను

మానవ మనుగడకు ముప్పు ను
మీగడ లా తినేస్తున్నారు
ఆపై వదలి పోతున్నారు
కడలి లో కలుస్తున్నారు

నేనొక ప్రపంచ సమస్యను
ఎలా ఎదుర్కోవాలో
ఎలా నిర్మూలించాలో
ఆలోచించించే
సమయం లేదే నాయకునికి
ఏ దేశానికి

నన్ను తిని నన్ను తాగి
నిర్వీర్యమౌతున్న
యువతను చూడలేక
నేనే చెబుతున్నా
నన్ను తరమండి
ఆరోగ్యంగా ఉండండి
నవ యువత మీరు
దేశ భవిత మీరు

మీ ప్రియమైన శత్రువు
డ్రగ్స్



ఎర్రం రాజారెడ్డి
కరీంనగర్
98492 59071

## రుణాలతో ఆదాయం పెంచుకోవాలి



**కొడిమ్యాల, సెప్టెంబర్ 19, (ప్రజాజ్యోతి) :** స్వయం సహాయక సంఘాల సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆదాయ మార్గాలను పెంపొందించుకోవాలని సెర్ప్ సంస్థాగత నిర్మాణం ప్రాజెక్ట్ మేనేజర్ భారతి సూచించారు.శనివారం మండల కేంద్రంలో వసుంధర గ్రామ సంఘం అధ్యక్షురాలు నిరీక్షణ అధ్యక్షతన సంఘాల సభ్యులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్పీలు సులోచన, మానస స్వయం సహాయక సంఘాల అభివృద్ధిపై అవగాహన కల్పించారు. సంఘాల సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ సభ్యుల సమస్యలను చర్చించుకోవాలని సూచించారు. ఆరోగ్య పరిరక్షణకు ఆకుకూరలు, కోడిగుడ్లు వంటి పోషకాహారాన్ని తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఏపీఎం ఐబీ గంగాధర్, ఏపీఎం మల్లేశం, సీసీలు వీరకుమార్, మంగ, వీఓఏలు స్వప్న, అన్నపూర్ణ, నర్మద, రాణి, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి

- ఈనెల 23,24,25 తేదీలలో గణేష్ నిమజ్జనాలు పూర్తి చేయాలి

**రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ రాయికల్, సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి) :** రాయికల్ పట్టణంలో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నటువంటి గణేష్ నవరాత్రి ఉత్సవాలు, అదే భక్తి భావంతో, ఉత్సాహంతో ఈనెల 23,24,25 తేదీలలో ముగించాలని,ప్రజలకు ఇబ్బందులు కలగకుండా దీనికి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని రాయికల్ మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాయికల్ పట్టణంలో గణేష్ నిమజ్జనం ఉత్సవాలు ఈనెల 23,24,25 తేదీలలో నిర్వహించడం జరుగుతున్నదని,దీనికి రాయికల్ మున్సిపల్ ఆధ్వర్యంలో భక్తులకు,ప్రజలకు,యువజన సంఘాల సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు కలగాకుండా అన్ని రకాల వసతులు ఏర్పాటు చేయడం జరుగుతున్నదని,అలాగే భారీ గణపతి విగ్రహాలను నిమజ్జనం చేయడానికి క్రేన్ సౌకర్యం కల్పించడం జరిగిందని ఆయన తెలిపారు. ఇట్టి వసతులు పోలీస్ శాఖ ఆదేశాల మేరకు ఈనెల 23, 24,25 తేదీలలో మాత్రమే సమకూర్చడం జరుగుతుందని, అటు తర్వాత వసతులు కల్పించబడవని దీనిని భక్తులు, యువజన సంఘాల సభ్యులు,పట్టణ ప్రజలు గమనించాలని కోరారు. పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా గణేష్ మండప నిర్వాహకులు నిమజ్జన కార్యక్రమాలను పూర్తి చేయాలని ఆయన కోరారు.పట్టణ ప్రజలు అందరూ గణేష్ నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా జరుపుకోవాలని, దీనికి పట్టణ ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు.